www.andhrajyothy.com
హైదరాబాద్ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 99
బుధవారం | 24-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: తదియ ఉ. 7.30, చవితి తె. 4.39 వరకు; నక్షత్రం: శతభిషం సా. 6.14 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: రా.12.06-1.34; దుర్ముహూర్తం: ఉ.11.55-12.47; అమృతఘడియలు: ఉ.11.39-1.06; రాహుకాలం: మ.12.00-1.40; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.47
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సర్కారీ సంతలు

యువ మిత్ర

మొత్తం బడ్జెట్
48,20,512 కోట్లు
అందులో అప్పులు 14 లక్షల కోట్లు



యువత నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాలు లక్ష్యంగా బడ్జెట్

బీజేపీ మిత్రపక్షాల రాష్ట్రాలకు నిధుల్లో పెద్దపీట

బిహార్‌కు రూ.26 వేల కోట్లతో రోడ్లు, వంతెనలు
విద్యుత్తు ప్లాంటు, ఎయిర్‌పోర్టులు, వైద్య కాలేజీలూ
యువతకు రూ.2 లక్షల కోట్లతో పీఎం ప్యాకేజీ
కొత్త ఉద్యోగులకు నెల జీతం ఇవ్వనున్న ప్రభుత్వం
రూ.15 వేల వరకు 3 విడతల్లో చెల్లింపు
ఐదేళ్లలో 5 పథకాల కింద 4.1 కోట్ల యువతకు లబ్ధి
20 లక్షల మందికి శిక్షణ, కోటిమందికి ఇంటర్న్‌షిప్
ముద్రా రుణాల పరిమితి రూ.20 లక్షలకు పెంపు
మహిళలకు స్టాంపు డ్యూటీ తగ్గించే వెసులుబాటు
వర్కింగ్ ఉమెన్‌కు హాస్టల్స్.. కార్మికులకు డార్మిటరీలు
రూ.10 లక్షల కోట్లతో పట్టణ పేదలకు కోటి ఇళ్లు
ఎంఎస్ఎంఈలకు వరాలు.. పారిశ్రామిక కారిడార్లు
రైల్వేలు, పెట్టుబడుల ఉపసంహరణపై ప్రస్తావన నో

ఉరుముతున్న నిరుద్యోగ భూతం! పన్నులు కడుతున్నా మాకేమీ లేదంటూ వేతన జీవుల్లో తీవ్ర అసంతృప్తి! సంక్షోభంలో చిక్కుకున్న ఎంఎస్ఎంఈల యాజమాన్యాల్లో ఆందోళన! కేంద్రంలో సంకీర్ణ సర్కారును నడపాల్సిన రాజకీయ అనివార్యత! ఇందులో భాగంగానే బిహార్ నుంచి ఒకదాని తర్వాత మరొకటిగా డిమాండ్లు! లోక్‌సభ ఎన్నికల్లో ఎదురు దెబ్బ తగిలిన నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు కొత్త ఓటర్లను ఆకర్షించాల్సిన పరిస్థితి! వీటన్నిటినీ బ్యాలెన్స్ చేస్తూనే సంస్కరణలను ముందుకు తీసుకెళ్లాల్సిన సంకట స్థితి! అందుకే.. 'మోదీ ఎవరి మాటా వినరనే గత వైఖరికి భిన్నంగా'.. ఈసారి బడ్జెట్లో సంకీర్ణ అనివార్యతకు రాజీ పడుతూనే సంస్కరణ పథాన్ని కొనసాగించారు! సంకీర్ణ మిత్రులను సంతృప్తిపరుస్తూనే 'యూత్ మంత్ర'ం పఠించారు! ఎప్పట్లాగే మౌలిక వసతులకు పెద్దపీట వేశారు. జనాకర్షణ జోలికి వెళ్లలేదు. 10



పసిడి పతనం

బంగారంపై కస్టమ్స్ డ్యూటీ 6 శాతానికి కోత
ఫ్యూచర్స్‌లో రూ.4000 మేర పడిన ధర
మొబైల్ ఫోన్లు, చార్జర్లపైనా సుంకం తగ్గింపు 12

తెలంగాణకు నిల్..

ఒక్కదానికీ ప్రత్యేక గ్రాంటు ఇవ్వని వైనం!
'పాలమూరు-రంగారెడ్డి'కి పైసా ఇవ్వలేదు
ఇతర పథకాల కింద 60% నిధుల ఊసేది?
2 పారిశ్రామిక కారిడార్ల ప్రస్తావనా కరువు
వెనుకబడిన జిల్లాలకు 2,250 కోట్ల నిధులెక్కడ?
రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, స్టీల్ ప్లాంట్‌లది పాత కథే
గిరిజన వర్సిటీకి నిధుల్లేవు, ఐఐఎం మాటెత్తలేదు 14

కుర్చీ బచావో బడ్జెట్



అందుకోసమే ఏపీ, బిహార్లకు నిధులు
ఇది ప్రధానికి గౌరవం కాదు
బడ్జెట్‌లో తెలంగాణ పదమే లేదు
ఇదే వివక్ష కొనసాగిస్తే తెలంగాణలో
బీజేపీకి నూకలు చెల్లుతాయ్
కిషన్‌రెడ్డి రాజీనామా చేయాలి
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిప్పులు
త్వరలో దక్షిణాది సీఎంలను కలుస్తా



ప్రస్తుత బడ్జెట్ నూతన మధ్యతరగతికి మరింత సాధికారత అందిస్తుంది. యువతకు అపార అవకాశాలు కల్పిస్తుంది. ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహక పథకం దేశంలో మరిన్ని ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహద పడుతుంది.
- ప్రధాని నరేంద్ర మోదీ



ఇది బుజ్జగింపుల బడ్జెట్. అధికారాన్ని కాపాడుకునే బడ్జెట్. సంపన్న వర్గాలకు మేళ్లు చేస్తూ.. సాధారణ పౌరుల సంక్షేమాన్ని పణంగా పెట్టారు. కొన్ని అంశాల్లో కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను కాపీ కొట్టి ఈ బడ్జెట్‌ను రూపొందించారు.
- ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ



ఏపీ హ్యాపీ..

ఐదేళ్ల తర్వాత తొలిసారి బడ్జెట్‌లో వరాల జల్లు
రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు
సాధ్యమైనంత త్వరగా పోలవరం ప్రాజెక్టు పూర్తి
నిర్మాణానికి పూర్తిస్థాయిలో సొమ్ములిస్తామని హామీ
వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు గ్రాంట్లు
కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్స్ అభివృద్ధి 12

ఊరట కాస్తంతే..

11
వేతన జీవులకు నిరాశ మిగిల్చిన నిర్మల
కొత్త పన్ను విధానంలోకి మారితేనే ఉపశమనం
5, 10 శాతం పన్ను శ్లాబులు కొద్దిగా సవరింపు
ప్రామాణిక తగ్గింపు రూ.75 వేలకు పెంపు
ఫ్యామిలీ పెన్షనర్లకు స్టాండర్డ్ డిడక్షన్ రూ.25 వేలకు!
పాత విధానంలో రిటర్నులు దాఖలు చేసేవారికి నిరాశే
ఆరు నెలల్లోగా ఆదాయపన్ను చట్టంపై సమగ్ర సమీక్ష



అగ్నిపర్వతంలా నేను!

బిడ్డ జైల్లో ఉంటే తండ్రికి బాధ ఉండదా?
రాజకీయ కక్షతోనే కవితను జైల్లో పెట్టారు
ఎక్కడో ఉన్నోళ్లను తెచ్చి పదవులిస్తే
ఇప్పుడు వారంతా పార్టీ వీడుతున్నారు
కాంగ్రెస్ సర్కారు హనీమూన్ ముగిసింది
బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో కేసీఆర్
ఉన్న ఎమ్మెల్యేల్లో ఐదుగురు గైర్హాజరు
రేపు రాష్ట్ర బడ్జెట్. 27న దానిపై చర్చ
26, 28న విరామం.. ఏడు పనిదినాలు
అసెంబ్లీ బీఏసీ సమావేశంలో నిర్ణయం 2



నీట్ రద్దు అక్కర్లేదు

ఒకటిరెండు కేంద్రాల్లోనే
ప్రశ్నపత్రం లీకైంది
వ్యవస్థ విఫలమైందని
నిర్ధారించలేం
మళ్లీ పరీక్ష అనడం సరికాదు
సుప్రీంకోర్టు స్పష్టీకరణ..
పిటిషన్లు కొట్టివేత
2 రోజుల్లోగా నీట్
తుది ఫలితాలు: కేంద్రం 3

ఇంటింటి జ్వర సర్వే

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం 2

రోజువారీ విచారణ

జగన్ కేసులపై సీబీఐ కోర్టుకు మళ్లీ హైకోర్టు ఆదేశాలు



దీప్తి శర్మ (3/13)

షఫాలీ అదుర్స్

ఆసియా కప్ సెమీస్‌లో భారత్



షఫాలీ వర్మ (48 బంతుల్లో 81)

దంబుల్లా: యువ ఓపెనర్ షఫాలీ వర్మ తుఫాన్ ఇన్నింగ్స్ (48 బంతుల్లో 81)తో, ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ (3/13) బంతితో చెలరేగడంతో భారత్ మహిళల ఆసియా టీ20కప్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఇదే గ్రూపులో యూఏఈపై నెగ్గిన పాకిస్థాన్ కూడా నాకౌట్‌కు చేరుకుంది. గ్రూప్-ఎలో మంగళవారం నేపాల్‌తో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 82 పరుగులతో గెలుపొందింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది హ్యాట్రిక్ విజయం కావడం విశేషం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు విశ్రాంతినివ్వడంతో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన సారథ్యంలో భారత్ బరిలోకి దిగింది. టాస్ గెలిచి, తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 178 పరుగులు సాధించింది. ఓపెనర్లు షఫాలీ, హేమలత (47) కలిసి తొలి వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఛేదనలో నేపాల్ 20 ఓవర్లు ఆడి, 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులే చేసి, పరాజయం పాలైంది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి చెరో రెండు వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు షఫాలీ వర్మకి దక్కింది. భారత్ (6 పాయింట్లు), పాకిస్థాన్ (4) జట్లు ఈనెల 26న జరగనున్న రెండు సెమీఫైనల్స్‌లో గ్రూప్-బి ప్రత్యర్థులతో తలపడనున్నాయి.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 178/3 (షఫాలీ 81, హేమలత 47, మగార్ 2/25), **నేపాల్:** 96/9 (మగార్ 18, రుబీనా 15, దీప్తి 3/13).

పాక్ సునాయాసంగా...

అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో యూఏఈపై పాకిస్థాన్ మరో 35 బంతులు విగిలుండగానే 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడిన యూఏఈ తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. ఛేదనలో పాక్ 14.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 107 పరుగులు చేసి నెగ్గింది.

ఐదులోనే మంధాన

దుబాయ్: ఐసీసీ మహిళల తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన 731 పాయింట్లతో నిలకడగా ఐదో స్థానంలో కొనసాగుతోంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఒక స్థానం మెరుగవగా, ఓపెనర్ షఫాలీ వర్మ నాలుగు స్థానాలు ఎగబాకింది. ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్లు బెత్ మూనీ, తహిలా మెక్‌గ్రాత్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలర్ల జాబితాలో భారత్ నుంచి టాప్-10లో ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ మూడో ర్యాంక్‌లో కొనసాగుతుండగా, పేసర్ రేణుక సింగ్ ఒక స్థానం ఎగబాకి 9వ ర్యాంక్‌కి చేరుకుంది. ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎకెల్‌స్టోన్ తన అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది.

చాను చూపు.. పసిడి వైపు!

భారత్ నుంచి ఏకైక లిఫ్టర్ మీరాపై ఆశలు



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

వెయిట్‌లిఫ్టింగ్ అనగానే ఠక్కున గుర్తొచ్చే పేరు కరణం మల్లీశ్వరి. ఈ తెలుగు మహిళ 24 ఏళ్ల క్రితం సిడ్నీ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి లిఫ్టింగ్‌లో భారత్ 'పవర్' ఏంటో చూపించింది. ఆ తర్వాత కొన్నేళ్లపాటు ఎందరో లిఫ్టర్లు భారత్ తరఫున అంతర్జాతీయ ఈవెంట్లలో సత్తాచాటినా, విశ్వక్రీడల్లో మాత్రం మెరవలేకపోయారు. కానీ, నాటి మల్లీశ్వరిని మరిపిస్తూ మణిపూర్ మహిళ మీరాబాయి చాను మూడేళ్ల క్రితం టోక్యో క్రీడల్లో రజత పతకం సాధించి శెభాష్ అనిపించుకుంది ఈసారి భారత్‌నుంచి బరిలో ఉన్న ఏకైక లిఫ్టర్ మీరాబాయ్ మాత్రమే. టోక్యోలో ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన మీరా 49 కిలోల విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరచి తన సత్తాను ప్రపంచానికి తెలియజేసింది. ఈసారి మాత్రం కచ్చితంగా పతక ఆశలతోనే పారిస్‌కు పయనమైంది మీరా. భారత్ నుంచి పారిస్ క్రీడలకు ఎంపికైన ఏకైక లిఫ్టర్‌గా నిలిచిన 29 ఏళ్ల మీరా.. టోక్యోలో చేజారిన స్వర్ణాన్ని ఇక్కడ పట్టేయాలన్న లక్ష్యంతో పోటీపడుతోంది.

గాయంతో దూరమైనా...:

టోక్యో ఒలింపిక్స్ తర్వాత మీరాబాయి ఒకే ఒక్క టోర్నమెంట్‌లో పతకం గెలిచింది. 2022లో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో ఓవరాల్‌గా 201 కిలోలు ఎత్తి చాంపియన్‌గా నిలిచింది. ఇది టోక్యో క్రీడల్లో ఎత్తిన బరువు (203 కిలోలు) కంటే కాస్త తక్కువ. ఆ మరుసటి ఏడాది 2022లో హాంగ్జౌ ఆతిథ్యమిచ్చిన ఆసియా క్రీడల బరిలోకి దిగిన మీరాబాయి.. అనూహ్యంగా పోటీ మధ్యలోనే తప్పుకొంది. బరువు ఎత్తే క్రమంలో తుంటిగాయానికి గురైన ఆమె టోర్నీ నుంచి వైదొలగింది. పెద్దగాయం కావడంతో ఆ తర్వాత ఏకంగా ఐదు నెలలు ఆటకు దూరమైంది. ఈ క్రమంలో పారిస్ క్రీడల సన్నద్ధతపై ప్రభావం పడింది. గాయం నుంచి కోలుకొని సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఏడాది థాయ్‌లాండ్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న మీరా.. అక్కడ 200 కిలోల బరువును ఎత్తడంలో విఫలమైంది. కేవలం 184 కిలోలతో 12వ స్థానానికి పరిమితమైంది. అయినా మీరాను తక్కువ అంచనా వేయలేం. ప్రపంచ చాంపియన్‌షిప్ వైఫల్యంతో ఏమాత్రం నిరాశపడకుండా ఒలింపిక్స్‌లో రెండో పతక వేటకు పయనమైంది. తన కోచ్‌తో కలిసి ఇప్పటికే విశ్వక్రీడల వేదిక పారిస్‌లో శిక్షణ మొదలుపెట్టింది. తనకు పోటీగా భావిస్తున్న జపాన్, చైనా లిఫ్టర్లకు దీటుగా రాణించేందుకు పక్కా ప్రణాళికలతో సిద్ధమవుతోంది.

పారిస్ ఒలింపిక్స్ 2 రోజుల్లో

బడ్జెట్‌లో ఖేలో ఇండియాకు భారీగా నిధులు

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడా బడ్జెట్‌లో ఖేలో ఇండియా పథకానికి మరోసారి భారీగా నిధులు కేటాయించారు. మొత్తం క్రీడా పద్దు రూ.3,442.32 కోట్లు కాగా, అందులో రూ.900 కోట్లు ఖేలో ఇండియా పథకానికి సమకూర్చారు. గతేడాది క్రీడా బడ్జెట్ కంటే ఈసారి రూ.45.36 కోట్లు అధికంగా కేటాయించగా, ఖేలో ఇండియాకు రూ.20 కోట్లు పెంచారు. 2022లో ఖేలో ఇండియాకు రూ.596.39 కోట్లు కేటాయించగా, గత రెండేళ్లలో ఇది రూ.300 కోట్లకు పెరగడం విశేషం. ఖేలో ఇండియా గేమ్స్, యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఖేలో ఇండియా ఎక్సలెన్స్ సెంటర్ల నిర్వహణకు ఈ పథకం నుంచి నిధులు వెచ్చించనున్నారు. జాతీయ క్రీడా సంఘాలకు ప్రత్యేక గ్రాంట్లు ఇచ్చేందుకు రూ.340 కోట్లు, టాప్స్ పథకానికి రూ.822.60 కోట్లు కేటాయించారు.

గోల్ఫ్



అదితి.. ఈసారైనా!

ఒలింపిక్స్‌లో గోల్ఫ్‌కు స్వల్ప చరిత్రే ఉంది. 112 ఏళ్ల విరామం తర్వాత 2016 రియో గేమ్స్‌లో ఈ క్రీడను ప్రవేశపెట్టారు. ఇక మన దేశంలో గోల్ఫ్‌కు పెద్దగా ఆదరణ లేకపోయినా.. వరుసగా మూడోసారి ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించబోతున్నారు. పారిస్ బరిలో మన దేశం నుంచి నలుగురు గోల్ఫర్లు బరిలో ఉన్నారు. శుభాంకర్ శర్మ, గగన్‌జీత్ భుల్లార్, అదితి అశోక్, దీక్షా దాగర్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అయితే రియో ఒలింపిక్స్‌లో పాల్గొన్న అనిర్బన్ లాహిరి (57వ స్థానం), ఎఎస్‌పీ చౌరాసియా (50), అదితి అశోక్ (41) తీవ్రంగా నిరాశపరిచారు. ఇక టోక్యోలో నలుగురు గోల్ఫర్లు పాల్గొనగా.. అదితి మాత్రమే అద్భుతంగా రాణించి పతకంపై ఆశలు పెంచింది. మూడు రౌండ్లపాటు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంతో మెడల్ ఖాయమనిపించింది. కానీ కీలక నాలుగో రౌండ్‌లో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో అవకాశం చేజార్చుకుంది. అయితే ఈ సారి ఒలింపిక్‌లో మెడల్ సాధించిన తొలి భారత గోల్ఫర్‌గా రికార్డులకెక్కేందుకు అదితి ఆత్రుతగా ఎదురుచూస్తోంది. అయితే ఈ ఏడాది ఆమె ప్రదర్శన ఆశాజనకంగా లేకపోవడం ఆందోళనపరిచే విషయం. మరోవైపు ర్యాంకింగ్స్ ఆధారంగా ఈసారి భారత్ నుంచి ఎంపికైన అదితితో పాటు దీక్ష, శుభాంకర్, భుల్లార్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

సెయిలర్లు ఏం చేస్తారో?



నేత్ర
విష్ణు

పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ నుంచి సెయిలింగ్‌లో విష్ణు శరవణన్, నేత్రా కుమనన్ పోటీపడుతున్నారు. వీరిద్దరూ పురుషులు, మహిళల డింగీ ఈవెంట్లలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీళ్లకిది రెండో ఒలింపిక్స్. గత టోక్యో క్రీడల్లోనూ బరిలోకి దిగినా, పతకాలకు చేరువ కాలేకపోయారు. అయితే, గతేడాది ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన విష్ణు.. ఈ ఏడాది అడిలైడ్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మెరుగైన ప్రదర్శన కనబరచాడు. ఆరురోజులపాటు జరిగిన తన ఈవెంట్‌లో 125 నెట్ పాయింట్లు సాధించిన విష్ణు.. ఓవరాల్‌గా 26వ స్థానంలో నిలిచి పారిస్ క్రీడల కోటా దక్కించుకున్నాడు. ఇక, గత టోక్యో క్రీడలతో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ తొలి భారత మహిళా సెయిలర్‌గా రికార్డుకెక్కిన నేత్ర.. ఇటీవల పలు ఈవెంట్లలో నిలకడగా రాణించి పారిస్ క్రీడలకు అర్హత సాధించింది. మరి.. గత క్రీడల వైఫల్యాన్ని మరిపిస్తూ ఈసారి ఇద్దరు సెయిలర్లు ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాన్ని అందిస్తారేమో చూడాలి.



ఒలింపిక్స్‌కు 'యుద్ధ'స్థాయి భద్రత

రాఫెల్ ఫైటర్లు, రీపర్ డ్రోన్లు

పారిస్: ఒలింపిక్స్‌కు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సైబర్ దాడులు కూడా జరగవచ్చని అనుమానిస్తున్న నిర్వాహకులు కృత్రిమ మేధ ఆధారిత రక్షణ చర్యలు కూడా చేపడుతున్నారు. రెండు వారాల ఈ క్రీడల్లో 10,500 మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు. 45 వేల మంది పోలీసులు, పారా మిలటరీ బలగాలతోపాటు 10 వేలమంది సైన్యాన్ని రంగంలోకి దింపుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పారిస్‌లో ఇంత భారీ స్థాయిలో మిలటరీని దించడం ఇదే తొలిసారి. పారిస్‌లోని ఏ వేదిక వద్దకైనా 30 నిమిషాలల్లోగా ఈ భద్రతా సిబ్బంది చేరుకొనేలా ఏర్పాట్లు చేశారు. ఇక ఈనెల 26న జరిగే ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని 150 కి.మీ. మేర గగన తలాన్ని 'నో ఫ్లై జోన్'గా ప్రకటించారు. ఈ సందర్భంగా రాఫెల్ ఫైటర్ జెట్లు, అవాక్స్ నిఘా విమానాలు, రీపర్ డ్రోన్లు, షార్ప్ షూటర్లతో కూడిన హెలికాప్టర్లు గగన తలంపై పహారా కాయనున్నాయి. ఇవి గాక..40 దేశాలనుంచి 1900 మంది పోలీసు బలగాలు పారిస్ చేరుకున్నాయి.

లంక టీ20 కెప్టెన్‌గా అసలంక

పల్లెకలె: స్వదేశంలో ఈ నెల 27 నుంచి భారత్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌కు శ్రీలంక కెప్టెన్‌గా చరిత్ అసలంక ఎంపికయ్యాడు. టీ20 వరల్డ్‌కప్‌లో పేలవ ప్రదర్శనతో హసరంగ కెప్టెన్సీనుంచి తప్పుకొన్న సంగతి తెలిసిందే. అసలంక సారథ్యంలో 16 మంది సభ్యుల జట్టును లంక బోర్డు మంగళవారం ప్రకటించింది. 34 ఏళ్ల దినేష్ చాందిమల్‌కు రెండేళ్ల తర్వాత జట్టులో చోటుదక్కడం విశేషం. ఏంజెలో మాథ్యూస్, ధనంజయ డిసిల్వా, సదీర సమరవిక్రమ, పేసర్ దిల్షాన్ మధుశంకలకు సెలెక్టర్లు మొండిచేయి చూపారు.

లంక జట్టు: అసలంక (కెప్టెన్), పథుం నిస్సంక, కుశాల్ జనిత్ పెరీరా (వికెట్ కీపర్), అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), చాందిమల్, కమిందు మెండిస్, దసున్ షనక, హసరంగ, దునిత్ వెల్లలాగే, మహీష్ తీక్షణ, చమిందు విక్రమసింఘే, పథిరన, నువాన్ తుషార, చమీర, బినుర ఫెర్నాండో.



ఆపరేషన్ అనంతరం బిడ్డను కుటుంబసభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

గర్భిణికి పురుడు పోసిన ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలం, జూలై 23: ప్రసవ వేదనతో ఓ గర్భిణి ఆస్పత్రి రావడం.. అక్కడ సర్జన్ అందుబాటులోలేకపోవడంతో స్వయంగా వైద్యుడైన స్థానిక ఎమ్మెల్యేనే సిజేరియన్ చేసి బిడ్డను కుటుంబసభ్యుల చేతుల్లో పెట్టారు. అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్స చేసి తల్లి, బిడ్డల ప్రాణాలను కాపాడిన ఆ వైద్యుడు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు. భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి సోమవారం సాయంత్రం దుమ్ముగూడెం మండలం రేగుబల్లికి చెందిన బేరిబోయిన స్వప్న అనే గర్భిణి రెండో కాన్పు కోసం వచ్చింది. మంగళవారం ఉదయం ఆమెకు పురుటినొప్పులొచ్చాయి. సిజేరియన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. కొన్నాళ్లుగా అక్కడ సర్జన్ ఎవరూలేరు. అయితే స్వప్న కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే వెంకట్రావుతో పరిచయం ఉండడంతో వారు ఆయనకు ఫోన్ చేశారు. వెంటనే ఎమ్మెల్యే భద్రాచలం ఏరియా వైద్యశాలకు వెళ్లి స్వప్నకు సిజేరియన్ చేశారు. ఎమ్మెల్యేకు ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పదేసి ఊళ్లకు ఓ రెసిడెన్షియల్ స్కూలు: భట్టి

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రతి మండలానికి మూడు చొప్పున.. సగటున పదేసి ఊళ్లకు ఒక రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. 15 నుంచి 20 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో స్కూలు నిర్మాణానికి రూ.80-రూ.100 కోట్ల దాకా వ్యయం కానుందన్నారు. ఈ స్కూళ్లల్లో 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులకు స్కూలు భవనంలోనే వసతి ఉంటుందని పేర్కొన్నారు. అసెంబ్లీలోని తన చాంబర్లో మీడియాతో చిట్‌చాట్‌గా భట్టి మాట్లాడారు. ప్రతి గ్రామంలోని అంగన్‌వాడీల్లో ఎల్‌కేజీ నుంచి మూడో తరగతి వరకు విద్యను అందించాలని ఇప్పటికే నిర్ణయం జరిగిందని, అంగన్‌వాడీల్లో విద్యాభ్యాసం పూర్తయ్యాక.. ఆ విద్యార్థులను ఈ రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉండలేని విద్యార్థులకు డే స్కాలర్ సౌకర్యమూ ఉంటుందన్నారు. కాగా దివ్యాంగులకు సంబంధించి ఐఏఎస్ స్మితా సబర్వాల్ ట్వీట్ పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, ప్రభుత్వానికి సంబంధం లేదని భట్టి స్పష్టం చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాములకు వైద్య పరీక్షలు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 'గ్రాండ్ హెల్త్ చాలెంజ్'లో భాగంగా ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాములకు కూడా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఆగస్టులో వైద్య పరీక్షలు ప్రారంభించి ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర సమాచార నివేదికలు రూపొందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. మంగళవారం ఆర్టీసీ కళాభవన్‌లో హెల్త్ వాలంటీర్‌ల సమావేశంలో సజ్జనార్ మాట్లాడారు.

సింగరేణి కాంట్రాక్ట్ ఉద్యోగులకు 30లక్షల బీమా

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వేతన ఖాతా కలిగిన ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగికి రూ.30 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం వర్తించనుందని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. మంగళవారం సింగరేణి భవన్‌లో బలరామ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంక్షేమంపై సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' దరఖాస్తుల స్వీకరణ

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ ఉత్తీర్ణులై మెయిన్స్ రాయనున్న అభ్యర్థులకు రూ.లక్ష సహాయం అందించే 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకానికి దరఖాస్తుల స్వీకరణ సోమవారం ప్రారంభమైంది. ఆగస్టు 6న సాయంత్రం 5గంటల దాకా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

అగ్నిపర్వతంలా నేను!

బిడ్డ జైల్లో ఉంటే కన్నతండ్రికి బాధ ఉండదా?.. రాజకీయ కక్షతోనే కవితను జైల్లో పెట్టారు

- ఎక్కడో ఉన్నోళ్లను తెచ్చి పదవులిస్తే ఇప్పుడు వారంతా పార్టీ వీడుతున్నారు
- బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశంలో కేసీఆర్
- భేటీకి ఐదుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ డుమ్మా



బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తదితర బీఆర్‌ఎస్ నేతలు

హైదరాబాద్, జూలై23 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షతోనే ఎమ్మెల్సీ కవితను జైల్లో పెట్టారని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. అన్నింటినీ భరిస్తూ ప్రస్తుతం తానో అగ్ని పర్వతం మాదిరిగా ఉన్నానని, సొంతబిడ్డ జైల్లో ఉంటే కన్నతండ్రిగా బాధ ఉండదా? అని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఎదుట ఆయన తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు సమాచారం. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశాన్ని నిర్వహించారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విషయంలో ఇప్పటిదాకా కేసీఆర్ నేరుగా స్పందించలేదు. అయితే బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశంలో ఆయన కవిత అరెస్టుపై తొలిసారిగా స్పందించడమే కాకుండా భావోద్వేగానికి గురైనట్లు తెలిసింది. ఉద్యమపార్టీగా బీఆర్‌ఎస్ అవతరించిన సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులతో పోల్చుకుంటే పార్టీకి ఇప్పుడంత క్లిష్ట పరిస్థితులు లేవని, ఇంతకంటే ఇబ్బందికర పరిస్థితులు ఉన్న రోజుల్లోనే తెలంగాణను సాధించామని కేసీఆర్ బీఆర్‌ఎస్ఎల్పీ సమావేశంలో పేర్కొన్నారు. ఎక్కడో ఉన్న వాళ్లను తెచ్చి.. వారికి రాజకీయ పదవులు దక్కేలా చేస్తే.. వారేమో పార్టీని వీడుతున్నారని, వారి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. విపక్షంలో ఉన్నప్పుడే ఎమ్మెల్యేగా బాగా ఎదుగుతారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఉద్బోధించినట్లు తెలిసింది. కాగా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు సాధించలేకపోయిందని, శాంతి భద్రతలు అదుపు తప్పాయని కేసీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వానికి హనీమూన్ పీరియడ్ అయిపోయిందని, ఇక ప్రజా క్షేత్రంలోకి వెళ్లి నిలదీద్దామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతలకు కేసీఆర్ పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో బడ్జెట్ ప్రకటించేరోజు, ఆ తర్వాత సభకు కేసీఆర్ హాజరు కానున్నారు. కాగా ఈ సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్సీలు హాజరు కాలేదు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో ఇప్పటికే పలువురు కాంగ్రెస్‌లో చేరడంతో ఈ పరిణామం గులాబీ శ్రేణులను కలవరపాటుకు గురిచేస్తోంది. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ సమావేశానికి డుమ్మాకొట్టారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కూడా హాజరుకాలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశంలో.. శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు హరీశ్‌రావు తెలిపారు.

లోకం తీరు



జగన్ అక్రమాస్తుల కేసులపై రోజువారీ విచారణ

నాంపల్లి సీబీఐ కోర్టుకు మరోసారి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూలై23 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ, ఈడీ కేసులకు సంబంధించి దాఖలైన డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ చేపట్టాలని నాంపల్లి సీబీఐ కోర్టును తెలంగాణ హైకోర్టు మరోసారి ఆదేశించింది. గత విచారణ సందర్భంగా ఈ నెల3న జారీచేసిన ఆదేశాలనే పునరుద్ఘాటించింది. ప్రజాప్రతినిధుల కేసుల్లో విచారణ వేగవంతం చేయాలనే సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు హైకోర్టు ప్రత్యేకంగా ఆ కేసుల విచారణను పర్యవేక్షిస్తోంది. దీంతోపాటు జగన్ కేసుల్లో వేగవంతంగా విచారణ చేపట్టాలని కోరుతూ మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ వ్యాప్తంగా ప్రజాప్రతినిధుల కేసులకు సంబంధించి గుర్తింపు పొందిన కోర్టుల్లో విచారణలో ఎంతో కొంత పురోగతి కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. సీబీఐ ప్రత్యేక కోర్టు విషయానికొస్తే జగన్‌పై ఉన్న కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టాలని ఇప్పటికే ఆదేశించామని, ఆయా కేసుల్లో మరోసారి పురోగతి తెలియజేయాలని రిజిస్ట్రీని, సీబీఐ కోర్టును ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది.

3వేల కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భారత రిజర్వు బ్యాంకు మంగళవారం నిర్వహించిన నిర్వహించిన ఈ-వేలం ద్వారా రూ.3 వేల కోట్లు సేకరించింది. 13 ఏళ్ల కాల పరిమితి, 7.34% వార్షిక వడ్డీతో రూ.1,000 కోట్లు, 16ఏళ్ల కాల పరిమితి, 7.34% వార్షిక వడ్డీతో రూ.1,000 కోట్లు, 18ఏళ్ల కాల పరిమితి, 7.33% వార్షిక వడ్డీతో రూ.1,000 కోట్ల అప్పు తీసుకుంది.

ఇంటింటి జ్వర సర్వే

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో సర్కారు నిర్ణయం

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గతేడాదితో పోల్చితే డెంగీ కేసులు భారీగా నమోదవుతున్నాయి. జ్వరాలు, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ కేసులూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటింటి జ్వర సర్వే చేయాలని వైద్యశాఖ నిర్ణయించింది. ఈమేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం ఆదేశించారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో జ్వర సర్వేను క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నారు. గతేడాది డెంగీ, చికున్‌గున్యా, మలేరియా కేసులు ఎక్కువగా నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. కాగా రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లో డెంగీ తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. హైదరాబాద్, ఖమ్మం, మేడ్చల్, నిజామాబాద్ జిల్లాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి.

ఫీవర్ సర్వే ఇలా....


జ్వర సర్వేలో ఏఎన్‌ఎమ్‌లతో పాటు ఆశావర్కర్‌లు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్), మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొంటారు. ఈ టీమ్ అంతా కలిసి రోజుకు 50 ఇళ్లకు వెళ్లి జ్వర సర్వే చేయాలి. బుధ, శనివారం మినహా మిగిలిన అన్ని రోజులూ సర్వే నిర్వహించాలని వైద్యశాఖ ఆదేశించింది. జాతీయ టీకాల కార్యక్రమం ఉండటంతో ఆ రెండు రోజులు మినహాయింపు ఉంటుంది. సర్వేలో భాగంగా... జ్వర కేసులను గుర్తిస్తే వాటిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపుతారు. అక్కడి మెడికల్ ఆఫీసర్ జ్వరబాధితులను పరీక్షిస్తారు.అవసరమనుకున్న కేసుల్ని సమీపంలోని తెలంగాణ వైద్య, విధాన పరిషత్ ఆస్పత్రులు, బోధనాస్పత్రులకు పంపుతారు.

మళ్లీ సివిల్స్ రాసేందుకు సిద్ధమే కానీ..

వయసు పైబడిన కారణంగా యూపీఎస్సీ అనుమతించకపోవచ్చు

దివ్యాంగుల కోటా విషయంలో బాల లత సవాల్‌పై స్మిత స్పందన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



"స్మితా.. రాజీనామా చేసి రా. మళ్లీ పరీక్ష రాద్దాం. ఎవరికి ఎక్కువ మార్కులు వస్తాయో చూద్దాం" ..అంటూ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత చేసిన సవాల్‌పై స్మితాసబర్వాల్ స్పందించారు. "మీ విచిత్రమైన సవాల్ స్వీకరిస్తున్నా. సివిల్స్ పరీక్ష మళ్లీ రాయడానికి నేను సిద్ధం. కానీ వయసు పైబడటంతో యూపీఎస్సీ అనుమతిస్తుందా అని అనుమానంగా ఉంది" అంటూ చిరునవ్వు ఎమోజీతో 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. అలాగే, బాలలత ప్రకటనను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన ఓ సీనియర్ జర్నలిస్టును ఉద్దేశించి కూడా స్మిత మరో ట్వీట్ చేశారు. "బాల లత అధికార ప్రతినిధి (స్పోక్స్ పర్సన్)గా వ్యవహరిస్తున్న మిమ్మల్ని కోరుతున్నా.. వికలాంగుల కోటా ఉపయోగించి ఆమె ఐఏఎస్‌గా ఎంపికైంది దేనికోసం? కోచింగ్ సెంటర్ నడపడానికా? క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవ చేయడానికా? అని బాల లతను ప్రశ్నించండి" అని ఆ ట్వీట్‌లో కోరారు. ఇక.. సివిల్స్‌లో దివ్యాంగుల కోటాపై స్మితాసబర్వాల్ చేసిన వ్యాఖ్యలను తాను సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క అన్నారు. ఇతరుల అభిప్రాయాలను గుర్తించక పోవడం మానసిక వైకల్యమని.. అంగవైకల్యం కంటే బుద్ధివైకల్యం ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కూడా స్మిత వ్యాఖ్యలను ఖండించారు. ఆమె దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తెలంగాణ సర్కారు దృష్టిసారించాలని సూచించారు.

రాయదుర్గం సర్వే నం. 46లో
ఆ 84.30 ఎకరాలు ప్రభుత్వానివే

» కీలక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

» గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రద్దు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు గుండెకాయలాంటి రాయదుర్గంలో ఏళ్ల తరబడి వివాదంలో ఉన్న రూ.8 వేల కోట్లకు పైగా విలువ చేసే భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నం.46లో ఉన్న 84 ఎకరాల 30 గుంటల భూమిపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పునిచ్చింది. ఈ భూములు ముమ్మాటికీ ప్రభుత్వానివేనని స్పష్టం చేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. నిజాం కాలం నుంచి హైదరాబాద్ పరిసరాల్లో పాయ్‌గా భూములు వందల ఎకరాల్లో ఉన్నాయి. 1954 నుంచి ఈ భూముల విషయంలో పలు కోర్టుల్లో వివాదాలున్నాయి. వ్పట్లో పలువురు తామే భూములకు హక్కుదారులమని, వారసులమంటూ కోర్టులను ఆశ్రయించారు. ఈ వ్యవహారం ప్రభుత్వానికి శిరోభారంగా మారడంతో.. వివాదాలను క్లయింట్ల వారీగా విభజించింది. వాటిని సివిల్ స్యూట్(సీఎస్) పేర్లతో పిలవడం ప్రారంభమైంది. ఇలా సీఎస్-1, సీఎస్-2, .. సీఎస్-14.. పేర్లతో కేసులు/భూములు కొనసాగుతున్నాయి. వీటిల్లో సీఎస్-7, సీఎస్-14 అత్యంత కీలకమైనవి. శేరిలింగంపల్లి మండల పరిధిలో.. రాయదుర్గం సర్వే నం.46లో ఉన్న 84.30 ఎకరాలు సీఎస్-7 కేసుగా కొనసాగుతున్నాయి. ఈ భూములు తమవేనంటూ అప్పట్లో కొందరు ప్రైవేటు వ్యక్తులు కోర్టులకెక్కారు. ఈ కేసుల్లో ప్రభుత్వానికి అనుకూలంగానే తీర్పులు వచ్చాయి. హైకోర్టు కూడా అప్పట్లో సీఎస్-7 కేసులన్నీ మోసపూరితమైనవని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు కూడా మూడుసార్లు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులిచ్చింది. ఆ తర్వాతి కాలంలో లార్విన్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్, సయ్యద్ రహముల్లా హుస్సేన్ ఈ భూముల హక్కుపత్రాలు తమ వద్ద ఉన్నాయని, రెవెన్యూ అధికారులు మ్యుటేషన్ చేయడం లేదంటూ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీన్ని విచారించిన కమిషన్ 2021 ఏప్రిల్ 12న ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీనిపై రెవెన్యూ అధికారులు హైకోర్టులో అప్పీల్ చేయగా.. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. రూ.వేల కోట్ల విలువైన భూముల వ్యవహారంలో మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకోవడంపై ఆశ్చర్యంవ్యక్తం చేసింది. ఈ భూములపై ప్రైవేటు వ్యక్తులకు అధికారం లేదని తేల్చిచెప్పింది.

డిక్రీలతో గోల్‌మాల్ యత్నం..!

సీఎస్ వివాద భూముల విషయంలో ఓ క్రమపద్ధతిలో.. డిక్రీ పేరుతో ప్రైవేటు వ్యక్తులు మోసాలకు తెరతీశారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కాంప్రమైజ్ డీడ్ కుదుర్చుకున్న ఓ పార్టీ కింది కోర్టు జారీ చేసిన డిక్రీతో 2009లో హైకోర్టుకు వెళ్లింది. కోర్టు ఆ డిక్రీనే తప్పుబట్టింది. దీనిపై సదరు పిటిషనర్లు అప్పీల్‌కు వెళ్లగా.. 2022 సెప్టెంబరులో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా తుది తీర్పు వచ్చింది. దాని ఆధారంగా మ్యుటేషన్ చేయాలంటూ రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు.. సుప్రీంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. సీనియర్ న్యాయవాదిని నియమించి బలమైన వాదనలను వినిపించారు. పూర్వాపరాలను పరిశీలించిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపంకర్ దత్తాల ధర్మాసనం సోమవారం తుదితీర్పునిచ్చింది. సర్వే నంబర్ 46లోని 84.30 ఎకరాలు ప్రభుత్వానికి చెందినవని తేల్చిచెప్పింది. 2022లో హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది.

ప్రభుత్వ విధానానికి విరుద్ధంగా
రెగ్యులరైజేషన్ ఎలా చేస్తారు?

» కేకే కుటుంబ సభ్యులకు భూ రెగ్యులరైజేషన్‌పై పిటిషన్

» వివరణ ఇవ్వాలని ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ కె.కేశవరావు కుమారుడు కె.వెంకటేశ్వర్‌రావు, కుమార్తె గద్వాల్ విజయలక్ష్మి (మేయర్)లకు నామమాత్రపు ధరకు ప్రభుత్వ భూమిని రెగ్యులరైజ్ చేయడంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ, ప్రైవేటు ప్రతివాదులైన కె.వెంకటేశ్వర్‌రావు, గద్వాల్ విజయలక్ష్మి తదితరులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌లో 129 తదితర సర్వే నంబర్లలో 1,161 చదరపు గజాల స్థలాన్ని గజం రూ.2,500 చొప్పున, 425 చదరపు గజాల స్థలాన్ని గజం రూ.350 చొప్పున రెగ్యులరైజ్ చేస్తూ గత మే 23న ప్రభుత్వం జీవో 56 జారీ చేసింది. అయితే ఈ జీవో రెగ్యులైజేషన్ పాలసీ (జీవో 59)కి విరుద్ధంగా ఉందని పేర్కొంటూ సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన గడీల రఘువీర్‌రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రూ.కోట్లు పలికే అత్యంత విలువైన భూమిని అప్పటి ప్రభుత్వం అతి తక్కువ ధరకు నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానం ప్రకారం భూమి రెగ్యులరైజేషన్‌కు మీసేవ కేంద్రాల ద్వారా బేసిక్ విలువలో కొంత మొత్తం చెల్లించి తహసీల్దార్‌కు దరఖాస్తు పెట్టుకోవాల్సి ఉండగా.. ప్రైవేటు ప్రతివాదులు ల్యాండ్ రెగ్యులరైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీకి దరఖాస్తు పెట్టుకోవడం ద్వారా భూములు పొందడం చెల్లదన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని రెవెన్యూ, మున్సిపల్, సీసీఎల్ఏ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, తహసీల్దార్, భూమి పొందిన ప్రైవేటు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగువారాలకు వాయిదా పడింది.

నీటి నిల్వకు బ్యారేజీల అనుకూలతపై త్వరగా నివేదిక ఇవ్వండి

» ఎన్‌డీఎస్‌ఏను కోరిన తెలంగాణ అధికారులు

» మేడిగడ్డలో గేట్లు ఎత్తడానికే గ్రౌటింగ్ చేసినట్టు వెల్లడి

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నారంలో 11 మీటర్లు (5.5 టీఎంసీలు), సుందిళ్లలో 9 మీటర్ల(4 టీఎంసీలపైన) నీటిని నిల్వ చేసి, పంపింగ్ చేయాలనుకుంటున్నామని.. నీటినిల్వకు ఆ బ్యారేజీలు అనుకూలంగా ఉన్నాయా? లేవా? అనేదానిపై త్వరగా నివేదిక ఇవ్వాలని తెలంగాణ నీటిపారుదల అధికారులు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) అధికారులను కోరారు. తెలంగాణ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్ కుమార్, ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) బి.నాగేంద్రరావు, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్, రామగుండం సీఈ సుధాకర్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్, నిపుణుల కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌తో భేటీ అయ్యారు. గోదావరి బేసిన్‌లోని కీలక ప్రాజెక్టులు సింగూరు, నిజాంసాగర్, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, మిడ్ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు లేవని, ఇదే పరిస్థితి కొనసాగితే తాగునీటికి కూడా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. మేడిగడ్డ బ్యారేజీకి 7 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తున్నందున.. బ్యారేజీలో నీటిని నిల్వ చేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని పంపింగ్ చేయడానికి అనుకూలత ఉంటుందని, ఆ నీటిని అన్నారంలో, అన్నారం నుంచి సుందిళ్లలో, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లిలో ఎత్తిపోసి ఇతర రిజర్వాయర్లకు తరలించడానికి వీలవుతుందని వారు వివరించారు. కాబట్టి, సమగ్ర నివేదిక సత్వరమే ఇస్తే కన్నెపల్లి(మేడిగడ్డ) పంప్‌హౌస్ నుంచి పంపింగ్‌ను ప్రారంభించి అన్నారంలో నీటిని ఎత్తిపోస్తామని పేర్కొన్నారు. దీనికి వారు.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై ఇప్పటిదాకా జరిగిన అన్ని పరీక్షల రిపోర్టులనూ అందించాలని కోరారు. కాగా.. మేడిగడ్డలో పరీక్షలు చేయకుండా గ్రౌటింగ్ ఎందుకు చేశారని ఎన్‌డీఎస్ చైర్మన్ ఈ భేటీలో ప్రశ్నించగా.. మేడిగడ్డలో శ్లాబు కింద భారీబొరియ ఉన్నట్లు గుర్తించే గ్రౌటింగ్ చేశామని తెలంగాణ అధికారులు తెలిపారు. అక్కడ గేట్లు బలవంతంగా ఎత్తాల్సిన పరిస్థితి ఉండేదని, ఈ క్రమంలో శ్లాబుపై ఒత్తిడి పెరిగితే కుంగే ప్రమాదం ఉందనే గ్రౌటింగ్ చేశామని వివరణ ఇచ్చారు.

నీట్ రద్దు అక్కర్లేదు

పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదనేందుకు ఆధారాల్లేవ్.. ఒకట్రెండు కేంద్రాల్లోనే ప్రశ్నపత్రం లీకైంది

» వ్యవస్థ విఫలమైందని నిర్ధారించలేం

» మళ్లీ పరీక్ష నిర్వహించాలనడం సరికాదు

» సుప్రీంకోర్టు స్పష్టీకరణ..పిటిషన్ల కొట్టివేత



న్యూఢిల్లీ, జూలై 23: నీట్‌ను రద్దు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నీట్-యూజీ 2024లో అవకతవకల నేపథ్యంలో పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదనేందుకు ఎలాంటి ఆధారాలూ లేవని.. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవస్థ మొత్తం విఫలమైందన్న నిర్ధారణకు రాబోమని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం మంగళవారం తీర్పు ఇచ్చింది. ఈ పిటిషన్లపై నాలుగు రోజులుగా విచారణ జరుపుతున్న ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వం, ఎన్టీయే తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాతో పాటు పిటిషనర్ల తరఫున పలువురు న్యాయవాదుల వాదనలను నమోదు చేసుకుంది. తీర్పును రిజర్వ్ చేయాల్సి ఉన్నా ధర్మాసనం సాయంత్రం 4.50 గంటలకు మళ్లీ సమావేశమై మధ్యంతర తీర్పును ప్రకటించింది. ఇలాంటి అంశంలో ప్రస్తుత దశలోనే కోర్టు తుదితీర్పును రికార్డు చేయడం సాధ్యం కాదని.. అయితే 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం కావడంతో అత్యవసరంగా తీర్పు ఇవ్వాల్సి వచ్చిందని తెలిపింది. పరీక్ష ప్రశ్నపత్రం ఒకట్రెండు కేంద్రాల్లోనే లీకైందని, పూర్తిస్థాయిలో లీకైందనేందుకు ఎలాంటి ఆధారాల్లేవని వ్యాఖ్యానించారు. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని ఆదేశిస్తే 24 లక్షల మంది విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. మొత్తం వైద్య విద్యపైనే ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. వ్యవస్థ మొత్తం విఫలమైందని.. దీనికి మళ్లీ పరీక్ష నిర్వహించడమే మార్గమన్న పిటిషనర్ల వాదనను ధర్మాసనం తిరస్కరించింది. హజారీబాఘ్, పట్నా కేంద్రాల్లో మాత్రమే ప్రశ్నపత్రం లీకైందని, అక్కడ 155 మంది విద్యార్థులు లబ్ధిపొందినట్లు సీబీఐ విచారణలో తేలిందని ధర్మాసనం గుర్తుచేసింది. కొద్దిమంది కళంకిత విద్యార్థుల కోసం కష్టపడి చదివి పరీక్ష రాసిన లక్షలాది మందికి అన్యాయం చేయలేమని.. పరీక్ష రద్దు ఒక్కటే పరిష్కారమన్న పిటిషనర్ల వాదన సరికాదని స్పష్టంచేసింది. ఒకవేళ సీబీఐ విచారణలో గనక ప్రశ్నపత్రం లీకవడంవల్ల లబ్ధి పొందిన వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తేలితే.. అలాంటి విద్యార్థులపై తగు చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. ఇక ఫిజిక్స్ ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఇచ్చి, దానికి సంబంధించి కొందరికి గ్రేస్‌మార్కులు ఇవ్వడం అన్యాయమంటూ కొందరు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్ ఆధ్వర్యంలో సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ మంగళవారం నివేదిక ఇచ్చింది. పిటిషనర్లు ఆరోపిస్తున్నట్లుగా ఒక ప్రశ్నకు రెండు సరైన జవాబులు లేవని, ఒక్కటే ఉందని స్పష్టం చేసింది. ఈ నివేదికను ఆమోదిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. కాగా, సుప్రీం కోర్టు తీర్పును కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వాగతించారు. 'సత్యమేవ జయతే.. నిజం గెలిచింది' అని చెప్పారు. నీట్ అంశంపై ప్రతిపక్షాలు అరాచకంగా ప్రవర్తించాయని, ప్రజల్లో గందరగోళం సృష్టించాయని ధ్వజమెత్తారు. నీట్‌లో భారీస్థాయిలో లీకేజీ జరగలేదని కేంద్ర ప్రభుత్వం చెప్పిందని.. ఇప్పుడు సుప్రీం కూడా దాన్ని నిర్ధారించిందని తెలిపారు. పరీక్షల్లో అవకతవకలను తమ ప్రభుత్వం సహించబోదన్నారు. ఎన్టీయే రెండు రోజుల్లోగా నీట్ తుది ఫలితాలను వెల్లడిస్తుందని చెప్పారు. సుప్రీం సూచనల మేరకు మెరిట్ జాబితాను సవరిస్తామని వెల్లడించారు.

ఆయన్ను బయటకు పంపండి..
న్యాయవాదిపై సీజేఐ ఆగ్రహం

విచారణ సందర్భంగా న్యాయవాది నరేంద్ర హుడా వాదనలు వినిపిస్తుండగా మరో సీనియర్ లాయర్ మాథ్యూస్ నెడుంపర జోక్యం చేసుకున్నారు. స్పందించిన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్.. హుడా వాదనలు ముగిశాక, మీ వాదన చెప్పాలని నెడుంపరకు సూచించారు. అయినా మరోసారి నెడుంపర జోక్యం చేసుకుంటూ.. కోర్టు హాల్లో ఉన్న న్యాయవాదులందరిలో తానే సీనియర్‌నని, కోర్టు సహాయకుడి (అమికస్ క్యూరీ)ని అని చెప్పారు. అయితే 'మిమ్మల్ని అమికస్ క్యూరీగా ఎవరూ నియమించలేదు' అని సీజేఐ స్పష్టం చేశారు. దానికి నెడుంపర 'మీరు నన్ను గౌరవించకపోతే నేను వెళ్లిపోతా' అని బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. దీనిపై మండిపడ్డ జస్టిస్ చంద్రచూడ్.. 'సెక్యూరిటీ సిబ్బందిని రప్పించి.. ఆయన్ను బయటకు పంపండి' అని ఆదేశించారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
ఫారం-VI
(ప్రాథమిక నోటిఫికేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్నిపొందే హక్కు చట్టం-2013 కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రూల్ 19 సబ్ రూల్ (1) ను అనుసరించి.

కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నం.G1/1685/2022 తేది.03.07.2024
రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నం.B/65/2024 తేది.15.06.2024
గెజిట్ నెంబరు 90/2024, తేది.03.07.2024

తెలంగాణ ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరచిన సిద్దిపేట జిల్లాలోని, చిన్నకోడూర్ మండలములోని రామునిపట్ల గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ. 4.02 గుంటలు ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా రంగనాయకసాగర్ రిజర్వాయర్ యొక్క RDI-LM4 కాలువ నిర్మాణ నిమిత్తం కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ఈ ప్రకటన జారీ చేయనైనది. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 35, తేదీ: 30.06.2017 ద్వారా నీటి పారుదల మరియు కమాండ్ ఏరియా డెవలప్ మెంట్ శాఖ వారు 10-A అనుసరించి సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ (ప్రజాభిప్రాయ సేకరణ) మరియు ఆహార భద్రతను మినహాయింపు ఇవ్వనైనది.

కావున సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూర్ మండలములోని రామునిపట్ల గ్రామములో విస్తీర్ణం ఎ.4.02 గుంటలు గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారికి భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం, ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేయనైనది.

షెడ్యూల్-1

గ్రామము:రామునిపట్ల మండలము చిన్నకోడూర్ జిల్లా:సిద్దిపేట

క్రమసంఖ్య	సర్వే నం.	పట్టా/ప్రభుత్వ	సేకరణ చేయు విస్తీర్ణం	భూమి పట్టాదారు మరియు తండ్రి /భర్త పేరు	భూమి అనుభవదారు మరియు తండ్రి/భర్త పేరు	సరిహద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	[illegible]
1	11	పట్టా	0.08	మొలంగుల నిర్మల భర్త రాజలింగు	మొలంగుల నిర్మల భర్త రాజలింగు	10, 14	335	12	338	32 కడీలు
2	11	పట్టా	0.08	ఆకుల సౌజన్య భర్త సురేష్	ఆకుల సౌజన్య భర్త సురేష్	10, 14	335	12	338	30 కడీలు
3	11	పట్టా	0.02	మిట్టపల్లి నర్సవ్వ భర్త మల్లయ్య	మిట్టపల్లి నర్సవ్వ భర్త మల్లయ్య	10, 14	335	12	338	10 [illegible]
	మొత్తం		0.18							
4	12	పట్టా	0.05	మిట్టపల్లి మల్లయ్య తండ్రి రాజయ్య	మిట్టపల్లి మల్లయ్య తండ్రి రాజయ్య	13	335	వాగు	11	
5	12	పట్టా	0.04	మిట్టపల్లి ఎల్లయ్య తండ్రి రాజయ్య	మిట్టపల్లి ఎల్లయ్య తండ్రి రాజయ్య	13	335	వాగు	11	2 [illegible]
	మొత్తం		0.09							
6	13	పట్టా	0.10	రాచకొండ బాలయ్య తండ్రి రామయ్య	రాచకొండ బాలయ్య తండ్రి రామయ్య	16	12	వాగు 12	14	
7	13	పట్టా	0.07	బండి రవీందర్ తండ్రి పోచయ్య	బండి రవీందర్ తండ్రి పోచయ్య	16	12	వాగు 12	14	3 [illegible]
8	13	పట్టా	0.05	చింతల బుచ్చయ్య తండ్రి పోచయ్య	చింతల బుచ్చయ్య తండ్రి పోచయ్య	16	12	వాగు 12	14	
9	13	పట్టా	0.11	చింతల శ్రీనివాస్ తండ్రి పోచయ్య	చింతల శ్రీనివాస్ తండ్రి పోచయ్య	16	12	వాగు 12	14	
	మొత్తం		0.34							
10	16	పట్టా	0.02	పంతం శ్రీనివాస్ తండ్రి రాజమల్లయ్య	పంతం శ్రీనివాస్ తండ్రి రాజమల్లయ్య	18	13	17	15	
11	16	పట్టా	0.10	పంతం సురేష్ తండ్రి రాజమల్లయ్య	పంతం సురేష్ తండ్రి రాజమల్లయ్య	18	13	17	15	
12	16	పట్టా	0.06	పంతం భాస్కర్ తండ్రి నర్సయ్య	పంతం భాస్కర్ తండ్రి నర్సయ్య	18	13	17	15	
13	16	పట్టా	0.08	పంతం రవి తండ్రి నర్సయ్య	పంతం రవి తండ్రి నర్సయ్య	18	13	17	15	
	మొత్తం		0.26							
14	18	పట్టా	0.08	పంతం రవి తండ్రి నర్సయ్య	పంతం రవి తండ్రి నర్సయ్య	19	17 16	వాగు	20 21	
15	18	పట్టా	0.08	పంతం భాస్కర్ తండ్రి నర్సయ్య	పంతం భాస్కర్ తండ్రి నర్సయ్య	19	17 16	వాగు	20 21	
16	18	పట్టా	0.00	పంతం సత్తయ్య తండ్రి ఐలయ్య	పంతం సత్తయ్య తండ్రి ఐలయ్య	19	17 16	వాగు	20 21	
	మొత్తం		0.17							
17	20	పట్టా	0.14	పంతం సత్తయ్య ఐలయ్య	పంతం సత్తయ్య ఐలయ్య	62	21	18 19	60 21	
18	20	పట్టా	0.05	పంతం రమేష్ తండ్రి భాస్కర్	పంతం రమేష్ తండ్రి భాస్కర్	62	21	18 19	60 21	
	మొత్తం		0.19							
19	62	పట్టా	0.27	పంతం వెంకట్రాజం తండ్రి హన్మంతు	పంతం వెంకట్రాజం తండ్రి హన్మంతు	63	18 20	వాగు	60 61 58	3 పైప్ లైన్
	మొత్తం		0.27							
20	335	పట్టా	0.04	మొలంగుల సురేష్ తండ్రి నారాయణ	మొలంగుల సురేష్ తండ్రి నారాయణ	11	[illegible]	వాగు 12	338	2 [illegible]
21	335	పట్టా	0.04	మొలంగుల అశోక్ తండ్రి నారాయణ	మొలంగుల అశోక్ తండ్రి నారాయణ	11	[illegible]	వాగు 12	338	2 [illegible]
	మొత్తం		0.09							
22	336	పట్టా	0.03	(పట్టాదారు)చెట్టిపల్లి నర్సయ్య తండ్రి మల్లయ్య (అనుభవదారు)1.మొలంగుల సురేష్ తండ్రి నారాయణ 2.మొలంగుల అశోక్ తండ్రి నారాయణ 3)మొలంగుల అంజవ్వ భర్త నారాయణ	(పట్టాదారు) చెట్టిపల్లి నర్సయ్య తండ్రి మల్లయ్య (అనుభవ 1.మొలంగుల సురేష్ తండ్రి నారాయణ 2) మొలంగుల అశోక్ తండ్రి నారాయణ 3) మొలంగుల అంజవ్వ భర్త నారాయణ	337 338	[illegible]	335 11	[illegible]	7 [illegible] 2 [illegible]
	మొత్తం		0.03							
మొత్తం విస్తీర్ణం			4.02							

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూయజమానులకు చట్టప్రకారం భూనష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, సిద్దిపేట మరియు ప్రత్యేక ఉప-కలెక్టర్ (భూసేకరణ) యూనిట్-1, సిద్దిపేట వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయాల పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారు ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ యూనిట్-1, సిద్దిపేట గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో యేదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూ కమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేది నుండి ఆ నోటిఫికేషన్‌లో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు/అమ్మకాలు, తాకట్టుకు సంబంధించిన చర్యలు చేపట్టరాదు.

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూపిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణ పై సెక్షన్ 15 (1) ప్రకారం అభ్యంతరములు ఉన్నచో, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలో భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.


సం/- తహశీల్దార్, చిన్నకోడూర్ మండలము. | సం/- ప్రత్యేక ఉప-కలెక్టర్, (భూ.సే.) యూనిట్-1, కాళేశ్వరం ప్రాజెక్ట్, సిద్దిపేట జిల్లా. | సం/- అడిషనల్ కలెక్టర్ సిద్దిపేట జిల్లా. | సం/- జిల్లా కలెక్టర్ సిద్దిపేట జిల్లా.

DIPR RO No.135/LA-PP/ADVT/Publication/2024-25

కష్టకాలంలో కేంద్ర నిధులొస్తున్నాయి

» వాటిని ఏ రూపంలో ఇచ్చినా ఫర్వాలేదు

» ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థికంగా చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో కేంద్రం నిధులు వస్తున్నాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకోవడానికి ఇవి ఎంతో ఉపకరిస్తాయని చెప్పారు. మంగళవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో కొద్దిసేపు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో చేసిన ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ అన్ని విధాలా రాష్ట్రానికి తోడ్పాటును అందించేదిగా ఉంది. మేం పెట్టిన ప్రతిపాదనల్లో చాలావరకూ ఆమోదించారు. రాజధాని నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వడం వల్ల రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకొంటాయి. దీనివల్ల పన్నుల రూపేణా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెరుగుతుంది. కేంద్రం తన పూచీకత్తుతో వివిధ ఏజెన్సీల నుంచి నిధులు ఇప్పిస్తోంది. ఇందులో కొంత అప్పుగా ఉన్నా దానిని తీర్చేది 20, 30ఏళ్ల తర్వాతే. అప్పటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కచ్చితంగా మెరుగుపడుతుంది. రాజధానికి ఇచ్చే నిధుల్లో కొంత గ్రాంటుగా ఉంటుంది. దానిని తిరిగి చెల్లించాల్సిన పనిలేదు. రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో అనుకొన్న పనులు చేయాలంటే నిధులు కావాలి. వాటిని కేంద్రం ఏ రూపంలో ఇచ్చినా ఫర్వాలేదు' అని ఆయన అన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత తమదని బడ్జెట్‌లో కేంద్రం విస్పష్టంగా చెప్పిందని, అంతకంటే ఏం కావాలని ప్రశ్నించారు.

అమరావతి నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉంది

» ఆర్థిక మంత్రి నిర్మల స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ "అమరావతిలో రాజధాని నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ వంటి ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకుంటాం. రాజధాని నిర్మాణానికి కేంద్రం సహాయం చేయాలని ఏపీ విభజన చట్టంలో స్పష్టంగా చెప్పారు. రాజధాని నిర్మాణానికి ఈ ఏడాదే ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15వేల కోట్ల రుణం తీసుకుంటాం." అని నిర్మల తెలిపారు.

పోలవరానికి పూర్తి సహాయం

పోలవరం జాతీయ ప్రాజెక్టని, దాని నిర్మించడం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఎంత ఖర్చయినా కేంద్రమే భరిస్తుందని స్పష్టం చేశారు.

వాల్మీకి కార్పొరేషన్ అవినీతి కేసులో
సీఎం పేరు చెప్పాలని ఈడీ ఒత్తిడి

అధికారులపై సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఫిర్యాదు.. పోలీసు కేసు నమోదు

» ఈడీ తీరుపై కర్ణాటక సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేల నిరసన.. కేసుపై హైకోర్టు స్టే

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా ఈడీ అధికారులపై కేసు నమోదు చేసింది. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో జరిగిన అవినీతితో ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సంబంధం ఉందని చెప్పాలని తనపై ఒత్తిడి తెస్తున్నారని ఈడీ అధికారులపై సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఫిర్యాదు చేశారు. దీంతో ఈడీ అధికారులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. అవినీతి కేసులో సీఎం సిద్దరామయ్యను ఇరికించాలని చూస్తున్నారని ఈడీ అధికారులు మిట్టల్, మురళికణ్ణన్‌పై ఆరోపణలు వచ్చాయి. ఇదే అంశంపై సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డైరెక్టర్ బి. కళ్లేశ్ విల్సన్ గార్డెన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈడీ అధికారులపై భారతీయ న్యాయ సంహిత 3(5), 35(2), 351, 352 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు తనను విచారణకు రమ్మన్నారని, ఈనెల 16న శాంతినగర్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లానని కళ్లేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను ఈడీ అధికారులు 17 ప్రశ్నలు వేశారని, అన్నిటికీ సమాధానం చెప్పానని అన్నారు. వాటిలో మూడింటికి సమాధానాలు చెప్పేందుకు ఫైళ్లతోపాటు కిందిస్థాయి అధికారులు అవసరమని చెప్పానని అన్నారు. దీంతో 18న హాజరు కావాలని సూచించారన్నారు. ఆ తర్వాత మౌఖికంగా(రికార్డు చేయకుండా) ప్రశ్నించారని తెలిపారు. తనను అరెస్టు చేస్తామని, రెండేళ్లదాకా బెయిల్ కూడా రాదని ఈడీ అధికారులు బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 'ఈడీ మీకు సాయం చేస్తుంది. మంత్రి నాగేంద్ర, ఆర్థికశాఖ(సీఎం) ఒత్తిడి మేరకే నిధులు బదిలీ చేశామని రాసివ్వాలని ఒత్తిడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈడీ అధికారులు ముఖ్యమంత్రి, మంత్రుల పేరు చెప్పాలని వేధిస్తున్నారని ఆరోపిస్తూ విధాన సౌధ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాజకీయ ద్వేషంతో తమ ప్రభుత్వంపై చేస్తున్న కుట్రను ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికే సిట్ దర్యాప్తు చేస్తుండగా, ఈడీ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. సీఎం, మంత్రుల పేర్లు చెప్పాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేసిన కేసును రద్దు చేయాలని హైకోర్టులో ఈడీ పిటిషన్ దాఖలు చేసింది. ఈడీ తరఫున న్యాయవాది మధుకర్ దేశ్‌పాండే ఈ పిటిషన్ దాఖలు చేశారు. కేసుపై విచారణ జరిపిన హైకోర్టు మంగళవారం స్టే విధించింది.

అరసు కార్పొరేషన్‌లోనూ అవినీతి?

కర్ణాటకలో మరో అక్రమం వెలుగులోకి వస్తోంది. హాసన్‌లోని దేవరాజ్ అరసు బీసీ కార్పొరేషన్‌లోనూ భారీ అవినీతి జరిగినట్టు గుప్పుమంటోంది. రాత్రికి రాత్రి ఫైళ్లను దహనం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 7 నుంచి 10వ తేదీ మధ్యలో అరసికెరె తాలూకా హెబ్బనగట్టె గ్రామంలో ఓ ప్రైవేట్ స్థలంలో ఈ ఫైళ్లను దహనం చేశారని హాసన్ జిల్లా అధికారి సత్యభామకు కురవంక గ్రామ పంచాయతీ సభ్యుడు భైరగొండనహళ్లి ఉమేశ్ ఫిర్యాదు చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోసారి కౌంటర్ దాఖలు

» సమయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మరోసారి కౌంటర్ దాఖలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. కాంపిటెంట్ అథారిటీ అయిన రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి కౌంటర్ దాఖలు చేస్తారని.. అందుకు తగిన సమయం ఇవ్వాలని ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ హైకోర్టుకు మంగళవారం విజ్ఞప్తి చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. కేంద్ర హోంశాఖ నుంచి సూచనలు అందిన తర్వాత తమ వైఖరి తెలియజేస్తామని చెప్పారు. వాదనలు నమోదుచేసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది.

పాత బకాయిలు చెల్లిస్తేనే.. టెండర్లు!

» చేప పిల్లలను సరఫరా చేసే ఏజెన్సీల సహాయనిరాకరణ

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి పిలిచిన టెండర్లకు స్పందన లేకుండా పోయింది. 32 జిల్లాలకు వేర్వేరుగా టెండర్లు పిలవగా.. ఖమ్మంలో రెండు, మహబూబాబాద్‌లో ఒకటి కలిపి మూడు బిడ్లు మాత్రమే దాఖలయ్యాయి. పాత బకాయిలు రూ.96 కోట్లు చెల్లిస్తేనే.. టెండర్లు వేస్తామని కాంట్రాక్టు ఏజెన్సీ లు సహాయ నిరాకరణ చేస్తున్నాయి. దీంతో టెండర్ల గడువు జూలై 23తో పూర్తికాగా.. ఆగస్టు 2వరకు పొడిగిస్తూ రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

రాహుల్ మాటను నిలబెట్టాం

» మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతులకు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను తమ ప్రభుత్వం నిలబెట్టిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దేశంలో రూ.31 వేల కోట్ల రుణాలను మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ఇందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను అభినందిస్తున్నానన్నారు. ఇంత త్వరగా నిధులను సేకరించడం సాధారణ విషయం కాదని వ్యాఖ్యానించారు. మంగళవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో మంత్రి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కేసీఆర్ పదేళ్లలో రూ.21 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తే.. తాము ఏడు నెలల్లోనే రూ.31 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం విధివిధానాలపైనా కసరత్తు జరుగుతోందని చెప్పారు.

ప్రతిపక్షనేత హోదా ఇప్పించండి

» హైకోర్టులో జగన్ పిటిషన్

అమరావతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పించేలా అసెంబ్లీ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ కార్యదర్శి, లా అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ ముఖ్యకార్యదర్శి, స్పీకర్ కార్యదర్శితో పాటు వ్యక్తిగత హోదాలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సంకీర్ణ' బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్ ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేసింది. అలాగే, బీజేపీ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వ మనుగడ, ప్రయోజనాలకు అనుగుణంగా తమ భాగస్వామ్య పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు అధిక నిధులు ఇచ్చే ప్రయత్నమూ జరిగింది. మెరుగైన కేటాయింపుల ద్వారా తెలుగుదేశం, జనసేన, జనతాదళ్ (యునైటెడ్) పార్టీలను ఆర్థికమంత్రి బుజ్జగించే ప్రయత్నం చేశారు. కొత్తగా గెలుచుకున్న ఒడిశాలో నిలదొక్కుకోవడానికి ఆ రాష్ట్రానికి ప్రత్యేకంగా చేసిన కేటాయింపులు ఉపకరిస్తాయి.

గత ఐదేళ్ళ అస్తవ్యస్త పాలన కారణంగా రాజధాని అంటూ లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోయింది. ఆ లోటును తీర్చడానికి కేంద్ర బడ్జెట్లో రూ.15 వేల కోట్ల ఆర్థిక సహాయం ఉపకరిస్తుంది. భవిష్యత్తులో రాజధానికి మరిన్ని నిధులు అందించే ప్రయత్నం సాగుతుందని కూడా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ నిర్లిప్త వైఖరి కారణంగా అసంపూర్తిగా ఉండిపోయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత కేంద్రం తీసుకుంటుందని ప్రకటించడం, విశాఖపట్టణం–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు కారిడార్‌లలో పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం బాగుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో హామీలకు అనుగుణంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కూడా కొన్ని కేటాయింపులు జరిగాయి. ఇదేరీతిలో ఎన్‌డీఏలో భాగస్వామి అయిన మరో కీలక రాష్ట్రం బిహార్‌కు కూడా భూరి కేటాయింపులు, భారీ ప్రాజెక్టులతో బడ్జెట్లో మంచి వాటా దక్కింది. బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధి కోసం 'పూర్వోదయ' ప్రణాళిక రూపొందించనున్నట్టు కూడా ఆర్థికమంత్రి ప్రకటించారు. ఎనిమిదిమంది బీజేపీ ఎంపీలను ఇచ్చిన తెలంగాణకు ఈ బడ్జెట్‌లో ఏమాత్రం చోటు దక్కకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. సంకీర్ణధర్మాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకున్న కేంద్రప్రభుత్వం విభజనచట్టంలో తెలంగాణకు ఉన్న హామీలను విస్మరించింది. పాలమూరు–రంగారెడ్డి సహా ఏ ఒక్క అంశంలోనూ కేంద్రంనుంచి సహకారం దక్కని, తెలంగాణ ఊసేలేని బడ్జెట్ ఇది. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దని పక్షంలో బీజేపీ రాజకీయంగా నష్టపోతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన హెచ్చరికను అర్థం చేసుకోవచ్చు.

తొలి పదేళ్ళకు భిన్నంగా ఈ మూడోవిడత పాలనలో మోదీ ప్రభుత్వం తనను నిలబెడుతున్న రెండు పార్టీల డిమాండ్లకు తలొగ్గి ఆ రాష్ట్రాలకు కేటాయింపులు చేయడంతో విపక్షాలు దీనిని సర్కార్ బచావో, కుర్సీ బచావో బడ్జెట్‌గా వ్యాఖ్యానిస్తున్నాయి. బిహార్ సంగతి అటుంచితే, ఆంధ్రప్రదేశ్ మాత్రం ఈ ప్రత్యేక సహాయానికి యోగ్యమైనదే. ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని, పోలవరం ఎంతముఖ్యమో, వాటికి కేంద్రం చేయూతనివ్వడం ఎంత అవసరమో విపక్షనేతలకు తెలియనిదేమీ కాదు. ఇక, యువత, ఉపాధి, నైపుణ్యాలకు సంబంధించి బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలు అనేకం తన మానిఫెస్టోనుంచి తీసుకున్నారని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. రాహుల్ న్యాయ్‌యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు కూడా ఈ బడ్జెట్‌లో ప్రతిఫలించాయని అంటోంది.

దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే క్రమంలో తొమ్మిది కీలక ప్రాధాన్యతలను ఆర్థికమంత్రి ప్రకటించారు. వ్యవసాయ ఉత్పాదకతల పెంపునకు పెద్దపీట వేశారు. కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించడం, కూరగాయల ఉత్పత్తిని పెంచడానికి క్లస్టర్ల ఏర్పాటు వంటి ప్రతిపాదనలు వ్యవసాయరంగాన్ని ఉత్తేజితం చేస్తాయి. ఉపాధి కల్పనను కూడా ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా చెబుతోంది. కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించే యాజమాన్యాలకు ప్రోత్సాహకాలు ప్రకటించడం బాగుంది. దీర్ఘకాలంగా ఆదాయపు పన్ను విభాగంలో ఎలాంటి మార్పులు జరగనందున, కొత్త ఐటీ అసెస్‌మెంట్ విధానం ఎంచుకునే వారికి కొన్ని ప్రయోజనాలు దక్కాయి. స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని, వివిధ ఐటీ శ్లాబ్‌లలోకి వచ్చే ఆదాయ పరిమితిని పెంచడం వల్ల ఒక్కో ఐటీ అసెసీకి ఏడాదికి రూ.17,500 మేరకు పన్ను భారం తగ్గుతుందని అంచనా. మూడు కేన్సర్ ఔషధాలపై కస్టమ్స్ సుంకం జీరో స్థాయికి తగ్గించడం పరోక్ష పన్నుల విభాగంలో తీసుకున్న పెద్ద చర్య. దీని వల్ల కేన్సర్ రోగులకు ప్రాణాధార ఔషధాలు తక్కువ ధరకు అందుబాటులోకి వస్తాయి. మహిళా ఆధారిత అభివృద్ధిని ఉత్తేజితం చేయడానికి మహిళలు, బాలికలకు ప్రయోజనం చేకూర్చే పథకాలకు రూ.3 లక్షల కోట్లు కేటాయించడం సముచితం. ప్రభుత్వం ప్రాధాన్యతా విభాగాలుగా ప్రకటించిన పేదలు, యువత, అన్నదాత, మహిళలకు ప్రయోజనం చేకూర్చే ప్రతిపాదనలు బడ్జెట్లో ఉన్నప్పటికీ ఆరోగ్య రంగానికి చెప్పుకోదగ్గ ప్రాధాన్యం లభించకపోవడం నిరాశ కలిగిస్తుంది.

రెండు భారత్‌లు, రెండు మిత్రపక్షాలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో 2024–25 సంవత్సర వార్షిక బడ్జెట్ ప్రవేశ పెడుతూ ఆంధ్రప్రదేశ్, బిహార్ పేర్లను పదే పదే ప్రస్తావించినప్పుడు ఎంతో వీనుల విందుగా అనిపించింది. గత పది సంవత్సరాలుగా బడ్జెట్‌లో రాష్ట్రాల పేర్లను కేవలం ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు సమీపించినప్పుడే ప్రస్తావించడం జరిగింది. ఏ రాష్ట్రానికి వెళితే ఆ రాష్ట్రానికి తన మనసులో సమున్నత స్థానం ఉన్నదంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పేవారు. అయితే ఇప్పుడు అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్, బిహార్‌ల గురించి ఆర్థికమంత్రి సభలో ప్రకటనలు చేస్తున్నప్పుడు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బల్లలు చరిచి హర్షం ప్రకటిస్తున్న దృశ్యం అపురూపం అని చెప్పక తప్పదు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయడానికి కేంద్రమే ముందుకు వస్తుందని, విభజన చట్టం ప్రకారం తాము అందుకు కట్టుబడి ఉన్నామని నిర్మలా సీతారామన్ చెప్పారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కనుక ఎంత ఖర్చయినా భరిస్తామని ఆమె చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని ఇంత కాలం లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేసిన ఆర్థికమంత్రి ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకుని మరీ రాజధాని నిర్మాణానికి మద్దతునిస్తామని, రాష్ట్రం అందులో కొంత మొత్తం భరించలేకపోయినా, గ్రాంట్‌గా ఇచ్చే విషయంపై చర్చిస్తామని తెలిపారు. ఇక బిహార్‌కైతే విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, హైవేలు, వంతెనలు, విద్యుత్ ప్లాంట్లు, కారిడార్ల నిర్మాణానికి ఆమె భారీ మొత్తాన్ని ప్రకటించారు. నిర్మలా సీతారామన్ ఏపీ, బిహార్‌ల గురించి పదే పదే ప్రస్తావిస్తున్నప్పుడు సభలో తెలుగుదేశం, బిహార్ ఎంపీలు మాటిమాటికీ ఆనందాతిరేకంతో హర్షధ్వానాలు చేయడం కనిపించింది. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత ఏపీ, బిహార్ పట్ల ఆమె పక్షపాతం చూపించారని, ఇక ఈ రెండు రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందితే ఇతర రాష్ట్రాలు బిహార్, ఏపీలుగా మారిపోతాయని సోషల్ మీడియాలో పలు వ్యాఖ్యలు చెలరేగాయి.

దాదాపు పది సంవత్సరాల తర్వాత ఏపీ, బిహార్‌లకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించడం, ఆ రాష్ట్రాల అవసరాలను గుర్తించడం చెప్పుకోదగిన విషయమే. ఈ కాలంలో అమరావతి, ఆంధ్రప్రదేశ్, బిహార్ అన్న పదాలు ఢిల్లీలో వినపడేవి కావు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి కొన్ని పార్టీల మద్దతుపై ఆధారపడవలిసివస్తే ఏం జరుగుతుందో మంగళవారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని బట్టి అర్థమవుతుంది. 'ఇది కుర్చీని కాపాడుకునేందుకు ప్రవేశపెట్టిన బడ్జెట్' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, రాజకీయ ఒత్తిళ్లతోనే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ అన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్, బిహార్‌లకు కేంద్రం మద్దతు ప్రకటించడాన్ని వారెవరూ వ్యతిరేకించలేదు. పదేళ్ల క్రితం విభజనకు గురై తీవ్ర ఆర్థిక లోటుకు గురైన ఆంధ్రప్రదేశ్‌కు అత్యంత ముఖ్యమైన రాజధాని, పోలవరం నిర్మాణం ఎంత ముఖ్యమో అందరికీ తెలుసు. అదే విధంగా ఇవాళ కేంద్రం బిహార్‌కు ప్రకటించినన్ని ప్రాజెక్టులు గతంలోనే దశల వారీగా ప్రకటించి అమలు చేసినట్లయితే ఆ రాష్ట్రం రూపురేఖలు మారి ఉండేవని కూడా అందరికీ తెలుసు. ప్రతిపక్షాలు అన్నట్లు ఒకవేళ రాజకీయ ఒత్తిళ్లకు గురై మోదీ ప్రభుత్వం బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు పెద్ద ఎత్తున చేయూతనివ్వాలని అనుకున్నప్పటికీ అది మంచి పరిణామమే. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్డీఏ సాధించిన సీట్ల వల్లనే ఇవాళ కేంద్రంలో మెజారిటీ ప్రభుత్వం ఏర్పాటు కాగలిగిందన్నది సర్వవిదితం.

తమ మద్దతు ఆధారంగా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి తమ రాష్ట్రాలకు కావల్సిందేమిటో మోదీకి స్పష్టంగా చెప్పారని అర్థమవుతోంది. వారు కేంద్రంలో కేబినెట్ పదవులు కానీ, ఇతర రాజకీయ ప్రయోజనాలు కానీ ఆశించకుండా తమ రాష్ట్రాల నిర్దిష్ట సమస్యలను పరిష్కరించుకోవడంపైనే దృష్టి సారించారు. ఒక రకంగా కేంద్ర విధానాలపై ఈ ఇద్దరు నేతల ప్రభావం గణనీయంగా ఉందని ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోంది. గత పది సంవత్సరాల్లో చూడని నరేంద్రమోదీని ఈ బడ్జెట్‌లో తమకు కనిపించారని, తన వైఖరికి భిన్నంగా పట్టువిడుపులు ప్రదర్శించి, నిధుల కేటాయింపు విషయంలో ఉదారంగా వ్యవహరించారని బీజేపీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ఇది కూడా ఒకరకంగా ఆహ్వానించదగిన విషయమే.

గతంలో సంకీర్ణ ప్రభుత్వాధినేతలు కూడా ఇలాంటి పట్టువిడుపులతో వ్యవహరించేవారు. పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు జార్ఖండ్ ముక్తి మోర్చాను సంతోష పెట్టేందుకు అటానమస్ హిల్ కౌన్సిల్‌ను ప్రకటించారు. అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్, మమతా బెనర్జీ తదితరులతో ఎంతో సత్సంబంధాలు ఏర్పర్చుకున్నారు. కోల్‌కతాలో మమతా బెనర్జీ నివాసానికి వెళ్లిన వాజపేయి ఆమె తల్లి గాయత్రీ బెనర్జీని చూసి పాదాలకు నమస్కరించిన దృశ్యం చరిత్రపుటల్లో నిలిచిపోయింది. 'చంద్రబాబునాయుడు ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించండి. ఆయన తన రాష్ట్రం గురించే కాని తన స్వంత సమస్యల్ని ప్రస్తావించరు' అని వాజపేయి తనకు ఆదేశాలిచ్చారని అప్పుడు పీఎంఓలో ఓఎస్‌డీగా ఉన్న ఎన్‌కే సింగ్ ఒక సందర్భంలో చెప్పారు. సంకీర్ణ ధర్మాన్ని వాజపేయిలాగా ఎవరూ అద్భుతంగా నిర్వహించలేరని ఎన్‌కే సింగ్ చెప్పారు. తనతో విభేదించిన వారితో కూడా వాజపేయి మాట్లాడగలిగేవారని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉద్భవించిన నేత కనుక ఆయన ఏకాభిప్రాయానికి విలువనిచ్చేవారని బీజేపీ నేత అరుణ్ జైట్లీ సైతం ప్రశంసించారు. ఒకప్పుడు పూర్తిగా అంటరాని పార్టీగా ఉన్న బీజేపీ, ఇతర పార్టీల్లో కూడా ఆమోద యోగ్యత సాధించేందుకు వాజపేయి ప్రధాన కారణమని ఆయన మరణానంతరం రచించిన ఒక వ్యాసంలో జైట్లీ తెలిపారు. సంకీర్ణ ప్రభుత్వమంటూ నిర్వహించిన తర్వాత కొన్ని పట్టువిడుపులు తప్పవని యూపీఏ ప్రభుత్వంలో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ సైతం అన్నారు.

సంకీర్ణ ధర్మం మూలంగా ఇవాళ ఏపీ, బిహార్‌లకు ఎంతో కొంత ఊరట కలిగించే నిర్ణయాలు కేంద్రం తీసుకుంటోంది కాని ఇవాళ ఒక రాష్ట్రానికి చేయూతనిచ్చేందుకు కేంద్రం ప్యాకేజీనివ్వాల్సిన అవసరం ఎందుకు ఏర్పడుతోంది? భారతదేశంలో అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలు సమానంగా ఎందుకు అభివృద్ధి చెందడం లేదు? ఇవాళ మన దేశంలోనే రెండు భారత్‌లు ఎందుకు ఉన్నాయి? ప్రముఖ రచయిత ఛార్లెస్ డికెన్స్ తన 'రెండు మహానగరాలు' నవలలో అభివర్ణించినట్లు వైభవోజ్జ్వలంగా వెలిగే ప్రాంతాలు, వల్లకాడుగా కనిపించే ప్రాంతాలు ఒకేసారి మనకు ఎందుకు కనిపిస్తున్నాయి? కేంద్ర బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ వర్గీకరించిన నాలుగు కులాల్లో పేదలు ఎప్పుడూ ఒక కులంగా ఎందుకు ఉండాల్సి వస్తోంది? ఆ పేదల్లో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు ఎక్కువగా ఎందుకు ఉన్నారు? వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇంకా ఎందుకు ప్రకటించాల్సి వస్తోంది? 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాల సరఫరా ఎందుకు చేయాల్సి వస్తోంది? వేల కోట్లు ఖర్చు పెట్టి కుమారుడి వివాహం చేసిన అంబానీ ఉన్న దేశంలోనే, పెళ్లికోసం అప్పుల పాలైన అభాగ్యులు, ఇంకా వరకట్న మరణాలకు గురయ్యే యువతులు ఎందుకు కనపడతారు? భారతదేశం ప్రపంచంలో ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కావచ్చు కాని మానవాభివృద్ధి సూచికల్లోనూ, ఆరోగ్య సంరక్షణలోనూ, విద్యారంగంలోనూ భారతదేశం ఎంతో వెనుకబడి ఉన్నది. భారతదేశంలో 90 శాతం అట్టడుగున ఉంటే పది శాతం కనివినీ ఎరుగని స్థాయిలో సంపన్నులయ్యారని, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న జాతీయ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ సంస్థ డైరెక్టర్ రతిన్‌రాయ్ ఒక వ్యాసంలో రాశారు. ఇద్దరు సంపన్న భారతీయులు దేశ సంపదలో 1.4 శాతం హస్తగతం చేసుకుంటే ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం 60 శాతం జనాభా రోజుకు 3.10 డాలర్ల కంటే తక్కువ మొత్తంపై జీవిస్తున్నారనడంలో అవాస్తవం లేదు. చదువుకున్న ప్రతి కుటుంబంలోనూ ఒకరు విదేశాలకు పొట్ట కూటికోసం వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఫైవ్ స్టార్ హోటళ్లను మించిన ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు వెచ్చించే సంపన్నులు ఒకవైపు, ఎయిమ్స్ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సైతం ఓపీడీ కోసం పడిగాపులు కాచే కోట్లాది పేదలు మనకు కనపడతారు.

కేంద్ర బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే చదివిన వారికి భారతదేశంలో జరుగుతున్న అభివృద్ధి ఎంతో అద్భుతంగా కనిపిస్తుంది. భారతదేశంలో మౌలిక సదుపాయాలపై భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారని, రేవులు, విమానాశ్రయాలు, రహదారులు, వంతెనల నిర్మాణం వేగంగా జరుగుతోందని, సిమెంట్, స్టీలు, బొగ్గు, ఫార్మస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ఎలెక్ట్రానిక్స్, ఆటోమోటివ్, ఆహారోత్పత్తులు, వినియోగ వస్తువుల రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎకనమిక్ సర్వే తెలిపింది. రక్షణ రంగం ఎగుమతులు రూ. లక్ష కోట్లకు దాటిపోయాయని చెప్పుకుంది. అదే సమయంలో దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యకు ఆర్థిక సర్వేలో ఎలాంటి జవాబు లేదు. నిరుద్యోగాన్ని నివారించడం అధికంగా ప్రైవేట్ రంగ బాధ్యత అని సర్వే చేతులు దులుపుకుంది. ఇవాళ్టికీ శ్రమజీవుల్లో 80 శాతం మంది అసంఘటితరంగంలో చాలీ చాలని జీతాలతో దుర్భర జీవితం అనుభవిస్తున్నారనడంలో కూడా వాస్తవం లేకపోలేదు. అసమాన అభివృద్ధి, లోటు బడ్జెట్, అప్పులతో సతమతమవుతున్న రాష్ట్రాలు ఉన్నంతకాలం సంకీర్ణ ప్రభుత్వాల్లోనే ప్రజల సమస్యలు ఎంతో కొంత పరిష్కారమవుతాయన్న విషయంలో సందేహం లేదు.



akbar

దాదాపు పది సంవత్సరాల తర్వాత ఏపీ, బిహార్‌లకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించడం, ఆ రాష్ట్రాల అవసరాలను గుర్తించడం చెప్పుకోదగిన విషయమే. ఈ కాలంలో అమరావతి, ఆంధ్రప్రదేశ్, బిహార్ అన్న పదాలు ఢిల్లీలో వినపడేవి కావు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి కొన్ని పార్టీల మద్దతుపై ఆధారపడవలిసివస్తే ఏం జరుగుతుందో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని బట్టి అర్థమవుతుంది. అసమాన అభివృద్ధి, లోటు బడ్జెట్, అప్పులతో సతమతమవుతున్న రాష్ట్రాలు ఉన్నంతకాలం సంకీర్ణ ప్రభుత్వాల్లోనే ప్రజల సమస్యలు ఎంతో కొంత పరిష్కారమవుతాయన్న విషయంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

మార్వాడీల వ్యాపార విస్తరణపై అసహనం వ్యక్తం చేసే వారు, ఆ వ్యాపారదక్షుల విజయ రహస్యాలను తెలుసుకోవడం మంచిది. ఒకప్పుడు తిరుపతిలోని చిన్న బజారు లేదా హైదరాబాద్‌లోని బేగంబజారు లేదా గుల్జార్ హౌజ్‌కు మాత్రమే పరిమితమైన మార్వాడీలు నేడు మదనపల్లె, జగిత్యాల తరహా పట్టణాలకు విస్తరిస్తున్నారు. అసూయపడితే ఎవరికి నష్టం? మార్వాడీలు అలా ముందంజ వేయడానికి దోహదం చేస్తున్నవేమిటో ఆకళింపుచుకోవాలి.

వ్యాపార విజయాలు మార్వాడీల సొంతం

రాజస్థాన్. సారవంతమైన సేద్యపు భూములు లేవు, విశాల బాహ్య ప్రపంచానికి వెళ్లే నౌకాయాన మార్గాలు అంతకన్నా లేవు. అరబ్బు దేశాలలో వలే అత్యధిక ప్రాంతం ఎడారిగా ఉన్న భారతీయ సీమ రాజస్థాన్. ఒంటెలు ఒక ప్రధాన అంతర్భాగంగా ఉన్న రాజస్థానీయుల జీవన విధానం విలక్షణమైనది. తలవంచని వీరులు వారు. అలనాటి హల్దీఘాట్ యుద్ధం మొదలు నేడు తెలుగునాట పానీపూరి విక్రయాల వరకు అధిపత్య ఆరాటం ఆ భూమి పుత్రులలో ఉంది.

వాణిజ్య రంగంలో మార్వాడీల పాత్ర విశిష్టమైనది, అద్వితీయమైనది, చరిత్రాత్మకమైనది. పహేలే షా బాద్ మే బాద్ షా (మొదట షావుకారు ఆ తర్వాత రాజు) అనేది మార్వాడీల నానుడి. ఏ రాజ్యంలో మార్వాడీ వ్యాపారులు ఎక్కువ సంఖ్యలో ఉంటే ఆ రాజ్య ఆదాయం సమృద్ధమని కూడ అలనాటి కాలంలో రాజుల అభిప్రాయంగా ఉండేది. కాలం నాటి రాచరికం నుంచి ఈ నాటికీ వలస వ్యాపారులకు పర్యాయపదం మార్వాడీలు. అఫ్ఘానిస్తాన్ సుల్తాన్‌లు, హైదరాబాద్ నిజాం నవాబుల నుండి పిఠాపురం సంస్థానాదీశుల దాకా చిన్న, పెద్ద పాలకులు అందరూ మార్వాడీలకు స్వాగతం పలికారు, ఆదరించారు, రాజ్య ఆదాయాన్ని పెంపొందించుకున్నారు. వర్తమాన భారతదేశంలో రాజస్థానీలు ప్రత్యేకించి మార్వాడీల జైత్రయాత్ర ఆసేతు హిమాచలం, మరీ ముఖ్యంగా తెలుగునాట వ్యాపార సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తోంది.

గల్ఫ్ లేఖ

వర్తక శ్రేష్ఠులు అయిన మార్వాడీలు గతంలో నగరాలలో ఆటోమొబైల్, హార్డ్‌వేర్, బంగారం, మిఠాయి ఇత్యాది వ్యాపారాలకు మాత్రమే పరిమితమయ్యారు. కాలంతో పాటు వారూ మారారు. గత కొన్నాళ్ళుగా గోదావరి నదీ తీరంలోని నిర్మల్ జిల్లా మొదలు పెన్నా నదీ తీరంలోని నెల్లూరు దాకా మార్వాడీల ఉనికి అనూహ్యంగా పెరిగిపోతోంది. ఈ సమూహాల వ్యాపార దక్షతను ఎదుర్కోలేక స్థానిక సంప్రదాయక వ్యాపారవర్గాలు వెనుకంజ వేస్తున్నాయి. వ్యాపార రంగం నుంచి నిష్క్రమిస్తున్నాయనడం సత్య దూరం కాదు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నూతన, వినూత్న వ్యాపార పద్ధతులతో మార్వాడీలు తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటున్నారు. స్వేచ్ఛా విపణిలో తామెందుకు వెనుకబడిపోతున్నామనేది తెలుగు వ్యాపారవేత్తలు ఒకసారి సమీక్షించుకోవల్సిన సందర్భమిది.



ఒక వైపు ఈ–కామర్స్ విజృంభణ, మరో వైపు యువతరం నిరాసక్తికి తోడుగా మార్వాడీల విస్తరణ ఫలితంగా తెలుగునాట సామాజిక జీవనంలో ఒక భాగమైన సంప్రదాయ షావుకారు దుకాణాలు సన్నగిల్లుతున్నాయి. సారవంతమైన సాగు భూములు, పుష్కల వ్యాపారవకాశాలు ఉన్నా తెలుగు ప్రాంతాలకు చెందిన అసంఖ్యాక యువజనులు విదేశీ కొలువుబాట పడుతున్నది. వాణిజ్యమే వృత్తిగా ఇప్పటి వరకు రాణించిన వైశ్య యువత కూడ పెద్ద సంఖ్యలో దేశ సరిహద్దులు దాటుతోంది. వ్యాపారంలో అడుగు పెట్టడానికి ఇతర సామాజిక వర్గాల యువత సాహసించలేకపోతుంది. స్వంత గడ్డపై స్థానికులు నిస్సహాయ స్థితిలో సతమతమవుతుండగా ఎక్కడి నుంచో గంపెడంత ఆశతో తెలుగునాటకు వచ్చిన మార్వాడీలు వ్యాపార విజయాలతో పురోగమిస్తున్నారు.

రాజస్థానీ వ్యాపారులతో పాటు వారి గద్దీలు (గుమాస్తగిరి)లలో పని చేస్తున్న రాజస్థానీ యువకుల సంఖ్య కూడ అనూహ్యంగా పెరిగిపోతోంది. తమ సేట్‌ల దుకాణాలలో గద్దీలపై గుమాస్తాలుగా పని చేస్తున్న ఆ యువకులు అనతికాలంలో సేట్‌లుగా ఎదుగుతూ స్వంత వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. తమ సేట్‌ల గద్దీలలో యాజమానుల పట్ల నిబద్ధత, విధేయతతో పని చేసే ఈ యువకుల నుంచి తెలుగు యువకులు నెర్చుకోవల్సింది చాలా ఉంది.

గల్ఫ్ దేశాలలో కోట్లకు పడగలెత్తిన విదేశీ వాణిజ్యవేత్తలలో కేరళలోని మలబార్ ప్రాంతీయులు, యుద్ధ పీడిత యమన్‌లోని హద్రమౌత్ ప్రాంతీయులు అగ్రగాములు. రిటైల్ రంగంలో వీరి పాత్ర ప్రముఖం. ప్రస్తుతం తెలుగునాట మార్వాడీల జయప్రద వ్యాపార సరళి కూడ సరిగ్గా అదే. సుదీర్ఘ కాలంగా ప్రజాజీవితంలో ఉన్నప్పటికీ ఇంత వరకు మజ్లిస్ నాయకులు ఎవరూ కూడ తెలుగు భాషను నేర్చుకోలేదు. అయితే రాజస్థానీ వ్యాపారస్తులు, వారి గద్దీ గుమాస్తాలు అందరూ తెలుగు భాషను అనర్గళంగా మాట్లాడగలగడం విశేషం. గల్ఫ్‌లో మలయాళీల విజయం వెనుక అరబ్బీ భాషా కౌశలాలు ఉన్నట్లుగా తెలుగునాట రాజస్థానీలు ముందడుగు వేయడానికి వారు తెలుగు భాష నేర్చుకోవడం కూడా ఒక కారణమని చెప్పవచ్చు. మార్వాడీల వ్యాపార విస్తరణపై అసహనం వ్యక్తం చేసే వారు, ఆ వ్యాపార దక్షుల విజయ రహస్యాలను తెలుసుకోవడం మంచిది. ఒకప్పుడు తిరుపతిలోని చిన్న బజారు లేదా హైదరాబాద్‌లోని బేగం బజారు లేదా గుల్జార్ హౌజ్‌కు మాత్రమే పరిమితమైన మార్వాడీలు నేడు మదనపల్లె, జగిత్యాల తరహా పట్టణాలకు విస్తరిస్తున్నారు మరి. అసూయపడితే ఎవరికి నష్టం? స్థానికేతరులు అయిన మార్వాడీలు అలా ముందంజ వేయడానికి దోహదం చేస్తున్నవేమిటో ఆకళింపుకోవాలి.

ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ ఫలితంగా మాతృభాషా సంస్కృతులు ఉపేక్షింపబడుతున్న ప్రస్తుత తరుణంలో మార్వాడీలు ఎక్కడ స్థిర పడినా తమ భాషా, సంస్కృతులను సంరక్షించుకుంటున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా మార్వాడీ మహిళలు పాటించే ఆధ్యాత్మిక చింతనా ప్రపత్తులు, సంప్రదాయాలు అందరికీ ఆదర్శప్రాయం కావాలి. వ్యాపార రంగంలో మార్వాడీలను విమర్శిస్తున్న వారు భవన నిర్మాణ రంగంలో ప్రబలుతోన్న ఉత్తరప్రదేశ్ వృత్తి నిపుణుల గురించి ఏమంటారు? రాజస్థానీ మార్వాడీల, లేదా కేరళ మలబారీల సాఫల్య బాటను అనుసరించి తెలుగు యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి, వీలయితే సృష్టించుకోవాలి. విదేశీ వలసలలో తెలుగువారు ఉపాధి రంగంలో రాణించినట్లుగా మార్వాడీలు వ్యాపారాన్ని ఎంచుకుని అందులో రాణిస్తున్నారు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

హామీల అమలుకు బడ్జెట్‌లో ఏం చేయాలి?

2024–25 సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను జూలై 25న అసెంబ్లీలో ప్రవేశపెట్టే సమయానికి కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడున్నర నెలలు పూర్తి అవుతుంది. ఏడున్నర నెలల్లో వివిధ అంశాలపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా, గత ప్రభుత్వానికి భిన్నంగా, రేవంత్ ప్రభుత్వం ప్రజా పక్షాలతో చర్చలు సాగించడానికి కొన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన అనేక హామీల విషయంలో ఆచరణాత్మక అడుగులు ఇంకా ప్రారంభం కావాల్సే ఉంది. మానిఫెస్టోలో కేవలం 6 గ్యారంటీలకు మాత్రమే కాకుండా, అన్ని హామీలకు వాటి ప్రాధాన్యత వాటికి ఉంది. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు కేవలం 6 గ్యారంటీల చుట్టూ మాత్రమే జరిగితే సరిపోదు.

6 గ్యారంటీలలో భాగంగా, వాస్తవంగా సాగులో ఉండే కనీసం కోటీ 20 లక్షల ఎకరాలకు రైతు భరోసా సహాయం అందించాలంటే, రూ.18,000 కోట్ల నిధులు అవసరమవుతాయి. ఒక సర్వే నంబర్‌పై భూ యజమాని, కౌలు రైతులలో ఎవరో ఒకరికే రైతు భరోసా సహాయం అందిస్తామనుకుంటే మాత్రమే ఈ మొత్తం సరిపోతుంది. దీని కోసం ముందుగా వాస్తవ సాగుదారుల నమోదు జరగాలి. అందుకే, రాష్ట్రంలో కౌలు రైతులకు రైతు భరోసా అందించడానికి వీలుగా ముందుగా 2011 కౌలు రైతుల గుర్తింపు చట్టాన్ని తప్పకుండా అమలు చేస్తామని ఈ అసెంబ్లీ సమావేశాలలో ప్రకటించాలి. వ్యవసాయ కూలీలకు కూడా రైతు భరోసా అందించడానికి ఆయా కూలీ కుటుంబాల గుర్తింపునకు నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకోవాలి. ఈ హామీ అమలు కోసం కూడా బడ్జెట్లో కనీసం రూ.1500 కోట్లు కేటాయించుకోవాలి.



కాంగ్రెస్ మానిఫెస్టోలో 6 గ్యారంటీలకు మాత్రమే కాకుండా, మిగతా అన్ని హామీలకు ప్రాధాన్యత ఉంది. రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు కేవలం 6 గ్యారంటీలకు జరిగితే సరిపోదు.

రాష్ట్రంలో మూతపడిన చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని మానిఫెస్టోలో హామీ ఇచ్చారు. గతంలో ఏర్పాటు చేసిన పాత చక్కెర కర్మాగారాలు యథాతథంగా పనికిరాకపోవచ్చు. కాబట్టి వాటి స్థానంలో కేంద్రం ప్రకటించిన వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి నుంచి సహాయం రాబట్టుకుని ఈ సారి రాష్ట్ర బడ్జెట్‌లో కూడా కనీసం రూ.300 కోట్ల నిధులు కేటాయించి, చెరకు పండే అవకాశం ఉన్న అన్ని జిల్లాలలో మధ్యస్థ సామర్థ్యం (కనీసం రోజుకు మూడు వేల టన్నులు) కలిగిన చక్కెర కర్మాగారాలను ఏర్పాటు చేయడానికి పూనుకోవాలి. 2025 అక్టోబర్‌లో మొదలయ్యే చెరకు క్రషింగ్ సీజన్ నాటికయినా కర్మాగారాలను ఏర్పాటు చేస్తామని అనుకుంటే, ఇప్పటి నుంచీ చెరకు పండే ప్రాంతాలలో రైతులతో చర్చించి, ఈ ఖరీఫ్ సీజన్ నుంచీ చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి ప్రయత్నం చేయాలి. రైతులకు లీటరుకు రూ.5 అదనంగా చెల్లిస్తామనే హామీకి అనుగుణంగా బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలి. రాష్ట్ర పాల రైతుల సహకార సంఘాల సభ్యులందరికీ దీనిని వర్తింపచేయాలి.

రాష్ట్ర రైతుల విత్తన అవసరాలను తీర్చడానికి విత్తన కార్పొరేషన్‌ను పటిష్ఠం చేసి, రైతు సహకార సంఘాల భాగస్వామ్యంతో రాష్ట్రంలో విత్తనోత్పత్తికి ప్రణాళిక చేయాలి. ఈ సంవత్సర బడ్జెట్‌లో కనీసం రూ.200 కోట్ల నిధులు కేటాయించాలి. ప్రభుత్వం కోసం గత నాలుగేళ్లుగా ధాన్యం సేకరణ చేసిన రైతు సహకార సంఘాలకు, ఉత్పత్తిదారుల కంపెనీలకు రావాల్సిన కమిషన్ బకాయిలు చెల్లించడానికి కూడా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

వివిధ కారణాలతో పంట నష్టపోతే, వెంటనే నష్ట పరిహారం అందించేలా పంటల బీమా పథకం అమలు చేస్తామని మానిఫెస్టోలో హామీ ఇచ్చారు. మరోవైపు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తామని కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారు. కానీ ఈ పథకం కోసం 2024 మే 1 నాటికి రావలసిన పంటల బీమా పథకం నోటిఫికేషన్ ఈనాటికీ విడుదల కాలేదు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఈ సీజన్‌లో కూడా నష్టపోతూనే ఉన్నారు. గత ప్రభుత్వ ఆచరణకు భిన్నంగా, ఈ ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి రబీలో కొన్ని ప్రయత్నాలు చేసింది కానీ, అది నిరంతర ప్రక్రియగా ఉండాలంటే, పంటల బీమా పథకం అవసరం. ప్రభుత్వమే బీమా కంపెనీ పెట్టి, ఈ పథకాన్ని అమలు చేస్తే, ప్రైవేట్ కంపెనీలకు ముందస్తు ప్రీమియం చెల్లింపు భారం ప్రభుత్వంపై తగ్గుతుంది. రాష్ట్ర ప్రభుత్వ వాటాయే కాకుండా, రైతు వాటా కూడా కలిపి, ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తానని ప్రకటించింది కనుక, నిర్ణయించిన ప్రీమియం రేట్లతో, కేంద్ర బీమా పథకం మార్గదర్శకాల మేరకు కేంద్రం వాటాను రాబట్టుకోవచ్చు. అందువల్ల, ఇప్పటికీ పంటల బీమా నోటిఫికేషన్ రాకపోయినా, రాష్ట్ర రైతులు ఈ ఖరీఫ్ ప్రారంభం నుండీ పంటల బీమా పరిధిలో కవరయి ఉన్నారని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఈ అసెంబ్లీ సమావేశాలలో చేయాలి. ఈ సీజన్‌లో నష్టపోతున్న రైతులను పరిహారం చెల్లించి ఆదుకోవాలి. పంటల బీమా కోసం కనీసం రూ.3000 కోట్లు ఈ సంవత్సర రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించుకోవాలి.

అన్ని పంటలను మెరుగైన మద్దతు ధరతో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించినప్పటికీ, ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో ఇది అసాధ్యం. సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించుకోవాలి. రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ, మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ హాస్టళ్ల కోసం కనీసం 20 లక్షల టన్నుల బియ్యం అవసరమనుకుంటే, అందుకు అవసరమైన 30 లక్షల టన్నుల ధాన్యం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం కనీసం రూ.15,000కోట్లు కేటాయించుకోవాలి.

అలాగే, అన్ని పంటలు కాకపోయినా, కనీసం ఈ సీజన్ నుండీ ప్రారంభించి, రాష్ట్రంలో పండే పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తామని సూత్రప్రాయంగా ఈ అసెంబ్లీ సమావేశాలలో ప్రకటించాలి. మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా పెట్టి, బ్యాంకుల నుంచి రుణం తీసుకుని రైతు సహకార సంఘాల భాగస్వామ్యంతో ఈ పంటలను కొనుగోలు చేస్తే, ప్రాసెసింగ్ చేయించి, ప్రజలకు తక్కువ ధరలకు వాటిని అమ్మవచ్చు. ఆ మేరకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల భారాన్ని ప్రజలపై తగ్గించిన వాళ్ళవుతారు. ఆహార భద్రత చట్టం క్రింద దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా నిధుల సహాయం చేస్తుంది. ఈ పద్దు క్రింద బడ్జెట్‌లో తక్షణ అవసరాలకు, రాష్ట్ర ప్రభుత్వ నిధుల కేటాయింపు కనీసం రూ.500కోట్లు ఉంచుకుంటే సరిపోతుంది.

ఆగస్ట్ 15 నుంచి కొత్త రైతు బీమా సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ పథకం విషయంలో ఈసారి ఎల్ఐసీ సంస్థకు బీమా ప్రీమియం చెల్లించే పద్ధతిలో కాకుండా ప్రభుత్వమే పథకాన్ని అమలు చేయడానికి పూనుకోవాలి. ప్రస్తుతం తెలంగాణలో ప్రభుత్వ గణాంకాల ప్రకారమే సగటు జీవిత కాల ప్రమాణం 69.6 సంవత్సరాలుగా ఉంది. అందువల్ల, 18–70 సంవత్సరాల మధ్య వయస్సు గ్రామీణ ప్రజలందరికీ బీమా పథకం వర్తించేలా మార్గదర్శకాలు రూపొందించి అమలు చేయడానికి ఈ బడ్జెట్‌లో కనీసం రూ.5,000కోట్ల నిధులు కేటాయించుకోవాలి.

మండల స్థాయిలో వ్యవసాయ యాంత్రీకరణ కేంద్రాల ఏర్పాటు, మండలానికి ఒక మార్కెట్ యార్డు నిర్మాణం, మూడు లక్షల రూపాయాల వరకూ వడ్డీ లేని ఋణాలు అందించడం లాంటి హామీలకు కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. ఇవన్నీ జరగాలంటే, మానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా, ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ఈ సమావేశాలలో ప్రవేశపెట్టాలి.

■ కన్నెగంటి రవి
రైతు స్వరాజ్య వేదిక


మరిన్ని ట్రిపుల్ ఐటీల సాధనకై ఏకమవుదాం!

మన రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో నిర్వహించబడుతున్న రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) బాసరలో ఉన్నది. ఈ ట్రిపుల్ ఐటీ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. ఈ సమస్యలకి కారకులు గత ప్రభుత్వ పాలకులే అయినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం ఆ సమస్యలని పరిష్కరిస్తూనే ఉమ్మడి పది జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థలను నెలకొల్పాల్సిన అవసరం ఉన్నది.

వ్యవసాయం, పరిశ్రమలు, చేతివృత్తులు ఈ రంగాలకు అనుబంధంగా స్వయం ఉపాధి కేంద్రాలు ఏకకాలంలో అభివృద్ధి అయితే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయి. ఈ కోణంలో సాంకేతిక, శాస్త్ర విద్యారంగాన్ని అభివృద్ధి పరచాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఐటీఐలను ధ్వంసం చేసి, పాలిటెక్నిక్‌లను నిర్లక్ష్యం చేయడం వల్లనే నేడు ట్రిపుల్ ఐటీల అవసరం ఏర్పడుతున్నది. వీటిలో నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక శిక్షణ, వృత్తి శిక్షణ, సుస్థిర వ్యవసాయం వంటి తదితర కార్యక్రమాలలో విద్య అందించబడుతున్నది. పాఠశాల విద్య నుండే శ్రమను, విద్యను పరస్పరం అనుసంధానించాలి. ఇంటర్ అయిన తరువాత బీటెక్ కోర్సులో కూడా ఇదే తరహాలో చేయాలి. కానీ నేటి ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఆ వైపుగా దృష్టి సారించడం లేదు. నైపుణ్యం తగ్గడంతో విద్యార్థులకు వివిధ రంగాలలో ఉపాధి అవకాశాలు కొరవడుతున్నవి. ఉన్న వాటిలో స్కిల్స్ తగ్గిన నెపంతో ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నారు. ఎన్నికల సందర్భంగా స్కిల్స్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక విశ్వ విద్యాలయాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం గొప్ప విషయం. ఈ స్కిల్స్‌ను అందించటం ఇంజనీరింగ్ కాలేజీల బాధ్యత. కనుక ప్రభుత్వం ఎన్నికల హామీకే పరిమితం కాకుండా ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్ తదితరాలతో పాటు ట్రిపుల్ ఐటీల స్థాపన చేయాలి.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరే మెజార్టీ ప్రజలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బలహీన వర్గాలే. ఎన్నికల కోసం ఆయా రాజకీయ పార్టీలు ఏ స్థాయిలో ప్రచారం చేసి ప్రజల ఓట్లు సాధించారో అదే స్థాయిలో ప్రభుత్వ ట్రిపుల్ ఐటీ ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుకు కృషి చేయాలి. ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ కమిటీ తరఫున 'మనందరి మాట – ట్రిపుల్ ఐటీ కాలేజీ బాట' నినాదంతో అందరూ తమ తమ జెండాలు, ఎజెండాలు తాత్కాలికంగా పక్కన పెట్టి ఏకోన్ముఖంగా ఉద్యమించాలి.

– పాపని నాగరాజు
జాతీయ అధ్యక్షులు,
ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యు)





ఆసరా.. అందిస్తారా..!

- 57 ఏళ్ల పైబడిన వారి నిరీక్షణ

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆసరా పింఛన్ అర్హత వయసును గత బీఆర్ఎస్ ప్రభుత్వం తగ్గించిన నేపథ్యంలో 57 ఏళ్లు నిండిన వారు రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ల చుట్టూ నిత్యం వందలాది మంది దరఖాస్తులు పట్టుకుని తిరుగుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో ఆసరా పథకం కింద వివిధ కేటగిరీల్లో 2,72,548 మంది సాయం పొందుతున్నారు. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్ల క్రితం వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారుల ఎంపిక వయసును 65 నుంచి 57 ఏళ్లకు సడలించింది.

తొలి విడతలో 58,607 మంది..

2021లో దరఖాస్తు చేసుకున్న 57 ఏళ్ల వయసు కలిగిన వారి ఆర్థిక జీవనస్థితిపై 2022లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న 89,560 మందిలో 58,607 మంది అర్హులుగా గుర్తించారు. పింఛన్ వయసును సడలించిన నేపథ్యంలో పెద్దఎత్తున దరఖాస్తులు రావడంతో సర్కారు ఖజానాపై ఆర్థిక భారం ఎక్కువైంది. దీంతో మిగతా వారిని ఎంపిక చేయలేదు.

నిర్మలమ్మ పద్దు ఊరట

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం

కేంద్ర పద్దు మధ్యతరగతికి ఊరట కల్పించింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించేలా మంత్రి నిర్మలమ్మ పలు వరాలు ప్రకటించారు. దీనివల్ల పారిశ్రామిక రంగం మరింత వృద్ధి చెందుతుందనే అభిప్రాయం ఆ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఆదాయ పన్ను సడలింపుపై కొండంత ఆశతో చూసిన వేతన జీవికి విత్త మంత్రి ఊరట కల్పించారు. 'ముద్ర' రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడంపై మరింత మందికి స్వయం ఉపాధి లభిస్తుందని యువత సంతోషంగా ఉన్నది. స్వయానా మహిళే విత్తమంత్రి కావడం, బంగారంపై దిగుమతి సుంకాన్ని తగ్గించడం తద్వారా పుత్తడి ధర దిగిరావడంతో మహిళలు సంబరపడుతున్నారు. అయితే, మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణ ప్రస్తావన లేకపోవడం నగరవాసులను నిరాశ కలిగించింది.

-హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి)



- వేతన జీవులకు ఆదాయ పన్ను ప్రయోజనం
- 'ముద్ర' పెంపుతో స్వయం ఉపాధికి ఊతం
- కొన్ని మందుల ధర తగ్గింపుతో రోగులకు సాంత్వన
- అతివలకు కేంద్రమంత్రి తీపికబురు
- రూ.4 వేల వరకు తగ్గిన తులం బంగారం ధర

నీ ఇల్లు 'బంగారం' కాను!



బంగారమంటే తెలుగువాళ్లకు మోజు ఎక్కువ. అధిక ధర ఉన్నా కొనుగోలుకు వెనుకాడడం లేదు. అయితే మండుతున్న పుత్తడి ధరలకు కళ్లెం వేసేలా నిర్మలమ్మ తన పద్దులో దిగుమతి సుంకాన్ని 6 శాతానికి కుదించడంతో మహిళామణుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఫలితంగా మార్కెట్లో తులం బంగారం (24 క్యారెట్లు) ధర రూ.4 వేల వరకు తగ్గింది. దీంతో శ్రావణంలో శుభకార్యాలు, వివాహాలు ఉన్నవారు కోసం బంగారం కొనుగోలు చేసేందుకు దుకాణాలకు పరుగులు తీశారు. మొత్తంగా కిలోకు రూ.4-4.5 లక్షల వరకు ధర తగ్గుతుందని వ్యాపారులు చెబుతున్నారు. వచ్చే రెండునెలలు మంచి ముహూర్తాలు ఉండడంతో బంగారం విక్రయాలు భారీగా పెరుగుతాయని అంటున్నారు.

దీర్ఘకాల రోగులకు ఊరట



అరుదైన వ్యాధుల నియంత్రణకు తీసుకునే ఆహార పదార్థాలు, మందులకు కస్టమ్స్ సుంకం మినహాయింపు ఇవ్వడం వల్ల రోగులపై ఆర్థికభారం గణనీయంగా తగ్గుతుందని క్వాలిటీ కేర్ ఇండియా గ్రూప్ చైర్మన్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరిప్రసాద్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో క్యాన్సర్ మందులను కస్టమ్స్ సుంకం నుంచి మినహాయించడం ఊరటనిస్తుందని చెప్పారు. ఇతర జీవనశైలి వ్యాధులకు సంబంధించిన మందులు, వైద్య వినియోగ వస్తువులకూ మరిన్ని మినహాయింపులు ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. గత ఏడాదితో పోలిస్తే ఆరోగ్య సంరక్షణ కోసం బడ్జెట్ కేటాయింపు పెరుగుదల అంతంత మాత్రమేనన్నారు.

రియల్ రంగానికి మరింత ఊపు



పట్టణ మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర పద్దులో రూ.10 లక్షల కోట్లు కేటాయించడం హర్షణీయం. 'పీఎం ఆవాస్ యోజన' కింద కోటి గృహాల నిర్మాణాలు చేపట్టడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు లబ్ధి కలుగుతుంది. ఫలితంగా రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఊపు వస్తుంది. స్థిరాస్తులపై మూలధన లాభాల పన్నును 20 నుంచి 12.5 శాతానికి తగ్గించడం మంచి మార్పు.

- రాజశేఖర్‌రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు

మెట్రో ఆశలపై నీళ్లు

నగర ప్రజా రవాణాలో అత్యంత కీలకమైన మెట్రో రైళ్ల విస్తరణ గురించి కేంద్ర బడ్జెట్‌లో ఊసే లేదు. ఈ ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయిస్తారని ఎదురుచూసిన నగరవాసులకు నిరాశే ఎదురైంది. రెండో దశ విస్తరణలో భాగంగా ఆరు కారిడార్లను ఎంపిక చేసి 70 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, నిర్మలమ్మ పద్దులో మెట్రో ముచ్చట లేకపోవడం నిరాశకు గురిచేసింది. కనీసం మెట్రో నియో, మెట్రో లైట్ ప్రాజెక్టుల్లో ఏదైనా ఒకదానికి నిధులు విదిలిస్తే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమైంది.



వికసిత్ భారత్‌కు పునాది

కేంద్ర విత్తమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌పై పరిశ్రమల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పద్దు వికసిత్ భారత్‌కు బలమైన పునాది వేయడానికి ప్రయత్నించిందని తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్ అన్నారు. ఎంఎస్ఎంఈ రంగానికి ప్రోత్సాహకాలు బాగున్నాయన్నారు. వేతన జీవులకు ఊరటనిచ్చేలా రూ.17,500 వరకు ఆదాయ పన్ను ప్రయోజనం అందించడం శుభపరిణామమని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవికుమార్ అభిప్రాయపడ్డారు. ముద్ర రుణపరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడంతో స్వయం ఉపాధి పెరుగుతుందన్నారు. ఎంఎస్ఎంఈలలో తయారీ రంగానికి రూ.100 కోట్ల క్రెడిట్ గ్యారంటీ పథకాన్ని ప్రతిపాదించడం ప్రోత్సహించడానికేనని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గరిమెళ్ల అన్నారు. రాష్ట్రాల మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రూ.1.5 లక్షల కోట్లు కేటాయించడం వల్ల రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి నిధులు వస్తాయని జీఎస్టీ కస్టమ్స్ కమిటీ చైర్మన్ ఇర్షాద్ అహ్మద్ తెలిపారు.



బడ్జెట్ సందర్భంగా జరిగిన చర్చలో ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు

స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి

- రాచకొండ పోలీసుల వినూత్న ప్రయోగం
- ప్రత్యేక క్యూఆర్ కోడ్ అందుబాటులోకి

8

రూ.4.49 కోట్లు కొల్లగొట్టాడు..

- ఫార్మాలో ఇన్వెస్ట్ చేస్తే 10% లాభాలంటూ బురిడీ
- 35 మందిని మోసగించిన కేటుగాడు అరెస్ట్

షో మెరిసెన్



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తగిన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా మంగళవారం రాత్రి మాదాపూర్ హెచ్ఐసీసీలో నిర్వహించిన ఫ్యాషన్ షో అదిరింది. ఎలనార్ సంస్థ, శ్రావణ్‌కుమార్ డిజైన్ చేసిన వస్త్రాలతో మోడళ్లు, పలువురు నటులు ర్యాంప్ వాక్ చేశారు. సంయుక్త మీనన్, ఫరియా అబ్దుల్లా, మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా, సిమ్రాన్ చౌదరి, యుక్తి తనేజా, సాన్వీ మేఘన అందాలు ఆరబోశారు.

-హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి)

గోరటికి దాశరథి ప్రజాసాహిత్య పురస్కారం

8

అందెశ్రీకి దాశరథి సాహితీ పురస్కారం

భట్టి మూటపై 'మహా' ఆశలు

- అప్పుల ఊబి నుంచి కాపాడాలంటున్న బల్దియా

- రూ.5650 కోట్లతో వాటర్‌బోర్డు ప్రతిపాదన
- మెట్రో విస్తరణ నిధులకై ఎదురుచూపులు
- కొత్త బస్సులు, రాచకొండ కమిషనరేట్ భవన నిర్మాణానికి ప్రతిపాదన

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ అభివృద్ధికి నిధులు విదల్చకుండా కేంద్రం మొండి చెయ్యి చూపడంతో ఇక ఆశలన్నీ రేపటి రాష్ట్ర బడ్జెట్‌పైనే ఉన్నాయి. వివిధ విభాగాలు ఇప్పటికే సర్కారుకు ప్రతిపాదనలు పంపించాయి. తాహతుకు మించి అప్పులు చేసిన జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డులు వాయిదాల చెల్లింపునకూ సతమతమవుతున్నాయి. రుణాల చెల్లింపు, అభివృద్ధి పనుల కొనసాగింపునకు నిధులివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. రూ.5400 కోట్లు ఇవ్వాలని జీహెచ్ఎంసీ కోరింది. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఆర్‌డీపీలో భాగంగా వంతెనలు, అండర్‌పాస్‌లు.. ఎస్ఎన్‌డీపీలో భాగంగా నాలాల విస్తరణ, వరద నీటి కాల్వల నిర్మాణం, సీఆర్ఎంపీ కోసం మునిసిపల్ బాండ్లను జారీ చేసి బ్యాంకుల నుంచి రూ.6500 కోట్ల రుణం తీసుకున్నారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆదుకోవాలని బల్దియా ప్రభుత్వాన్ని కోరుతోంది.

మూసీ మురిపెం

రానున్న ఐదేళ్లలో మూసీ అభివృద్ధికి లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని సీఎం ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయిస్తారోనన్న ఆసక్తి నెలకొన్నది. నది వెంట వివిధ ప్రాంతాల్లో వంతెనల నిర్మాణం, ఇరువైపులా రోడ్ల అభివృద్ధి తదితర వాటికి పెద్దపీట వేసే అవకాశాలు ఉన్నాయి. గ్రేటర్‌తోపాటు ఔటర్ పరిధిలో 39 కొత్త ఎస్టీపీల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయగా కేంద్రం అమృత్ 2.0లో భాగంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దాదాపు రూ.645 కోట్లు కేంద్రం నుంచి రానుండగా, మిగతా వాటిని రాష్ట్రమే భరించనుంది.

తాగునీటి సరఫరా కోసం

మహా నగరంతోపాటు ఔటర్ పరిధిలోని ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయడానికి, మురుగు నీటి నిర్వహణ చేపట్టేందుకు రూ.5650 కోట్లు కావాలని వాటర్‌బోర్డు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇందులో గోదావరి, కృష్ణా ఫేజ్‌ల కోసం చేసిన రుణాలు, హడ్కో, వార్షిక వడ్డీల కోసం రూ.1100 కోట్లు, గ్రేటర్‌లో నిర్మాణం అవుతున్న 31 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల కోసం, జోన్ -3 సీవరేజ్ పనుల కోసం రూ.2250 కోట్లు, సుంకిశాల ప్రాజెక్టు కోసం రూ.1300 కోట్లతోపాటు నెలకు 20వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకానికి నిధులు కోరుతోంది.



(ఫైల్)

హెచ్ఎండీఏ ప్రతిపాదన రూ.1600 కోట్లు

రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1600 కోట్ల వరకు కేటాయించాలని హెచ్ఎండీఏ ప్రతిపాదనలు చేసినట్లు తెలిసింది. హెచ్ఎండీఏ ఆదాయ వనరులను మెరుగుపర్చుకున్న నేపథ్యంలో కొన్నాళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా నిధులు కేటాయిస్తోంది. ఫలితంగా రుణాల చెల్లింపులు భారంగా మారుతున్నాయి. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో భారీ ప్రాజెక్టులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో కేటాయింపులపై భారీ ఆశలు నెలకొన్నాయి.

మెట్రో పరుగులకు మరిన్ని నిధులు

మెట్రో రెండో దశ విస్తరణ పనులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తుండడంతో నిధుల కేటాయింపులు భారీగా ఉంటాయన్న అంచనా వ్యక్తమవుతోంది. ఈ

మిగతా 8వ పేజీలో..



స్టాండింగ్ కమిటీ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవమే..?

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఖాళీ అయిన స్టాండింగ్ కమిటీ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ రషీద్ ఫరాజుద్దీన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఎన్నిక నిర్వహించే అవకాశం లేదని కార్యదర్శి కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, ఎంఐఎం ఎర్రగడ్డ కార్పొరేటర్ షాహీన్ బేగం ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో ఖాళీ అయిన స్థానం కోసం ఎన్నిక నిర్వహణకు జీహెచ్ఎంసీ నామినేషన్లను ఆహ్వానించింది. ఏకగ్రీవ ఎన్నికను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.















ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చిన్నారెడ్డి, దివ్య

ప్రజావాణికి 606 దరఖాస్తులు

బేగంపేట, జులై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వస్తున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 108, పౌరసరఫరాల శాఖకు 106, విద్యుత్ శాఖకు 64, హౌసింగ్‌కు 115, మైనార్టీ సంక్షేమ శాఖకు 38, ఇతర శాఖలకు సంబంధించి 175, మొత్తం 606 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

1, 2 తేదీల్లో గ్రూప్-2 అభ్యర్థులకు మాక్ టెస్టు

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2 తేదీల్లో మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్-2 ఫుల్ లెన్త్ మాక్‌టెస్టు నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఇలియాజ్ అహ్మద్ తెలిపారు. నగరంలోని మైనార్టీ స్టడీ సర్కిల్‌లో చదువుతున్న అభ్యర్థులకు ఆఫ్‌లైన్‌లో, బయటి ప్రదేశంలో చదువుతున్న వారికి ఆన్‌లైన్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేపర్-1 ఆగస్టు 1న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఉంటుందన్నారు. పేపర్-3 ఆగస్టు 2న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, పేపర్-4 మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఉంటుందని తెలిపారు. మాక్‌టెస్టులు రాసే ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 30లోగా తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.


మహిళను బెదిరించి రూ. 2.90లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఓ మహిళను బెదిరించిన సైబర్ క్రిమినల్స్ రూ. 2.90 లక్షలు కొల్లగొట్టారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మహిళకు ఉద్యోగ అవకాశాల గురించి ఇన్‌స్టాలో ఒక మెసేజ్ లింక్ వచ్చింది. ఆ లింక్‌ను ఓపెన్ చేయగానే ఓటీపీ వచ్చింది. ఆ వెంటనే గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి 'ఓటీపీ చెప్పండి, మీకు ఉద్యోగాల సమాచారం మొత్తం ఓపెన్ అవుతుంది' అని చెప్పారు. నమ్మిన మహిళ ఓటీపీ చెప్పడంతో సైబర్ క్రిమినల్స్ ఆమె ఫోన్‌ను హ్యాక్ చేశారు. కొద్ది రోజుల తర్వాత మోసగాళ్లు మార్ఫింగ్ చేసిన ఆమె నగ్న చిత్రాలను పంపించారు. అడిగినన్ని డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలు సోషల్ మీడియాలో పెడతామని, స్నేహితులు, బంధువులకు షేర్ చేస్తామని బెదిరించారు. దాంతో కొంత డబ్బును బాధితురాలు వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేసింది.

లక్నో పోలీసులమంటూ..


కొద్దిరోజుల తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి లక్నో పోలీసులమంటూ పరిచయం చేసుకున్నారు. 'మీరు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.. మీ ఖాతా నుంచి అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగాయని, మీపై అరెస్టు వారెంట్ జారీ అయింది'అని భయపెట్టారు. పై అధికారులతో మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని హెచ్చరించారు. భయభ్రాంతులకు గురైన మహిళ వారు చెప్పిన ఖాతాలకు రూ. 2.90 లక్షలు బదిలీ చేశారు. ఆ తర్వాత ఇదంతా సీక్రెట్‌గా ఉంచాలని, లేదంటే ఇబ్బందులు ఎదుర్కోవలిసి ఉంటుందని నమ్మించి ఆమె ఫోన్‌లోని వాట్సాప్ మెసేజ్‌లన్నీ డిలీట్ చేయించారు. వారి ప్రవర్తన, మాట్లాడిన తీరు అనుమానాస్పదంగా ఉండడంతో బాధిత మహిళ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయం తెలిపింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.





పుట్టిన ఆస్పత్రిలోనే ఉన్నతాధికారిగా..

నిలోఫర్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవికుమార్



హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తాను పుట్టిన ఆస్పత్రిలోనే ఉన్నతాధికారిగా సేవలందించే అదృష్టం దక్కించుకున్నాడు ఓ డాక్టర్. నిలోఫర్ ఆస్పత్రిలో జన్మించిన డాక్టర్ రవికుమార్ ఇప్పుడు అదే ఆస్పత్రికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి బదిలీ కావడంతో డాక్టర్ రవికుమార్‌ను నియమించారు. ఆస్పత్రిలో జన్మించడంతో పాటు ఇక్కడే ఉన్నత వైద్య విద్యను అభ్యసించి పలు పదవులు అందుకుని ఈ స్థాయికి చేరుకున్నారు. ఆయన 1961లో నిలోఫర్ ఆస్పత్రిలో జన్మించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ పరిధిలోని ఈ ఆస్పత్రిలోనే పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్య విద్యను పూర్తి చేశారు. పిల్లల వైద్యుడుగా, ప్రొఫెసర్‌గా అక్కడే సేవందించారు. 2018-20 వరకు పిల్లల విభాగాధిపతిగా సేవలు అందించారు. అలాగే హెచ్‌ఐవీ ప్రోగామ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నిలోఫర్ ఆస్పత్రిలో టీచింగ్ (బోధన), ట్రీటింగ్ (చికిత్స)ను మరింత బలోపేతం చేయడం తన ప్రధాన ఏజెండాగా ఆయన చెప్పారు.

ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జయలక్ష్మి



డాక్టర్ జయలక్ష్మిని పూల బొకేతో సత్కరిస్తున్న ఎంప్లాయీస్

బర్కత్‌పుర జూలై 23 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జయలక్ష్మి నియమితులయ్యారు. ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ శంకర్ బదిలీ కావడంతో ఆ స్థానంలో ఇదే ఆస్పత్రిలో ఆర్ఎంఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జయలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. మంగళవారం ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, ఫీవర్ హాస్పిటల్ యూనిట్ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ ఉపాధ్యక్షురాలు పద్మజ తదితరులు డాక్టర్ జయలక్ష్మి ని పూలబొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ ఫీవర్ ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారుడు ప్రఫుల్ రాంరెడ్డి

తెలంగాణ సమరయోధుల కమిటీని ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమకారుడు ప్రఫుల్ రాంరెడ్డి

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమరయోధుల ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు ప్రఫుల్ రాంరెడ్డి, సుల్తాన్ యాదగిరి, రంగారెడ్డి, కేసీఎస్ ప్రసాద్, ఎం. వెంకటస్వామి, వెంకటనారాయణ డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాల భర్తీలో ఉద్యమకారుల కుటుంబాలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రతి ఉద్యమకారుడికి నెలకు 30 వేల గౌరవ వేతనం, ఉచిత బస్‌పాస్, 20 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు.



నిజాం కళాశాలలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డ్రగ్స్‌ను పూర్తిగా నిషేధించాలి

- ఓయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఓయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ బి. రెడ్యానాయక్ పిలుపునిచ్చారు. సమాజహితం కోసం డ్రగ్స్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. మంగళవారం నిజాం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల జీవితాలే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశం ప్రమాదంలో పడుతుందన్నారు. డ్రగ్స్‌ను నిర్మూలించడంలో విద్యార్థులు సైనికులుగా పనిచేయాలని సూచించారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. భీమా మాట్లాడుతూ డ్రగ్స్‌ను అరికట్టడంల నిజాం కళాశాల ముందు వరుసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ, నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. ఉపేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మంజుల, సుదర్శన్, ఈవోసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ దీకొండ తిరుపతి, డాక్టర్ కవిత, స్వాతి, స్రవంతి, నవీన్‌రెడ్డి, కుమార్ డాక్టర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మణ్, రాజేందర్‌నాథ్ తదితరులు

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

రవీంద్రభారతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (టీజేఏ) 10వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. టీజేఏ ఫౌండర్ ఉప్పల లక్ష్మణ్ సారథ్యంలో టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాశ్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు సంఘటితంగా ఉంటే సమస్యలు పరిష్కరించబడతాయని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను బీజేపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. ఎన్‌యూజే(ఐ) కార్యదర్శి రాజేందర్‌నాథ్ మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమం కోసం టీజేఏ కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో దన్నారపు రాజాలింగం, వాసుదేవరావు, బకార్ మిర్జా, సరిత, అబ్దుల్ సత్తార్, సంపత్, ఖాసీం, ఖలీల్, అహ్మద్, గౌరీ, రాజు, నసీర్ ఖాద్రి, ఆరిఫ్, కుమారస్వామి, యాదయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పెట్టీ కేసులో ఇద్దరికి 10 రోజుల జైలు

మంగళ్‌హట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఈ-పెట్టీ కేసులో ఇద్దరు నిందితులకు నాంపల్లిలోని స్పెషల్ ఎంఎం కోర్టు ఇన్‌చార్జి జడ్జి-2 వి.స్వామి 10 రోజుల జైలు శిక్ష విధించారు. మంగళ్‌హట్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హట్ ఆర్కె పేట్ జహీర్ (23), రాజేంద్రనగర్ హసన్‌నగర్ శివరాంపల్లికి చెందిన సయ్యద్ సోహెల్ (19)లను ఇటీవల మంగళ్‌హట్ పోలీసులు ఈ-పెట్టీ కేసులో వీరిద్దరిని అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరుపరచగా పూర్వపరాలను పరిశీలించిన ఇన్‌చార్జి జడ్జి-2 స్వామి నిందితులిద్దరికి 10 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం





భాగ్యలక్ష్మి అమ్మవారికి ఆరో బంగారు బోనం తీసుకెళ్తున్న ఆలయ నిర్వాహకులు
వెండి బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

చార్మినార్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ మహాకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం చారిత్రాత్మకమైన చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు పాత్రలో నైవేద్యంతో పాటు పట్టు వస్త్రాలు, వడిబియ్యం సమర్పించారు. మీరాల మండిలోని మహాకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాజా భజంత్రీల నడుమ చార్మినార్ వరకు ఊరేగింపు కొనసాగింది. మార్గమధ్యంలో కోట్ల లీజాలోని కోట మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి ఊరేగింపు చార్మినార్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ పటేల్ సదానంద్ యాదవ్, కమిటీ ప్రస్తుత ఉపాధ్యకుడు మధు సూదన్ యాదవ్, కాట రమేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా ఆధ్వర్యంలో

బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మేకలబండ నల్లపోచమ్మ దేవాలయంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి అమ్మవారికి వెండి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు గీతారెడ్డి, డాక్టర్ సమత, దశరథ లక్ష్మి, నిత్య పారికర్, లావణ్య, స్వప్న, ఆలయ కమిటీ ప్రతినిధులు పొన్న వెంకటరమణ, సి.వెంకటేశ్, గోల్కొండ నవీన్, మాణిక్‌ప్రభు, అభిషేక్ యాద వ్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

జాంబాగ్ బాలానంద సంఘం షష్ట్యాబ్ది ఉత్సవాలు



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

రవీంద్రభారతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బాల బాలికల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహిస్తున్న బాలానంద సంఘం ఆరు దశబ్దాలు పూర్తిచేసుకోవడం అభినందనీయమని వక్తలు అన్నారు. మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు రవీంద్రభారతి వేదికగా షష్ట్యాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెమీ క్లాసికల్ డాన్స్, ఏకపాత్రాభినయం, నాటకం అంశాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన బాలలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి అతిథులుగా నటుడు గౌతం రాజు, మద్దాళి రఘురామ్, చొక్కాపు వెంకటరమణలు హాజరై కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న లలిత కళల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి అవకాశాన్ని కల్పిస్తున్న జాంబాగ్ బాలానంద సంఘం 60వ వార్షికోత్సవ వేడుకలను జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈతరం పిల్లలకు శాస్త్రీయ, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జాంబాగ్ బాలానంద సంఘం ఆరు దశాబ్దాలుగా వేలాది పిల్లల సృజనాతకు వెలికి తీయడం గొప్ప విషయమని అన్నారు. విద్యార్థి దశలోనే బాలబాలికలకు కళల పట్ల మక్కువ పెరగాల్సిన అవసరముందని అన్నారు. కళల్ని, కళాకారుల్ని ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మద్దిపట్ల వెంకట భాస్కర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న టీఎన్‌జీవో నేతలు, ట్రస్ట్ ప్రతినిధులు

కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో అన్నదానం

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మెహదీ నవాబ్ జంగ్ కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో రోగుల కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పాల్గొని మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్)కి ప్రతినెలా పేదలకు అన్నదానం చేసే అవకాశం ఆ దేవుడిచ్చిన వరమని అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ నేతలు కస్తూరి వెంకట్, రామారావు, ఎస్.విక్రమ్ కుమార్, కేఆర్ రాజ్ కుమార్, హరిబాబు, వైదీక్ శాస్త్రి, శ్రీధర్ నాయుడు, ఏపీఆర్‌ఓ మొహమ్మద్ వహీద్, ఆస్పత్రి సిబ్బంది శివకుమార్, శేఖర్, పబ్లిక్ గార్డెన్స్ అధ్యక్షుడు ముహమ్మద్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.



నార్సింగ్ జిల్లా పరిషత్ పాఠశాలలో సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలి

నార్సింగ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు సంఖ్య పెంచాలని పీఆర్‌పీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ డిమాండ్ చేశారు. గండిపేట మండలంలోని మణికొండ, బండ్లగూడ, నార్సింగ్, హైదర్షాకోట్ పాఠశాలల్లో సంఘం సభ్యుత్వ కార్యక్రమాలు నిర్వహించి నార్సింగ్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని, మార్పులు, చేర్పులు చేయడంతో పాటు బదిలీయైన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్‌లను నెరవేర్చాలని ఆయ న కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్, సంఘం నాయకులు నర్సింహులు, శివరాం, మధుకర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

షేర్‌లు పెరుగుతాయని నమ్మించి..

రూ. 3.50 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో షేర్లు పెరుగుతాయని నమ్మించి, బిట్‌కాయిన్స్‌లో పెట్టుబడులు పెట్టించిన సైబర్ నేరగాళ్లు నగర వ్యాపారి నుంచి రూ. 3.50 లక్షలు కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన వ్యాపారికి బిట్‌కాయిన్ ప్రాఫిట్ వెబ్‌సైట్ యాక్సిస్ నోవా లిమిటెడ్ గురించి తెలిసింది. దానిలో పెట్టుబడులు, లాభాల గురించి తెలుసుకునే క్రమంలో కంపెనీకి చెందిన కొందరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో సంప్రదించారు. రాబోయే వారం రోజుల్లో షేర్ల విలువ విపరీతంగా పెరగబోతున్నాయని క్వాంటం-క్యాపిటల్‌లో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు ఉంటాయని నమ్మించారు. దాంతో బాధితుడు కొంత మొత్తంలో పెట్టుబడులు పెట్టాడు. లాభాలు వచ్చినట్లు వర్చువల్‌గా చూపించిన కేటుగాళ్లు.. వాటిని విత్‌డ్రా చేసుకోవడానికి కండిషన్స్ పెట్టారు. విత్‌డ్రా ప్రాసెస్ చేయడానికి వివిధ రకాల చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని రకరకాల ప్రాసెసింగ్ ఫీజుల రూపంలో రూ.3.50 లక్షలు వసూల్ చేశారు. అయినా విత్‌డ్రా ప్రాసెస్ చేయకుండా మరిన్ని డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో డ్రైవర్‌కు

20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ డ్రైవర్‌కు న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. కాచిగూడ సీఐ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్ఐ కె.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. రత్నానగర్‌లో నివసిస్తున్న ప్రవీణ్(28) డ్రైవర్. 2017లో ఓ బాలికపై అత్యాచారం చేశాడు. నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి పి. పుష్పలత మంగళవారం కేసును విచారించారు. నిందితుడు ప్రవీణ్‌కు 20 ఏళ్ల కఠినకారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా, జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని, బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారని సీఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కార్వాన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గుడిమల్కాపూర్ దేవాలి జామ్‌సింగ్ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. పట్టణ పోషణ పథకం బృందం, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ పోషణ పథకం ప్రాజెక్టు మేనేజర్ భవాని, ఏపీఎమ్ఏఎస్ సీఈవో సి.ఎస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహార సలహాలు ఇవ్వడంతో వారి ఆహారపు అలవాట్లు మెరుగుపడతాయని ఆయన సూచించారు. విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలు చేశారు.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్ట్

- 15 తులాల బంగారు మంగళసూత్రాలు స్వాధీనం



చైన్ స్నాచింగ్ బాధిత మహిళలకు మంగళసూత్రాలను చూపెడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

రాజేంద్రనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను రాజేంద్రనగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.11.10 లక్షల విలువ చేసే 15 తులాల బంగారు మంగళసూత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ కేసు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట్ మండలం, పుల్లగిరి గ్రామం, తుప్రా తాండకు చెందిన ముదావత్ పాండు(36), అదే గ్రామానికి చెందిన ముదావత్ సేవియ(23) పాత నేరస్తులు. పాండుపై చైన్ స్నాచింగ్‌లతో పాటు దొంగతనాలకు సంబంధించి 21 కేసులు, సేవియపై చైన్ స్నాచింగ్‌తో పాటు దొంగతనాలకు సంబంధించి 18 కేసులు ఉన్నాయి. ఈ కేసులలో వీరిపై పీడీ యాక్ట్ పెట్టారు. సంవత్సరం పాటు జైల్ శిక్ష అనుభవించి బయటకు వచ్చాక మళ్లీ చైన్ స్నాచింగ్‌లు మొదలు పెట్టారు.

రాజేంద్రనగర్‌లో...

కిస్మత్‌పూర్ సాయిబాబా కాలనీకి చెందిన నర్స్‌గా పనిచేసే మమత ఈ నెల 16న సాయంత్రం బుద్వేల్ బన్సీలాల్‌నగర్ బస్టాప్‌లో బస్ కోసం వేచి ఉండగా ఇద్దరు యువకులు ఆమె మెడలోని మూడు తులాల బంగారు మంగళసూత్రాన్ని తెంచుకుని పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీలో లభ్యమైన ఆధారాలతో షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు పాత నేరస్తులనే చైన్ స్నాచర్లుగా పోలీసులు గుర్తించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బాధిత మహిళలకు ఒకటి రెండు రోజుల్లో అప్పగింత

బుద్వేల్ బన్సీలాల్‌నగర్ చౌరస్తా బస్టాప్‌లో మంగళసూత్రాలు పోగొట్టుకున్న మహిళలను రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయానికి పిలిపించి పట్టుబడిన బంగారు మంగళసూత్రాలను చూపించారు. ఒకటి రెండు రోజుల్లో బాధిత మహిళలకు బంగారు మంగళసూత్రాలను ఇప్పిస్తానని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

విలేకరు సమావేశంలో క్రైమ్ డీసీపీ నర్సింహ, రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో, క్రైం ఇన్‌స్పెక్టర్ సంజయ్, రాజేంద్రనగర్ డీఐ గంగాధర్ ఉన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలి

హిమాయత్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నూతన క్రిమినల్ చట్టాల అమలులో గందరగోళ పరిస్థితి నెలకొందని, క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన లేకుండా ఇష్టా రీతిలో కేంద్రం చట్టాలను మార్చిందని టీపీసీసీ లీగల్‌సెల్ కన్వీనర్ ఖాజా అహ్మద్ అన్నారు. హిమాయత్‌నగర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలకమైన చట్టాలను మార్పుచేసే క్రమంలో సామాజిక పరిస్థితులు, క్షేత్రస్థాయిలో సమస్యలు, నిజమైన న్యాయం జరిగేవిధంగా మరింత ప్రయోజనకరంగా ఉండాలని, అవేమీ లేకుండా తామేదో చేసామనే గొప్పకోసం చట్టాలను మార్చకూడదని అన్నారు. కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజలకు కానీ, చట్టాలను అమలుచేసేవారికి కాని అవగాహన లేదని, ఈ నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి తెచ్చిన చట్టాలపై ఇప్పటివరకు ఎక్కడా ఎవరికి స్పష్టత లేకుండా పోయిందని అన్నారు.

తాము చాలా చోట్ల ప్రత్యేకంగా కొత్త చట్టాల అమలుపై పరిశీలన చేసామని, అన్ని చోట్ల ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. విస్తృతంగా అవగాహన కల్పించిన తర్వాతనే అమలుచేయడం మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7ej36hn లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మహాకాళి బోనాల బ్రోచర్ ఆవిష్కరణ

చాంద్రాయణగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గౌలిపురా మహాకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను మంగళవారం రాత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 28న ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మని కైలాష్ గంగపుత్ర, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ఎస్.ఆనంద్‌రావు, ఉపాధ్యక్షులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బీవై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్న మాదన్న ఆలయంలో పూజలు

చాంద్రాయణగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని హరిబౌలి అక్కన్న మాదన్న మహాకాళి దేవాలయంలో 76వ బోనాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో రుద్ర త్రిశతి హోమం, బిల్వార్చన పూజలను ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌పీ క్రాంతికుమార్, ఎస్.శైలజ దంపతులు నిర్వహించారు. పూజారులు కె.రవినారాయణమూర్తి, గోపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కనకదుర్గా అమ్మవారి ఆలయంలో...

అఫ్జల్‌గంజ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉస్మాన్‌గంజ్‌లోని కనకదుర్గా అమ్మవారి దేవాలయంలో చైర్మన్ గల్లా వినయ్ కిశోర్ ఆధ్వర్యంలో మంగళవారం బోనాలు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు సంజయ్ ఘనాటే, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆర్.వి.మహేందర్ కుమార్, కార్పొరేటర్లు రాకేశ్ జైస్వాల్, సురేఖ ఓంప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాలరాసే విధంగా బడ్జెట్

మంగళ్‌హట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాలరాసే విధంగా ఉండటం దురదృష్టకరమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలను కేంద్రానికి ఇచ్చినప్పటికీ.. ఈ బడ్జెట్‌లో తెలంగాణ ప్రజలకు ఏ ఒక్క విషయంలో లాభ పడే విధంగా బడ్జెట్ రూపొందించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న మంత్రులు ఈ బడ్జెట్ విషయంలో సిగ్గుతో తలదించుకోవాలని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తెలంగాణకు చెందిన ఎంపీలు తమ నాయకుడైన మోదీతో పోరాటం చేసి తెలంగాణకు రావాల్సిన నిధులను కేటాయించే వరకు బయటికి వచ్చి పోరాటం చేయాలని ఆయన హితవు పలికారు.



ఆంధ్రజ్యోతి జట్టు సభ్యులు

జేపీఎల్ సెమీస్‌లో 'ఆంధ్రజ్యోతి'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కేఎస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ (జేపీఎల్)లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం విజయానంద్ గ్రౌండ్‌లో జరిగిన క్వార్టర్స్ పోరులో జీ కింగ్స్ జట్టుపై ఆంధ్రజ్యోతి జట్టు 42 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వర్ష ప్రభావిత మ్యాచ్‌లో టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్రజ్యోతి జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. ఓపెనర్ దిలీప్ (48 పరుగులు), వన్‌డౌన్ బ్యాటర్ అబ్దుల్ షుకూర్ (29), మిడిలార్డర్ బ్యాటర్ రవి (31) రాణించడంతో ఆంధ్రజ్యోతి భారీ స్కోరు చేయగలిగింది. 29 పరుగులతో పాటు రెండు కీలక వికెట్లు తీసిన ఆంధ్రజ్యోతి ఆల్‌రౌండర్ అబ్దుల్ షుకూర్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

గాంధీ సూపరింటెండెంట్‌గా రాజకుమారి



రాజకుమారి

అడ్డగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ప్రొఫెసర్ రాజకుమారి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ప్రొఫెసర్ రాజారావు యాదాద్రికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన వైద్యులు బదిలీపై వెళ్లడంతో వీరి స్థానంలో కొత్త వైద్యులు వచ్చేంత వరకు కూడా రోగులకు ఇబ్బందులు కలగకుండా, జరగాల్సిన శస్త్రచికిత్సలు ఆగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. ఒకవైపు రోగులకు మెరుగైన వైద్యం మరోవైపు మెడికల్ ఎడ్యుకేషన్‌కు టాప్ ప్రయారిటీ ఇస్తామన్నారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన రాజకుమారికి ఉద్యోగులు, వైద్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు.

గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఇందిర



ఇందిర

అడ్డగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఇందిర మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి భువనగిరి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో డాక్టర్ ఇందిర నిజామాబాద్ మెడికల్ కళాశాల నుంచి గాంధీ మెడికల్ కళాశాలకు వచ్చారు. కాలేజీలో చదువుతున్న వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి పెడతానని ఆమె తెలిపారు.

స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి

- రాచకొండ పోలీసుల వినూత్న ప్రయోగం
- ప్రత్యేక క్యూఆర్ కోడ్ అందుబాటులోకి



క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రజలకు మరింత చేరువయ్యేలా రాచకొండ పోలీసులు మరో అడుగు ముందుకేశారు. ప్రజలతో మమేకమై పాలనలో వారిని భాగస్వాములను చేయాలని సీపీ సంకల్పించారు. అందులో భాగంగా ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు మంగళవారం నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీ సుధీర్‌బాబు క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్ సిబ్బంది ప్రజలకు చేరువకావాలని, రాచకొండ పోలీస్ సోషల్ మీడియా ఖాతాలైన ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విటర్), ఇన్‌స్టాలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. పోలీస్ స్టేషన్లలోని రిసెప్షన్లలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సోషల్‌మీడియాను ఫాలో కావచ్చన్నారు. యూట్యూబ్ చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చన్నారు. నేరాలు, సైబర్‌నేరాలు, డ్రగ్స్ మహమ్మారి, వర్షాలు, వరదలు, విపత్తుల నిర్వహణ వంటి ఎన్నో అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, విశ్వసనీయ సమాచారం ఏదైనా పోలీస్ ఉన్నతాధికారులు దృష్టికి తేవాలనుకునే వారు రాచకొండ పోలీస్ వాట్సాప్ కంట్రోల్‌రూమ్ నంబర్ 8712662111 కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో డీసీపీలు రాజేష్ చంద్ర, ప్రవీణ్‌కుమార్, సునీతారెడ్డి, ఉషా విశ్వనాథ్, అరవింద్‌బాబు, కరుణాకర్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్, గట్టుమల్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న 210 సెల్‌ఫోన్లు

బాధితులకు అప్పగింత



సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న రైల్వే ఎస్పీ చందనదీప్తి, డీఎస్పీ జావెద్, సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికులు పోగొట్టుకున్న 210 సెల్‌ఫోన్లను తిరిగి వారికి అందజేశామని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందనదీప్తి తెలిపారు. మంగళవారం లాలాగూడలోని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్‌తో కలిసి ఆమె వివరాలు తెలిపారు. తెలంగాణలో రైళ్లలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకుని జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేయంతోపాటు కొందరు సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఫోన్లను కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఏపీ, మహారాష్ట్ర, కర్నాటక, బిహార్, మధ్యప్రదేశ్‌లతో పాటు ఇతర రాష్ట్రాల దొంగలు తస్కరించారని తెలిపారు. ఆయా రాష్ట్రాల నుంచి జీఆర్‌పీ పోలీసులు రికవరీ చేసిన ఫోన్లను పోగొట్టుకున్న 210మంది బాధితులకు (ప్రయాణికులు) వాటిని అప్పగించారు. ఈ ఫోన్ల విలువ సుమారు రూ.21 లక్షలు ఉంటుందని తెలిపారు. మీడియా సమావేశంలో కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, సికింద్రాబాద్ రైల్వే సీఐ సాయిఈశ్వర్‌గౌడ్, ఖాజీపేట్ డీఎస్పీ కృపాకర్ ఉన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

● 50 కేసుల్లో నిందితుడు

హయత్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల తాళాలు పగులగొట్టి 15 సంవత్సరాలుగా చోరీలకు పాల్పడుతూ 50కి పైగా దొంగతనాలు చేసిన నిందితుడిని హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 23 తులాల బంగారు ఆభరణాలు, రూ. 2లక్షల నగదు, కెమెరా, 12 సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ ప్రవీణ్‌కుమార్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా కజులూరు గ్రామానికి చెందిన షేక్ అజీజ్ (38), అదేజిల్లా అమలాపురం మండలం కొంకపల్లి గ్రామానికి చెందిన లోవరాజు (30) ఆటో డ్రైవర్లు. కొంతకాలంగా ఇద్దరు కలిసి తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత నెల 27వ తేదీన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రియదర్శిని కాలనీలోని పసుపులేటి స్వాతి ఇంటి తాళాలు పగులగొట్టి 30 తులాల బంగారు నగలు, 15 తులాల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. మరో ఇంట్లో తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. మంగళవారం ఔటర్‌రింగురోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అజీజ్ పట్టుబడ్డాడు. లోవరాజు పారిపోయాడు. పోలీసులు అజీజ్‌ను విచారించగా హయత్‌నగర్ పరిధిలో మూడు దొంగతనాలు, కొయ్యలగూడెంలో ఒకటి, నిజామాబాద్ రూరల్‌లో ఒకటి, పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 7 దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. 2008 నుంచి 2024 వరకు తెలుగు రాష్ట్రాలలో 50కి పైగా దొంగతనాలు చేసినట్లు తెలిపారు.

అర్బన్ కాలేజీకి 120.. రూరల్ కాలేజీకి 60

● సీట్ల పెంపునకు నేడో, రేపో ఉత్తర్వులు ● 26 నుంచి ఎప్‌సెట్ సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మరో 10వేల వరకు సీట్లు పెరిగే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 20వేలకు పైగా సీట్ల పెంపునకు అఖిలభారత సాంకేతిక విద్యామండలి అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. మంగళవారం ఓయూ, కేయూ, జేఎన్‌టీయూ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో సాంకేతిక విద్య, ఉన్నత విద్యా మండలి అధికారులు సీట్ల పెంపు అంశాన్ని ఓ కొలిక్కి తెచ్చారు. ఈ నెల 26నుంచి ఎప్‌సెట్ రెండోదశ కౌన్సెలింగ్ ప్రారంభం కానుండడంతో బుధవారం సీట్ల పెంపునకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

80 కళాశాలల్లో సీట్లు పెరిగే అవకాశం

యూనివర్సిటీల అధికారులతో జరిగిన చర్చల్లో భాగంగా అర్బన్ ప్రాంతాల్లోని కాలేజీలకు 120సీట్ల చొప్పున, గ్రామీణ ప్రాంతాలకు చెందిన కాలేజీలకు 60సీట్ల చొప్పున పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న కాలేజీలను అర్బన్‌గా, వెలుపల ఉన్న కాలేజీలను రూరల్ ప్రాంత కాలేజీలుగా పరిగణించారు. ఇంతకు మునుపు 24 కళాశాలల్లో సీట్లు పెరగగా, తాజాగా మరో 70నుంచి 80కి పైగా కళాశాలల్లో సీట్లు పెరిగే అవకాశం ఉంది.

ఎప్‌సెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు ఈనెల 26వ తేదీ నుంచి రెండోదశ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. 26న రిజిస్ట్రేషన్/స్లాట్ బుకింగ్ ఉండగా, 27 నుంచి ధ్రువపత్రాల పరిశీలన, 28వరకు వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ఉండనుంది. ఆప్షన్లు పెట్టుకున్న అభ్యర్థులకు 31న సీట్ల కేటాయింపు ఉంటుందని అధికారులు తెలిపారు. ఆగస్టు 2వ తేదీలోగా ఫీజు చెల్లించిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో జాయినింగ్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కన్హా శాంతివనానికి మాజీ రాష్ట్రపతి

గురూజీ జయంతి వారోత్సవాల్లో రామ్‌నాథ్ కోవింద్



ధ్యానంలో రామ్‌నాథ్ కోవింద్

నందిగామ/శంషాబాద్ రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని రాంచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురువు చారీజీ మహరాజ్ 97వ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న కార్యక్రమంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పాల్గొన్నారు. నందిగామ మండలంలోని కన్హాశాంతివనంలో ఈనెల 25 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గురూజీ కమలేష్ పటేల్‌తో కలిసి ధ్యానం చేశారు. మాజీ రాష్ట్రపతి కన్హాశాంతివనంలో మూడు రోజులు ఉంటారని సమాచారం. కాగా అంతకు ముందు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు స్వాగతం పలికారు.

గోరటికి దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం



గోరటి వెంకన్నకు దాశరథి ప్రజా సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న జస్టిస్ నగేశ్ భీమపాక తదితరులు

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న దాశరథి ప్రజాసాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నగేశ్ భీమపాక ఈ పురస్కారాన్ని అందజేసి శాలువ, జ్ఞాపికతో ఆయనను సత్కరించారు. చింతలకుంటలోని వాసవీ శ్రీనిలయం వేదికగా 'మాభూమి సాహితీ సాంస్కృతిక వేదిక' ఆధ్వర్యంలో దాశరథి శత జయంత్యుత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ నగేశ్ మాట్లాడుతూ దాశరథి అన్నట్టు గాయపడిన ఆ కవి గుండెల్లో రాయబడని కావ్యాలన్నీ గోరటి వెంకన్న రాయాలని ఆకాంక్షించారు. దాశరథి, వెంకన్న.. ఇద్దరూ పీడితుల పక్షాన నిలిచిన కవులంటూ వారిని ప్రజా కవులుగా అభివర్ణించారు. ఈ పురస్కారాన్ని అందుకోవడం తనకు ఆనందంగా ఉందని గోరటి వెంకన్న అన్నారు. తెలంగాణలో ఎంతోమంది గొప్ప కవులు, రచయితలు, కళాకారులకు పుట్టారని, వారంతా తన పాటకు స్ఫూర్తి అని వెల్లడించారు. 'సంతా... మా ఊరి సంత...' పాట ఆలపించి సభను గోరటి వెంకన్న ఉర్రూతలూగించారు. ఈ పురస్కారాన్ని ప్రతి ఏటా అందిస్తామని కార్యక్రమ నిర్వాహకుడు గొర్రెపాటి నరసింహ ప్రసాద్ చెప్పారు. కార్యక్రమానికి హాజరైన హైదరాబాద్ జిల్లా అదనపు న్యాయమూర్తులు కె. మురళీమోహన్, ఎం వెంకటేశ్వర రావు, సీనియర్ జర్నలిస్టు తాడి ప్రకాష్, రచయిత కూనపరాజు కుమార్ తదితరులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో దాశరథి స్థానం ప్రత్యేకమైనదంటూ కొనియాడారు. ప్రజాక్షేత్రంలో నిలిచి సాహిత్య సృజన చేసిన ఘనత ఆయన సొంతమని శ్లాఘించారు. గోరటి వెంకన్న సాహిత్య కృషిని అభినందిస్తూ మాట్లాడారు.

అందెశ్రీకి దాశరథి సాహితీ పురస్కారం



అందెశ్రీకి దాశరథి సాహితీ పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, రమణాచారి తదితరులు

మంగళ్‌హాట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి ఏడాది ప్రదానం చేస్తున్న మహాకవి దాశరథి సాహితీ పురస్కారాన్ని 2024 సంవత్సరానికి గాను ప్రజా వాగ్గేయకారుడు అందెశ్రీ అందుకున్నారు. మంగళవారం రాత్రి సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ భాషా నిలయం ఆడిటోరియంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి, భాషా నిలయం ఉపాధ్యక్షులు డాక్టర్ కె.వి.చంద్రప్రకాశ్, గౌరవ కార్యదర్శి టి.ఉడయవరులు చేతుల మీదుగా ఆయనకు పురస్కారం అందజేశారు. రూ.10 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురభివాణిదేవి మాట్లాడుతూ సమాజహితం కోసం అనేక ప్రక్రియలో రచనలు చేసిన దాశరథి పాటలు తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజల్లో ఎంతో చైతన్యం తీసుకువచ్చాయన్నారు. దాశరథి చరిత్రను నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పురస్కార గ్రహీత అందెశ్రీ మాట్లాడుతూ దాశరథి పురస్కారం తనకు ఇవ్వడం ఎంతో బరువుగా భావిస్తున్నానని, ఈ సత్కారానికి తాను సరైన వాడిని అవునా కాదో అనేది ఇంకా తెలియడం లేదన్నారు. కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన పలువురు విద్యార్థులను ఘనంగా సత్కరించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ మారణకాండను నిలిపివేయాలి

- బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి
- బాధ్యులైన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించాలి
- ప్రొఫెసర్ జి. హరగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి. హరగోపాల్

నల్లకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ జి. హరగోపాల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావులతో కలిసి ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. కగార్ పేరుతో చత్తీస్‌ఘడ్‌లో బలగాలను మోహరించి కేంద్రం హత్యాకాండను కొనసాగిస్తున్నదని ఆరోపించారు. సైనికీకరణతో పచ్చని అడవినంతా అమ్మేసి కార్పొరేటీకరణకు కేంద్ర ప్రభుత్వం పూనుకున్నదని ఆరోపించారు. అటవీప్రాంతంలో పోలీసులు క్యాంపులు ఎత్తివేయాలని, చత్తీస్‌ఘడ్‌లో బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించి, బాధ్యులైన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. దండకారణ్యంలో ఆదివాసీలపై అప్రకటిత యుద్ధం కొనసాగుతున్నదన్నారు. ఇక్కడ నెలకొన్న యుద్ధపరిస్థితిని ఇతర ప్రాంతాలకు తెలియకుండా, మీడియాను తమ నియంత్రణలో ఉంచుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నదని ధ్వజమెత్తారు. మావోయిస్టుల పేరుతో అమాయక ఆదివాసీలను చంపేస్తున్నారని, మహిళలను అత్యాచారంతోపాటు హత్య చేసి మావోయిస్టులుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ దాడులు, విధ్వంసాలు, అరెస్టులు, రిమాండ్‌లు వెంటనే నిలిపివేయాలన్నారు. హత్యాకాండపై ప్రజాస్వామిక వాదులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయస్థాయి ప్రజాస్వామిక హక్కుల సమన్వయ సంస్థ, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక సంయుక్తంగా మే 29 నుంచి జూన్ 3వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న హత్యాకాండపై నిర్వహించిన నిజనిర్ధారణ కమిటీ రిపోర్టును పౌరహక్కుల సంఘం నేతలు సోదాహరణంగా వివరించారు.

భట్టి మూటపై 'మహా' ఆశలు

(5వ పేజీ తరువాయి)

దశలో మొత్తం 70 కిలోమీటర్ల పనులకు రూ.17,500 కోట్ల అంచనా వ్యయాన్ని రూపొందించారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరిగితేనే సకాలంలో పనులు ప్రారంభమయ్యే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.

'మహాలక్ష్మి'తో పెరిగిన రద్దీ

మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో సిటీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ రెట్టింపు అయ్యింది. ఈ యేడాది చివరి నాటికి వెయ్యి కొత్త బస్సులను తీసుకొచ్చే లక్ష్యాన్ని ఆర్టీసీ పెట్టుకుంది. గ్రేటర్ ఆర్టీసీ విస్తరణ, కొత్త బస్సుల కొనుగోలుకు వెయ్యికోట్లకు పైగా కేటాయించాలని పలు ఆర్టీసీ సంఘాలు కోరుతున్నాయి.

'రాచకొండ' కమిషనరేట్ నిర్మాణం జరిగేనా..?

రాచకొండ పోలీస్ కమిషనరేట్ నూతన భవన నిర్మాణానికి మేడిపల్లి పరిధిలో 56 ఎకరాలు కేటాయించిన గత సర్కారు ప్రహరీ నిర్మాణం పూర్తి చేసింది. దేశంలోనే అతిపెద్దదైన రాచకొండ కమిషనరేట్‌ను ఇతర కమిషనరేట్లకు భిన్నంగా అన్ని విభాగాల కార్యాలయాలు ఒక్కచోట ఉండేలా నిర్మాణం చేపట్టనున్నట్లు అప్పట్లో ప్రకటించారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు కమిషనరేట్ నిర్మాణ పనులు ముందుకు కదలడం లేదు. కొత్త పోలీస్‌స్టేషన్ల నిర్మాణాలపై ఆశలున్నాయి.

వైద్య శాఖ ఆశలు

రాష్ట్ర బడ్జెట్‌పై వైద్య శాఖ ఆశలు పెట్టుకుంది. హైదరాబాద్‌లోనే అత్యధిక ప్రభుత్వ ఆస్పత్రులు ఉండడంతో మెరుగైన వైద్య సేవలు, కొత్త నిర్మాణాలు, పడకలు, ఆధునిక పరికరాలు సమకూర్చాల్సిన అవసరముందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో ట్విన్‌టవర్ నిర్మించాలన్న యోచన ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంది. ఈ ఆస్పత్రి పాతభవనం శిథిలం కావడంతో దానికి పూర్తిగా తాళం వేశారు. ఉస్మానియా ఆస్పత్రిలో 1 ప్లస్ 4 అంతస్తుల కొత్త భవనాలను నిర్మించాలని అప్పట్లో నిర్ణయం తీసుకున్నారు. ఇందులో ఓపీ విభాగంతో పాటు ఇన్‌పేషంట్లకు అవసరమైన వార్డులు, పడకలు, ఆధునిక పరికరాలు ఏర్పాటు చేయాలనుకున్నారు. నిలోఫర్, చెస్ట్ ఆస్పత్రుల్లో కొత్త భవనాలు, అదనపు పడకల కోసం ఎదురుచూస్తున్నారు. సరోజినీదేవి, ఈఎన్టీ ఆస్పత్రులను ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. మందుల కొరత లేకుండా నిధుల కేటాయింపు పెంచాల్సిన అవసరం ఉంది.

బడ్జెట్‌పై అభిప్రాయాలు

ఆరోగ్య సంరక్షణ రంగానికి ప్రాధాన్యం



కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను పెంపొందించాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ బడ్జెట్ నిదర్శనం. దశలవారీ తయారీ కింద ఎక్స్‌రే ట్యూబ్‌లు, ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్ల కోసం ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)లో మార్పు గొప్ప వ్యూహాత్మక చర్య. ఇది ఖర్చులను తగ్గిస్తుంది. దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచుతుంది. క్యాన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీల మినహాయింపు ఇచ్చారు. మూడు క్యాన్సర్ మందులపై ఈ మినహాయింపు ఉంది.

డాక్టర్ సంగీతారెడ్డి,
జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, అపోలో ఆస్పత్రుల గ్రూప్

క్యాన్సర్ మందుల ధరలు తగ్గుతాయి

మూడు క్యాన్సర్ ఔషధాలను కస్టమ్‌డ్యూటీల నుంచి మినహాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. క్యాన్సర్ చికిత్స చాలా ఖరీదైనది. తరచుగా రోగుల కుటుంబాలపై అధిక ఆర్థిక భారం పడుతున్నది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఈ కీలకమైన ఔషధాల ధర గణనీయంగా తగ్గుతుంది. దీని వల్ల చాలామందికి ఔషధాలు అందుబాటులోకి వస్తాయి. ఆర్థిక ఒత్తిడిని తగ్గించడం, క్యాన్సర్ రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఇది తోడ్పాటునందిస్తుంది.

డాక్టర్ గాయత్రి కామినేని,
చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ), కామినేని ఆస్పత్రులు

రూ.4.49కోట్లు కొల్లగొట్టాడు

● ఫార్మాలో పెట్టుబడి పేరిట బురిడీ..

హైదరాబాద్ సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీ స్థాపిస్తున్నానని, పెట్టుబడులు పెట్టిన వారికి 10 శాతం లాభాలు అందిస్తానని బురిడీ కొట్టించి ఓ కేటుగాడు రూ.4.49కోట్లను కొల్లగొట్టాడు. సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన రెండ్ల అజయ్ కుమార్ మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నాడు. 2020లో ఆల్మైటీ ఫార్మాను స్థాపించాడు. తన కంపెనీలో పెట్టుబడులు పెట్టిన వారికి 10 శాతం లాభాలు ఇస్తానని నమ్మబలికాడు. తెలిసిన వారు, స్నేహితులు సహా.. మొత్తం 35మంది నుంచి రూ. 4కోట్ల 49లక్షల 30 వేలు తీసుకున్నాడు. అందుకు గ్యారెంటీగా బాండు పేపర్లను అందించాడు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం ప్రారంభంలో రిటర్న్స్ ఇచ్చాడు. ఆ తర్వాత మొత్తం డబ్బుతో పారిపోయాడు. దాంతో బాధితులకు అనుమానం వచ్చింది. అల్లాపూర్‌కు చెందిన బాధితుడు కావలి శ్రీనివాస్ సహా.. పలువురు సైబరాబాద్ సీపీని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలతో ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఏసీపీ మురళీ కృష్ణ టీమ్ నిందితుడిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టింది.

షేర్‌మార్కెట్ పేరుతో రూ.కోటికి టోకరా

● పటాన్‌చెరులో మోసపోయిన ఓ టెకీ
● పోలీసులకు ఫిర్యాదు.. 24 లక్షలు స్వాధీనం

పటాన్‌చెరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): షేర్‌మార్కెట్లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలొస్తాయంటూ ఓ మహిళ వాట్సాప్‌లో పంపిన సందేశంతో కూడిన లింక్‌ను ఓపెన్‌చేసి ఓ టెకీ నిండా మునిగాడు. ఒకేసారి ఏకంగా రూ.కోటి ట్రాన్స్‌ఫర్ చేసి మోసపోయాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో వెలుగుచూసిందీ సైబర్ మోసం. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో బెజవాడ నాగార్జున (36) బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. జూలై 5న నాడియాకమీ అనే ఓ మహిళ నుంచి నాగార్జున వాట్సాప్‌నకు ఓ సందేశం వచ్చింది. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే పెద్ద ఎత్తున లాభాలొస్తాయనేది ఆ సందేశం సారాంశం. పెట్టుబడులు పెట్టాల్సిన సంస్థలను తాము సూచిస్తామని లాభాలు తెచ్చిపెట్టే బాధ్యత తమదనీ అతడిని ఆమె నమ్మించింది. పూర్తిగా నమ్మిన నాగార్జున ఆమె సూచించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పెట్టుబడులు పెట్టడం మొదలుపెట్టాడు. కొన్ని లాభాలొచ్చాక ఏకంగా రూ.99,78,527 పెట్టుబడుల రూపంలో బదిలీ చేశాడు. అయితే ఆ పెట్టుబడికి సంబంధించిన లాభాలు తన బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడంతో నాగార్జున తాను మోసపోయానని గ్రహించాడు. సోమవారం అర్ధరాత్రి పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారు వెంటనే సైబర్ క్రైం సెల్ 1930కి ఫోన్ చేయడంతో సైబర్ నేరగాళ్ల అకౌంట్‌లలో బదిలీ కాకుండా ఉన్న రూ. 24 లక్షలను రికవరీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మెదడువాపు వ్యాక్సినేషన్

వందశాతం పూర్తిచేయాలి

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మెదడువాపు వ్యాక్సినేషన్‌ను వందశాతం పూర్తిచేయాలని, 9-15 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పకుండా టీకాలు వేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం జపనీస్ ఎన్సెఫలిటిస్ (జేఈ) వ్యాక్సిన్‌పై మైనారిటీ మతపెద్దలు, ముఖ్య ప్రభావశీలురతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదడువ్యాపు వ్యాధి నివారణకు ఈనెల 25 నుంచి ఆగస్టు 15 వరకు శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలు, మదర్సాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకాలు వేయాలన్నారు. ప్రతి ఏఎన్‌ఎంకు టార్గెట్ ఇచ్చి సమర్థవంతంగా పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. మైనార్టీ ప్రాంతాల్లో ముస్లిం మత పెద్దలు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగరంలో చిరుజల్లులు

- ఓవైపు ఎండ.. మరోవైపు జల్లులతో భిన్న వాతావరణం

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. రోజుంతా ఎండ.. జల్లులతో భిన్న వాతావరణం నెలకొంది. చిరుజల్లులతో పలు ప్రాంతాల్లో రహదారులు బురదమయంగా మారడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాల నేపథ్యంలో నగరంలో చలిగాలుల తీవ్రత పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 29.5 డిగ్రీలు, కనిష్ఠంగా 23.4 డిగ్రీలు నమోదయ్యాయి. నగరంలో మరో రెండురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

తెరపైకి మళ్లీ

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- కేంద్ర బడ్జెట్లో ప్రాధాన్యతతో యూనివర్సిటీలో చర్చ

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌లో స్కిల్‌డెవలప్‌మెంట్‌కు భారీగా నిధులు కేటాయించడంతో జేఎన్‌టీయూలో దీని ఏర్పాటుకు సంబంధించి మళ్లీ చర్చ మొదలైంది. ఇటీవల జరిగిన డైరెక్టర్ల సమావేశంలో ఈ అంశాన్ని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ బుర్రా వెంకటేశం ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే 15 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో ఇదొకటిగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే.. కేంద్ర బడ్జెట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్‌కు భారీగా నిధులు కేటాయించడంతో వీసీ చేసిన ప్రతిపాదన హాట్‌టాపిక్‌గా మారింది. దేశవ్యాప్తంగా వెయ్యికిపైగా సంస్థలను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ తన ప్రసంగంలో పేర్కొన్న అంశాలపై వర్సిటీ ఆచార్యులు లెక్కలు వేస్తున్నారు. ఇన్‌చార్జ్ వీసీ చెప్పిన విధంగా యూనివర్సిటీలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఎంత మందికి శిక్షణ ఇచ్చేందుకు వీలవుతుందని, ప్రస్తుతం ఉన్న వనరులు, సమకూర్చుకోవాల్సిన వాటిపై అంచనాకు వస్తున్నారు. ఈ సెంటర్ ఏర్పాటుకు సుమారు రూ.10కోట్లు అవసరమవుతుందని చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మసీ ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణమైన స్కిల్స్‌ను అభివృద్ధి చేసేందుకు జేఎన్‌టీయూ మంచివేదిక కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ నిధులు కేటాయిస్తుండడం, వర్సిటీలో సెంటర్ ఏర్పాటుకు ఇన్‌చార్జ్ వీసీ సుముఖత వ్యక్తం చేయడంపై విద్యార్థి సంఘాల ప్రతినిధులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ పర్యాటకులకోసం

ప్యాకేజీ టూర్‌లకు ప్రోత్సాహం

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రాలను ప్రపంచస్థాయి పర్యాటకులకు పరిచయం చేయడానికి ప్యాకేజీ టూర్లను ప్రోత్సహించేందుకు భాగస్వామ్య ఒప్పందాలపై దృష్టి కేంద్రీకరించినట్టు రాష్ట్రపర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం టూరిజం ప్లాజాలో టూర్ ట్రావెల్ ఏజెంట్లతో ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదన్నారు. ఆసియాలోనే అతిపెద్ద అద్భుత బౌద్ధ వారసత్వ పార్కు బుద్ధవనాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్యాకేజీ టూర్లను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భూటాన్ దేశ విద్యాశాఖ మాజీ మంత్రి ప్రొఫెసర్ ఠాకూర్ ఎస్. పౌడ్యల్ మాట్లాడుతూ తమ దేశంలో సహజ ప్రకృతి కేంద్రాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయన్నారు. తెలంగాణలో బౌద్ధ పర్యాటక కేంద్రాలు, భూటాన్‌లోని బౌద్ధులకు పరిచయం చేయడానికి పరస్పరం ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పలు సంస్థలు పర్యాటక ప్యాకేజీలను నిర్వహించేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, జీఎం అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రూ.11.11 లక్షల కోట్ల మూలధన వ్యయం

ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.11,11,111 కోట్లు మూలధన వ్యయంగా నిర్ణయించింది. మౌలిక వసతుల్లో ప్రైవేటు పెట్టుబడులను పెంచేందుకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో మౌలిక వసతులకు బలమైన ఆర్థిక మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే తరహాలో ఆర్థిక మద్దతు ఇచ్చేలా ప్రోత్సహించనున్నామన్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆర్థిక అవసరాల కోసం మార్కెట్ ఆధారిత ఆర్థిక సహాయ విధానం ఒకటి ప్రారంభించనున్నామని ఆమె చెప్పారు.



ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకం

సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి సంస్థల (ఎంఎస్ఎంఈ) కోసం క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఈసారి బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించింది. ఈ స్కీమ్ ద్వారా ఎంఎస్ఎంఈలు యంత్రాలు, పరికరాల కొనుగోలు కోసం ఎలాంటి తనఖా లేదా థర్డ్ పార్టీ గ్యారెంటీ అవసరం లేకుండా టర్మ్ లోన్ తీసుకునే అవకాశం కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది. "ఎంఎస్ఎంఈలు, తయారీ యూనిట్లు, ముఖ్యంగా అధికంగా కార్మికులు అవసరమయ్యే పరిశ్రమలపై బడ్జెట్ ప్రత్యేక దృష్టి సారించింది. వారి కోసం ఓ ప్యాకేజీని రూపొందించాం. తాత్కాలిక బడ్జెట్లో ప్రస్తావించిన విధంగా ఈ ప్యాకేజీ ద్వారా ఫైనాన్సింగ్‌తో పాటు నిబంధనల సడలింపు, ఎంఎస్ఎంఈల వ్యాపార వృద్ధి, అంతర్జాతీయంగా పోటీపడేటట్లుగా చర్యలు చేపట్టనున్నామ"ని సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ఫ్ ఫైనాన్సింగ్ ఫండ్ ప్రతి దరఖాస్తుదారుకు తీసుకునే రుణ విలువలో రూ.100 కోట్ల వరకు ప్రభుత్వం గ్యారెంటీ కల్పించనుందన్నారు.

ఈ-కామర్స్ హబ్‌ల ఏర్పాటు

తొలుత 10-15 కేంద్రాల స్థాపన ▸▸ ఎగుమతులకు మరింత ప్రోత్సాహం

దేశంలో ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిన ఈ-కామర్స్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. తొలుత 10-15 హబ్‌లను స్థాపించనున్నారు. "సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీలు(ఎంఎస్ఎంఈ), హస్త కళాకారులు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ విపణిలో విక్రయించేందుకు వీలుగా పీపీపీ పద్ధతిన ఈ-కామర్స్ ఎక్స్‌పోర్ట్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు" బడ్జెట్ ప్రసంగంలో సీతారమన్ పేర్కొన్నారు. నిరంతరాయ నియంత్రణ, రవాణా వ్యవస్థగా ఏర్పాటు కానున్న ఈ హబ్‌లు వాణిజ్యంతోపాటు ఎగుమతి సంబంధిత సేవలందించనున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ హబ్‌లు త్వరితగతి కస్టమ్స్ అనుమతులు వంటి వసతులను కలిగి ఉండనున్నాయని, భారీ సరుకు రవాణా కేంద్రాలకు దగ్గర్లో ఉండనున్నాయని కేంద్ర వాణిజ్య పరిశ్రమ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. తొలుత పది నుంచి పదిహేను హబ్‌లను ఏర్పాటు చేస్తామని, మంచి స్పందన లభిస్తే భవిష్యత్‌లో వీటి సంఖ్యను మరింత పెంచుతామన్నారు. ఇండస్ట్రీతో సంప్రదింపులతో వీటిని గుర్తించడం జరుగుతుందని, వీటి ఏర్పాటుకు వారే ముందుకు రావాలన్నారు. ఈ హబ్‌లకు నియంత్రణ నియమావళి రూపకల్పనపై వాణిజ్య మంత్రిత్వ శాఖ కసరత్తు జరుపుతోంది. సెప్టెంబరు నాటికల్లా సిద్ధం కావచ్చని అంచనా.

ఆయిల్ కంపెనీలకు రిక్తహస్తం

ఈ బడ్జెట్ ప్రభుత్వ రంగంలోని బీపీసీఎల్, ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కంపెనీలను నిరాశ పరిచింది. రైట్స్ ఇష్యూల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ కంపెనీలకు రూ.15,000 కోట్లు సమకూరుస్తామని ఫిబ్రవరిలో ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటించారు. మంగళవారం నాటి బడ్జెట్‌లో అసలు ఆ ఊసే లేదు. గత ఆర్థిక సంవత్సరమూ ప్రభుత్వం ఇలానే రూ.30,000 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించి, చివరికి పైసా కూడా విదల్చలేదు. గత ఆర్థిక సంవత్సరం ఈ మూడు ఆయిల్ కంపెనీలు రూ.80,0000 కోట్లకు పైగా లాభాలు ఆర్జించడం ఇందుకు ప్రధాన కారణం.

ఎంఆర్ఓ కార్యకలాపాలకు ఊతం

వైమానిక, నౌకాయానాలకు సంబంధించిన నిర్వహణ, రిపేర్లు, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్ఓ) కార్యకలాపాలకు మన దేశాన్ని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకూ ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి కొన్ని చర్యలు ప్రకటించారు. విమానాలు, నౌకల రిపేర్ల కోసం దిగుమతి చేసుకున్న వస్తువుల ఎగుమతి గడువుని ఆరు నెలల నుంచి ఏడాదికి పెంచారు. అలాగే ఇందుకోసం వారంటీతో తిరిగి దిగుమతి చేసుకునే వస్తువుల కాలపరిమితినీ ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వైమానిక, నౌకాయానాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక మంత్రి ఈ ప్రోత్సాహకాలు ప్రకటించారు.

ద్రవ్యలోటు అంచనా 4.9 శాతం

ఆదాయ అవకాశాలు మెరుగుపడిన నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) ద్రవ్య లోటును జీడీపీలో 4.9 శాతానికి కట్టడి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో ప్రకటించిన 5.1 శాతం లోటు అంచనాతో పోలిస్తే, మరింత కుదించింది. అయితే, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) గాను 4.5 శాతం ద్రవ్య లోటు అంచనాను మాత్రం యథాతథంగా కొనసాగించింది. "ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లుగా, వ్యయాలు రూ.48.21 లక్షల కోట్లుగా ఉండవచ్చు. ఈ నేపథ్యంలో ద్రవ్య లోటు రూ.16.14 లక్షల కోట్లకు (జీడీపీలో 4.9 శాతం) పరిమితం కావచ్చ"ని బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2021లో నేను ప్రకటించిన ద్రవ్య స్థిరీకరణ ప్రణాళిక మన ఆర్థిక వ్యవస్థకు మంచి ఫలితాలందించిందని, 2025-26లో లోటును 4.5 శాతం దిగువకు కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆపై ఆర్థిక సంవత్సరం (2026-27) నుంచి రుణ-జీడీపీ నిష్పత్తిని తగ్గించడంపై దృష్టిసారిస్తామని, ఈ నిష్పత్తి తగ్గుముఖం పట్టేలా ప్రతి యేటా ద్రవ్య లోటు నియంత్రణ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం జరుగుతుందన్నారు.

మరింత పటిష్ఠంగా దివాలా చట్టం

దివాలా చట్టాని (ఐబీసీ)కి మరింత పదును పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మరిన్ని ట్రిబ్యునల్స్, ప్రస్తుతం ఉన్న ఎన్‌సీఎల్‌టీల్లో మరిన్ని బెంచ్‌లు ఏర్పాటు చేయబోతున్నట్టు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. దీనికి తోడు దివాలా పరిష్కార ప్రక్రియను మరింత త్వరితం చేసేందుకు స్టేక్‌హోల్డర్లు అందరితో కూడిన ఒక సమగ్ర టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి దివాలా చట్టంలో మరిన్ని మార్పులకూ సిద్ధమన్నారు. 2016లో అమల్లోకి వచ్చిన ఐబీసీతో ఇప్పటి వరకు వెయ్యికి పైగా కంపెనీల దివాలా ప్రక్రియను పరిష్కరించినట్టు తెలిపారు. దీంతో ఈ కంపెనీలకు రుణాలు ఇచ్చిన రుణదాతలకు రూ.3.3 లక్షల కోట్ల రుణాలు వసూలైనట్టు వెల్లడించారు. ఇవిగాక రూ.10 లక్షల కోట్లకుపైగా రుణాలతో ముడిపడిన 28,000 దివాలా కేసులు, పరిష్కార ప్రక్రియకు రాకుండానే పరిష్కారమైనట్టు తెలిపారు. దివాలా కేసులను మరింత వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

రుణ సమీకరణ లక్ష్యం కుదింపు

దేశంలో పన్ను వసూళ్లు పెరగడంతో ఈ ఏడాదికి రుణ సమీకరణ లక్ష్యాన్ని రూ.14.01 లక్షల కోట్లకి కుదించినట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. మధ్యంతర బడ్జెట్లో ఈ లక్ష్యం రూ.14.13 లక్షల కోట్లుగా ప్రకటించారు. విత్తలోటు లక్ష్యాల సాధన కోసం ప్రభుత్వం నిర్దిష్ట కాలపరిమితితో కూడిన సెక్యూరిటీలు జారీ చేస్తుంది. అదే విధంగా నికర రుణ సమీకరణ లక్ష్యాన్ని కూడా రూ.11.63 లక్షల కోట్లకు కుదించారు.

పెట్టుబడుల ఉపసంహరణ @ రూ.50 వేల కోట్లు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణ ద్వారా రూ.50 వేల కోట్లు సమీకరించుకోవాలనుకుంటున్నట్టు దీపమ్ కార్యదర్శి తుహిన్ కాంత పాండే తెలిపారు. ఈ ఏడాది ఆర్‌బీఐ, బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రూ.2,32,874 కోట్లు డివిడెండ్‌గా వస్తుందని బడ్జెట్ అంచనా వేసింది. తాత్కాలిక బడ్జెట్ అంచనా రూ.1.02 లక్షల కోట్ల కన్నా ఇది రెట్టింపు అధికం.

క్యాపిటల్ మార్కెట్‌పై పన్ను పోటు

హేతుబద్ధీకరణ పేరుతో వడ్డించిన ఆర్థిక మంత్రి.. మూలధన లాభాలపై బాదుడు

- ఎల్‌టీసీజీటీ 10 నుంచి 12.5 శాతానికి పెంపు
- రూ.15,000 కోట్ల అదనపు ఆదాయం
- డెరివేటివ్స్ ట్రేడింగ్‌పై ఎస్‌టీటీ పెంపు
- వాటాదారులపైనే ఇక 'బై బ్యాక్'ల భారం



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన తాజా బడ్జెట్‌లో క్యాపిటల్ మార్కెట్‌పై పెద్ద భారమే మోపారు. ఏడాదికిపైగా ఉంచుకుని అమ్మే లిస్టెడ్ కంపెనీల షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల వంటి ఫైనాన్షియల్ అసెట్స్ అమ్మకాలపై వచ్చే లాభాలపై విధించే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ)ని ప్రస్తుత 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచారు. అలాగే అన్‌లిస్టెడ్ ఫైనాన్షియల్ అసెట్స్, నాన్ ఫైనాన్షియల్ అసెట్స్‌ను రెండేళ్ల పాటు ఉంచుకుని అమ్మితే వచ్చే దీర్ఘకాలిక మూలధన లాభాలపైన 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే అన్‌లిస్టెడ్ బాండ్స్, డిబెంచర్లకు ఈ నిబంధన వర్తించదు. వీటి అమ్మకాలపై వచ్చే లాభాలపై ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబులను బట్టి పన్ను విధిస్తారు.

స్వల్పకాలిక లాభాల పన్ను: ఇదే సమయంలో ఏడాది కంటే తక్కువ సమయం ఉంచుకుని అమ్మే లిస్టెడ్ కంపెనీల షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు, బిజినెస్ ట్రస్టుల యూనిట్లపై వచ్చే లాభాలపై విధించే స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను (ఎస్‌టీసీజీ)ని ప్రస్తుత 15 శాతం నుంచి 20 శాతానికి పెంచారు. బడ్జెట్ అనంతరం జరిగిన సమావేశంలో ఆర్థిక మంత్రి సీతారామన్ ఈ మార్పులను మూలధన లాభాల పన్ను హేతుబద్ధీకరణగా అభివర్ణించారు. ఈ మార్పులతో క్యాపిటల్ మార్కెట్లో పెట్టుబడులు మరింత పెరుగుతాయని తెలిపారు.

ఖజానాకు భారీగా రాబడి: మూలధన లాభాల పన్ను రేట్ల మార్పుతో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అదనంగా రూ.15,000 కోట్ల ఆదాయం సమకూరనుంది. బడ్జెట్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా ఈ విషయం వెల్లడించారు. ఇదే సమావేశంలో పాల్గొన్న ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ మాత్రం 'మూలధన పన్నుల విధానాన్ని సులభతరం చేశాం' అని అన్నారు.

'డెరివేటివ్స్' ట్రేడింగ్ మరింత భారం

ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి ఎఫ్ అండ్ ఓ (డెరివేటివ్స్) ట్రేడింగ్ ఒకింత భారం కానుంది. ఆప్షన్ అమ్మకాలపై విధించే సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ)ని 0.0625 శాతం నుంచి 0.1 శాతానికి పెంచారు. ఆప్షన్ ప్రీమియంపై ఈ పన్ను విధిస్తారు. అలాగే ఫ్యూచర్స్ మార్కెట్లో సెక్యూరిటీల అమ్మకాలపై విధించే ఎస్‌టీటీని 0.0125 శాతం నుంచి 0.02 శాతానికి పెంచారు. ఇటీవల డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో అనేక మంది రిటైల్ ఇన్వెస్టర్లు చేతులు కాల్చుకుంటున్నారు. అత్యంత రిస్క్‌తో కూడిన ఈ మార్కెట్లో రిటైల్ మదుపరుల ప్రవేశాన్ని నిరుత్సాహపరిచేందుకు ఆర్థిక మంత్రి ఈ చర్య తీసుకున్నారని భావిస్తున్నారు. అయితే మార్కెట్‌పై దీని ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాల అంచనా.

'బైబ్యాక్'లపైనా వడ్డింపు

లిస్టెడ్ కంపెనీలు చేసే షేర్ల బై బ్యాక్.. వాటాదారులకు ఇక పెద్ద భారం కానుంది. ఈ బై బ్యాక్‌లను డివిడెండ్లుగా పరిగణించి వాటాదారులపైనే పన్ను విధిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. పుష్కలంగా మిగులు నిధులు ఉన్న లిస్టెడ్ కంపెనీలు, మార్కెట్ ధర కంటే అధిక ధరకు తమ షేర్లను వాటాదారుల నుంచి బై బ్యాక్ చేస్తుంటాయి. ఇప్పటి వరకు ఈ బై బ్యాక్‌ల పన్ను భారం వాటాదారులపై పడేది కాదు. కంపెనీలే ఆ భారం భరించేవి. అక్టోబరు 1 నుంచి ఈ భారం వాటాదారులపై పడనుంది. దీంతో షేర్ల బై బ్యాక్‌ల బాగా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

'స్టార్టప్స్'కు ఊరట..

ఏంజిల్ ట్యాక్స్‌కు గుడ్‌బై

స్టార్టప్ కంపెనీలకు ఆర్థిక మంత్రి సీతారామన్ ఈ బడ్జెట్‌లో పెద్ద శుభ వార్త చెప్పారు. ఈ సంస్థల్లోకి వచ్చే పెట్టుబడులపై విధిస్తున్న ఏంజిల్ ట్యాక్స్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అన్ని తరగతుల పెట్టుబడులకు ఈ నిర్ణయం వర్తిస్తుందన్నారు. ఈ నిర్ణయంపై స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. స్టార్టప్‌ల నిధుల సేకరణకు ఈ నిర్ణయం ఎంతగానో తోడ్పడటమే కాకుండా దేశంలో స్టార్టప్‌ల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు.

మార్కెట్‌కు బడ్జెట్ కుదుపు

▸▸ **ఎస్‌టీటీ, ఎల్‌టీసీజీ పెంపుతో**

సెన్సెక్స్ ఒకదశలో 1278 పాయింట్లు పతనం

▸▸ **చివరికి 73 పాయింట్ల నష్టంతో సరి**

గత ఐదు బడ్జెట్‌లు ప్రవేశ పెట్టిన రోజు సూచీల స్పందన

	సెన్సెక్స్		నిఫ్టీ	
	లాభం/(నష్టం)	ముగింపు	లాభం/(నష్టం)	ముగింపు
2023	158.18	59,708.08	(45.85)	17,616.30
2022	848.40	58,862.57	237	17,576.85
2021	2,314.84	48,600.61	646.60	14,281.20
2020	(987.96)	39,735.53	(300.25)	11,661.85
2019	212.74	36,469.43	62.70	10,893.65

ముంబై: బడ్జెట్ నిర్ణయాలు స్టాక్ మార్కెట్‌ను కుదిపేశాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ)తో పాటు ఈక్విటీలపై క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ పెంపుతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మార్కెట్ వర్గాలకు గట్టి షాక్ ఇచ్చింది. దాంతో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటంతో సెన్సెక్స్ ఒక దశలో 1,278 పాయింట్ల వరకు క్షీణించి.. 79,224 వద్దకు జారుకుంది. మళ్లీ క్రమంగా తేరుకున్న సూచీ చివరికి 73.04 పాయింట్ల నష్టంతో 80,429.04 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 435 పాయింట్ల వరకు పతనమై 24,074 స్థాయికి దిగివచ్చింది. మధ్యాహ్నం మళ్లీ కాస్త తేరుకుని 30.20 పాయింట్ల నష్టంతో 24,479.05 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 16 నేలచూపులు చూశాయి.

లాభ నష్టాల మధ్య ఊగిసలాట: బడ్జెట్ నేపథ్యంలో సూచీలు ఆద్యంతం తీవ్ర ఒడుదుడుకులకు లోనయ్యాయి. రోజంతా లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. ఆరంభంలో స్వల్ప లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్, నిఫ్టీ.. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం ప్రారంభయ్యే సమయానికి స్వల్ప నష్టాల్లో ట్రేడయ్యాయి. ఎస్‌టీటీ, ఎల్‌టీసీజీ పెంపు ప్రకటనపై తీవ్రంగా స్పందించిన ఇన్వెస్టర్లు అమ్మకాలను పోటెత్తించారు. ఒకదశలో భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు.. ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో కొనుగోళ్లతో మళ్లీ తేరుకున్నాయి. ద్రవ్యలోటు తగ్గింపు, మౌలిక ప్రాజెక్టులపై భారీగా వెచ్చించనుండటంతో పాటు గ్రామీణ మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెంచడంపై ప్రభుత్వం దృష్టిసారించడం వంటి అంశాలు మార్కెట్ రికవరీకి దోహదపడ్డాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే అన్నారు.

జువెలరీ షేర్లు జిగేల్: బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకం తగ్గింపు ప్రకటనతో స్వర్ణాభరణ విక్రయ కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. బీఎస్ఈలో త్రిభువన్‌దాస్ భీమ్‌జీ జవేరీ షేరు ఏకంగా 13.86 శాతం ఎగబాకి రూ.155.30 వద్ద ముగిసింది. టైటాన్ 6.63 శాతం పెరిగింది. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ 6.32 శాతం, పీసీ జువెలర్స్ 5 శాతం, సెన్‌కో గోల్డ్ 4.75 శాతం, కల్యాణ్ జువెలర్స్ 4.53 శాతం లాభపడ్డాయి.

రొయ్యల షేర్లు జూమ్: రొయ్యల పెంపకం, మార్కెటింగ్‌కు ప్రభుత్వం రుణం సమకూర్చటంతో పాటు రొయ్య పిల్లలపై కస్టమ్స్ డ్యూటీని సైతం 5 శాతానికి తగ్గించడంతో ఈ రంగ షేర్లలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. బీఎస్ఈలో జీల్ ఆక్వా షేరు 9.75 శాతం ఎగబాకగా.. అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ 3.07 శాతం, వాటర్‌బేస్ 2.33 శాతం, కోస్టల్ కార్ప్ 2.28 శాతం, అవంతీ ఫీడ్స్ 4.60 శాతం లాభపడ్డాయి.

హెరిటేజ్ లాభంలో 249 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి (క్యూ1)గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏకంగా 249 శాతం వృద్ధి చెంది రూ.58.4 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికర లాభం 16.73 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ రెవెన్యూ 11.8 శాతం వృద్ధితో రూ.923.68 కోట్ల నుంచి రూ.1,032.70 కోట్లకు చేరుకుంది. తొలిసారిగా ఒక త్రైమాసిక కాలంలో కంపెనీ రెవెన్యూ రూ.1,000 కోట్ల మార్కును అధిగమించిందని హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. కాగా ఈ కాలంలో వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల రెవెన్యూ 19.9 శాతం వృద్ధితో రూ.422.80 కోట్లకు చేరుకుందని పేర్కొంది.

హెచ్125 హెలికాప్టర్ల తయారీకి ఎయిర్‌బస్,టీఏఎస్ఎల్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో సింగిల్ ఇంజన్ హెచ్125 హెలికాప్టర్ల తయారీకి సంబంధించి తుది అసెంబ్లింగ్ లైన్ (ఎఫ్ఏఎల్)ను ఏర్పాటు చేసేందుకు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ అధికారికంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి.టీఏఎస్ఎల్ ఇప్పటికే ఎయిర్‌బోర్న్ ప్లాట్‌ఫామ్స్‌లో కీలకంగా ఉందని, ఎయిర్‌బస్ గ్రూప్‌తో ప్రస్తుత భాగస్వామ్యం దీన్ని మరింత పటిష్ఠం చేయనుందని టీఏఎస్ఎల్ సీఈఓ, ఎండీ సుకరన్ సింగ్ తెలిపారు. మేడిన్ ఇండియా హెచ్125 హెలికాప్టర్ల డెలివరీలను 2026 నుంచి ప్రారంభించాలని కంపెనీ భావిస్తోంది. కాగా టీఏఎస్ఎల్.. హైదరాబాద్ సమీపంలోని ఆదిభట్లలో ప్లాంట్‌ను నిర్వహిస్తోంది. దీంతో హైదరాబాద్‌లోనే హెచ్125 హెలికాప్టర్ల పూర్తి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,860 ▼	64,950 ▼	92,500 ▼
ముంబై	69,602 ▼	63,755 ▼	84,919 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ



హైదరాబాద్	490	విజయవాడ	500
వరంగల్	492	గోదావరి	485
చిత్తూరు	573	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	112
వరంగల్	112	గుంటూరు	115
కరీంనగర్	112	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	112		

కొండంత ఆశల బడ్జెట్

మోదీ 3.0 హయాంలో ప్రతిపాదించిన ఈ తొలి బడ్జెట్ వికసిత్ భారత్ ఆశలన్నీ ఒకేసారి తీర్చాలన్న ఆతృతలో రూపొందించినట్టుగా కనిపిస్తోంది. బడ్జెట్ 9 ప్రాధాన్యతాంశాలపై దృష్టి కేంద్రీకరించింది. వాటిలో అత్యంత ప్రధానమైనది వ్యవసాయం. ఈ రంగంలో దిగుబడులు నిరాశావహంగా ఉండడం వల్ల ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఈ రంగాన్ని పటిష్ఠం చేయడానికి బడ్జెట్ పెద్దపీట వేసింది. ఆత్మనిర్భర్ భారత్ కింద నూనె గింజలు, పప్పు దినుసులపై పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు పెంచాలని నిర్ణయించారు. అలాగే దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి ఆకర్షించడానికి ఒక ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. రెండో కీలక ప్రాధాన్యతా విభాగం నైపుణ్యాలు, ఉపాధి కల్పన. గత పదేళ్ల కాలంలో 12 కోట్ల ఉద్యోగాల కల్పన జరిగి, నిరుద్యోగిత శాతం 3.2 శాతానికే పరిమితమైంది. అయినప్పటికీ నిరుద్యోగం అధికంగా ఉందనే భావన ప్రజల్లో ఉంది. 90 శాతం ఉద్యోగాలు అవ్యవస్థీకృత రంగంలో ఏర్పడడమే ఇందుకు కారణం. అవ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగాలను వ్యవస్థీకృతం చేయడం లక్ష్యంగా తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారికి, ఉద్యోగాలు ఇచ్చిన యాజమాన్యాలకు ఈపీఎఫ్ఓలో నమోదు ఆధారంగా కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించారు. దేశంలో జీడీపీ వృద్ధి రేటు 8 శాతం స్థాయిలో ఉన్నప్పటికీ నికర వినియోగం రేటు 5 శాతం, నికర పొదుపు రేటు కూడా 5-5.5 శాతానికి పరిమితం అయ్యాయి. ప్రజలకి ఆదాయాలు వస్తున్నప్పటికీ ఆ సొమ్ము అంతా ఖర్చయిపోవడమే ఇందుకు కారణం. ఆహార ద్రవ్యోల్బణం 7.5 శాతం స్థాయిలో కదలాడుతున్నందు వల్ల ప్రజలు సంపాదించిన దాంట్లో అధిక శాతం ఖర్చు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ రంగాన్ని ఉత్తేజితం చేసేందుకు తీసుకున్న చర్యలు ఈ లోపాన్ని సరిదిద్దుతాయి. ఇక ఎంఎస్ఎంఈ రుణాల విషయంలో ఒక కీలకమైన నిర్ణయం ప్రకటించారు. ఇప్పటివరకు ఎంఎస్ఎంఈలకు ఆస్తి ఆధారంగా రుణాలిచ్చేవారు. ఇప్పుడు ఎంఎస్ఎంఈలకు అందుతున్న డిజిటల్ చెల్లింపుల ఆదాయం ఆధారంగా రుణాలందించే విధానం అనుసరించనున్నట్టు ప్రకటించారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం ఈ బడ్జెట్లో మరో విశేషాంశం. స్థూలంగా ఇది వ్యవసాయ, ఉపాధి కల్పన, సంస్కరణలపై ఫోకస్ పెట్టిన బడ్జెట్‌గా కనిపిస్తోంది.



-కె.నరసింహమూర్తి
రచయిత ఆర్థిక నిపుణుడు



85 నిమిషాల్లో ముగిసిన బడ్జెట్ ప్రసంగం

వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారు నిర్మలాసీతారామన్. ఈసారి బడ్జెట్ ప్రసంగాన్ని ఆమె 85 నిమిషాల్లో ముగించారు. పూర్తిస్థాయి బడ్జెట్ సందర్భంగా ఆమె ఇచ్చిన అతి చిన్న బడ్జెట్ ప్రసంగం ఇదే. ఈ ఏడాది ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ప్రసంగం 56 నిమిషాల్లో ముగిసింది. 2023లో 87నిమిషాలు, 2022లో 90, 2021లో 100, 2020లో 162, 2019లో 135 నిమిషాల పాటు నిర్మల బడ్జెట్ ప్రసంగాలు సాగాయి.



ఎన్‌పీఎస్‌లో మార్పులపై త్వరలో నిర్ణయం

కొత్త పింఛను పథకం(ఎన్‌పీఎస్)లో వివాదాస్పద అంశాలకు పరిష్కారం కనుగొంటామని, త్వరలోనే ఒక నిర్ణయానికి వస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ పథకాన్ని సమీక్షించేందుకు ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ ఎంతో పురోగతి సాధించిందని చెప్పారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న పలు రాష్ట్రాలు పాత పింఛను పథకానికి (ఓపీఎస్) మళ్లిన నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లోనూ ఉద్యోగ సంఘాలు ఆ డిమాండ్‌ను లేవనెత్తుతున్నాయి.

పింఛను లెక్క (రూ.కోట్లలో)

2021-22	2023-24
1,98,962	2,38,049
2022-23	2024-25
2,41,599	2,43,296

యువ మిత్ర!

యువతను, మిత్ర పక్షాలను సంతృప్తిపరిచేలా బడ్జెట్

యువతకు ఉపాధి, శిక్షణ.. కొంతమంది ఉద్యోగులకు ఊరట.. మిత్రులకు నిధులు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తన పూర్తిస్థాయి బడ్జెట్‌ను మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పుడు రూ.48.21 లక్షల కోట్లతో పూర్తిస్థాయి పద్దును సమర్పించారు. తొమ్మిది రంగాలు, నాలుగు అంశాలపై ప్రధానంగా దృష్టిసారించారు. గతానికి భిన్నంగా ఎటువంటి సూక్తులు, సుత్తి లేకుండా నేరుగా బడ్జెట్ ప్రసంగం కొనసాగించారు. భారత్‌లో నిరుద్యోగం 9.2 శాతానికి చేరిందని, వికసిత భారత్‌కు, ఆర్థిక వృద్ధికి ఇది ప్రధాన అవరోధంగా మారిందన్న ఆందోళనల నేపథ్యంలో యువతకు ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టిసారించారు. 'పీఎం ప్యాకేజీ' కింద రాబోయే ఐదేళ్లలో 4.1కోట్ల యువతకు లబ్ధి చేకూరేలా రూ.2లక్షల కోట్లతో ఐదు పథకాలను ప్రకటించారు. కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి ఒక నెల వేతనాన్ని (గరిష్ఠంగా రూ.15 వేలు) బోనస్‌గా ఇవ్వడం.. ఈపీఎఫ్‌వో చెల్లింపుల ఆధారంగా ఉద్యోగికి, యజమాన్యానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం.. అదనపు ఉద్యోగాలు కల్పించే సంస్థలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించడం ఇందులో భాగంగా ఉన్నాయి. అంటే, కొత్త ఉద్యోగులకు సంస్థలు చెల్లించే ఈపీఎఫ్‌వో వాటాను నెలకు రూ.3000 చొప్పున రెండేళ్లపాటు తిరిగి రీయింబర్స్ చేయనుంది. ఈ మూడు పథకాలకు దాదాపు లక్ష కోట్లను ఖర్చు చేయనుంది. యువతలో సగం మందికి మాత్రమే ఉద్యోగ నైపుణ్యాలు ఉన్నాయని ఆర్థిక సర్వే కూడా ఘోషించిన నేపథ్యంలో రాబోయే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. దేశంలోని 500 అగ్రశ్రేణి కంపెనీల్లో కోటి మందికి ఇంటర్న్‌షిప్ ఎను కల్పించనుంది. యువతకు ఉపాధి పెంచేందుకు ముద్రా రుణాల పరిమితిని రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచింది. విద్యార్థులకు రూ.10లక్షల వరకూ విద్యా రుణాలు ఇవ్వాలని సంకల్పించింది. వాటిపై 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తామని ప్రకటించింది. మహిళలపైనా కొన్ని వరాలను కురిపించింది. మహిళల పేరిట ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై స్టాంపు డ్యూటీని తగ్గించాలని ప్రతిపాదించింది.మహిళలు, బాలికల అభివృద్ధికి రూ.3లక్షల కోట్లను కేటాయించింది. ఉద్యోగాలు చేసే మహిళల కోసం ప్రత్యేకంగా హాస్టళ్లను నిర్మించనుంది.

...మిత్రో!

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ రాకపోవడంతో ఎన్డీయే మిత్రులపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఇప్పటికే బిహార్ సీఎం నితీశ్ కుమార్ తమకు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ కావాలని డిమాండ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే, బడ్జెట్లో మిత్రులకు పెద్దపీట వేశారు. సర్కారు ఏర్పాటులో కీలకంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌పై వరాలు కురిపించారు. ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు.. ఏపీ రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు ఇస్తామని చెబుతూనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని సంకల్పం చెప్పుకొన్నారు. విశాఖపట్నం- చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని కొప్పర్తి నోడ్; హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లోని ఓర్వకల్లు నోడ్‌కు నిధులిస్తామని ప్రకటించింది. వెనకబడిన జిల్లాలకు గ్రాంట్లు ఇస్తామని తెలిపింది. బిహార్‌కు రూ.26వేల కోట్లతో రోడ్లు, వంతెనలు;రూ.21వేల కోట్లతో అణు విద్యుత్తు ప్లాంట్, విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలు తదితర వరాలు ప్రకటించింది. బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి 'పూర్వోదయ' పథకాన్ని ప్రకటించింది. బిహార్ సహా 5 వరద బాధిత రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు ఇస్తామని తెలిపింది. ఏకంగా ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా తెలంగాణకు మొండిచెయ్యే చూపింది. విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని అడిగినా పట్టించుకోలేదు. కొత్తగా ఎటువంటి వరాలూ ప్రకటించలేదు.



బడ్జెట్ ప్రసంగానికి ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన ఆర్థిక మంత్రి నిర్మల

ఈసారి వాటి ఊసేదీ..!?

బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులు తప్పనిసరి. అలాగే, ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) ఉంటూ ఉంటుంది. కానీ, మధ్యంతర బడ్జెట్‌లో కేటాయింపులు తప్పితే ఈసారి బడ్జెట్లో రైల్వే, డిజిన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి ఎటువంటి ప్రకటనా లేదు. నదుల అనుసంధానాన్ని మాట మాత్రంగా కూడా ప్రస్తావించలేదు. అదే సమయంలో, ఎప్పట్లాగే, మౌలిక సదుపాయాలు(ఇన్ఫ్రా), ఇండస్ట్రియల్ పార్కులు, కారిడార్లకు నిధులు కేటాయించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రాలకు 1.5 లక్షల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తామని ప్రకటించారు. మధ్యంతర బడ్జెట్లో ప్రకటించిన రూ.11.11లక్షల కోట్లనే మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్)గా చూపారు. కాకపోతే, సంక్షోభంలో ఉన్న ఎంఎస్‌ఎంఈలను ఆదుకోవడానికి బడ్జెట్లో కొన్ని పథకాలను ప్రకటించారు. వాటికి క్రెడిట్ గ్యారెంటీ పథకాలతోపాటు త్వరలో రూ.100కోట్ల రుణాలు ఇచ్చే పథకాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. తనఖాలు, గ్యారెంటీలు లేకుండా యంత్ర పరికరాల కొనుగోలుకు టర్మ్ రుణాలు ఇస్తామని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లు, సిడ్బీ బ్రాంచిలు ఏర్పాటు చేస్తామని, వంద నగరాల్లో పారిశ్రామిక పార్కులు, 12పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రూ.లక్ష కోట్లతో ప్రైవేటు రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన సంస్థలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మికుల కోసం డార్మిటరీ తరహాలో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఇక,వ్యవసాయ రంగానికి రూ.1.52లక్షల కోట్లను కేటాయించింది. ప్రకృతి వ్యవసాయంలోకి మరో కోటి మంది రైతులను తీసుకొస్తామని, కూరగాయల ఉత్పత్తికి క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. 5కోట్ల మంది గిరిజనులకు లబ్ధి చేకూర్చేందుకు జన తాంత్రియ యోజన అమలు చేస్తామని వెల్లడించింది. ఈ బడ్జెట్లో ధనిక, పేద తారతమ్యాన్ని తగ్గించేందుకు ఎటువంటి చర్యలూ ప్రకటించలేదు. మధ్యంతర బడ్జెట్లో ప్రాధాన్యంగా తీసుకున్న 'నిరుపేదలు' అనే అంశం.. ఈసారి లేకపోవడం గమనార్హం!!

- సెంట్రల్ డెస్క్

రాష్ట్రాలకు ఏమిచ్చారు (రూ.లక్షల కోట్లలో)

2022-23	18.64
2023-24	20.98
2024-25	23.48

రాయితీలకు మంగళం

ఎప్పట్నుంచో అమల్లో ఉన్న ఆదాయ పన్ను విధానంలో ఇంటి నిర్మాణం, పిల్లల ఫీజులు, పొదుపు తదితరాలకు రాయితీలు ఉంటాయి. బీజేపీ సర్కారు గతంలో తెరపైకి తెచ్చిన కొత్త విధానంలో వీటికి మంగళం పలికింది. ఈ నేపథ్యంలోనే తమకు మరిన్ని రాయితీలు ఇవ్వాలని వేతనజీవులు పదే పదే కోరుతున్నారు. కానీ, ఎప్పట్లాగే, ఈసారి కూడా బడ్జెట్లో కొత్త విధానానికే కేంద్రం పెద్దపీట వేసింది. స్టాండర్డ్ డిడక్షన్‌తోపాటు శ్లాబులను కూడా కొత్త విధానంలోనే మార్చింది. తద్వారా, పాత విధానానికి పూర్తిస్థాయిలో పాతర వేసింది. అంతేనా.. వచ్చే ఏడాది నుంచి పాత విధానానికి పూర్తిస్థాయిలో మంగళం పాడతారన్న ఊహాగానాలూ వెలువడుతున్నాయి. ఇక, బడ్జెట్లో బంగారం, వెండితోపాటు సెల్‌ఫోన్లు, లెదర్ ఉత్పత్తులు, ఎక్స్‌రే మిషన్లు, సోలార్ ఉత్పత్తులు, మూడు క్యాన్సర్ మందులపై కస్టమ్ డ్యూటీని తగ్గించారు. ఫలితంగా, వాటి ధరలు తగ్గనున్నాయి. ఈ ప్రకటనతో ఒక్క మంగళవారంనాడే బంగారం గ్రాముకు రూ.4000 వరకూ తగ్గడం గమనార్హం. ఎప్పట్లాగే, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు పెద్దపీట వేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 కోట్ల ఇళ్లు నిర్మించనున్నారు. పట్టణ పేదలకు రూ.10లక్షల కోట్ల పెట్టుబడితో కోటి ఇళ్లను నిర్మించాలని ఈ బడ్జెట్లో పెట్టారు. ఇందులో రూ.2.2 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వమే ఖర్చు చేయనుంది.

సమయం మారింది

తొలిరోజుల్లో సాయంత్రం 5గంటలకు బడ్జెట్ సమర్పించడం ఆనవాయితీగా ఉండేది. బ్రిటిషర్ల పాలనలో భారత్, లండన్ కాలమానాలు కలిసొచ్చే విధంగా ఈ సమయాన్ని ఎంచుకున్నారు. అయితే 1999లో యశ్వంత్ సిన్హా కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో బడ్జెట్ సమర్పించే సమయాన్ని ఉదయం 11 గంటలకు మార్చారు. అప్పటినుంచి అదే సమయం కొనసాగుతోంది.

'చివరి తేదీ'కి స్వస్తి

సాధారణంగా ఫిబ్రవరి చివరి రోజున కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టేవారు. దీనివల్ల కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం (ఏప్రిల్ 1) నాటికి నిధులు అందుబాటులోకి రావడంలో జాప్యం చోటుచేసుకునేది. 2017లో ఈ సంప్రదాయానికి స్వస్తి చెబుతూ నాటి కేంద్ర మంత్రి జైట్లీ ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టడం ప్రారంభించారు.

భద్రంగా బడ్జెట్ పత్రాలు

1950లో ఆర్థిక మంత్రి జాన్ మత్తాయ్ హయాంలో బడ్జెట్ పత్రాలు లీక్ అయిన తర్వాత వీటి ముద్రణను రాష్ట్రపతి భవన్ నుంచి మింటో రోడ్‌కు మార్చారు. 1980లో ఆర్థిక శాఖ కేంద్రంగా ఉన్న నార్త్ బ్లాక్‌లో ప్రభుత్వ ప్రెస్‌ను ఏర్పాటు చేసి, అక్కడే బడ్జెట్‌ను ముద్రిస్తున్నారు. లీకేజీలను నిరోధించడానికి ఫోన్ ట్యాపింగ్, నిఘా, ఎలక్ట్రానిక్ స్వీప్ వంటి పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు.

18,650 పదాలతో బడ్జెట్

1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వంలో నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ 18,650 పదాలతో బడ్జెట్ ప్రసంగం చేశారు. పదాల పరంగా ఇదే అతి సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం. ఎక్కువగా ఆర్థిక సరళీకరణ విధానాలను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించారు. 2018లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన ప్రసంగం 18,604 పదాలతో రెండో స్థానంలో నిలిచింది. అప్పట్లో జైట్లీ 1 గంట 49 నిమిషాలపాటు మాట్లాడారు. ఇక 1977లో అప్పటి ఆర్థిక మంత్రి హీరూభాయ్ ముల్జీభాయ్ పటేల్ కేవలం 800 పదాలతో బడ్జెట్ ప్రసంగాన్ని ముగించారు. ఇప్పటి వరకూ ఇదే అతి చిన్న బడ్జెట్ ప్రసంగంగా నిలిచింది.

కీలక శాఖలు.. కేటాయింపులు (రూ. కోట్లలో)





ఆరోగ్యం
90,958



మహిళ,శిశు సంక్షేమం
26,092



రోడ్డు రవాణా
2,78,000



ఎరువుల శాఖ
1,68,500



కమ్యూనికేషన్స్
1,37,293



వ్యవసాయం
1,32,470



విద్య
1,20,628



హోంశాఖ
2,19,643


నిర్మల గారి బడ్జెట్

వివరం రూ. కోట్లలో	2022-23 (వా. గ.)	2023-24 (బ.అం.)	2023-24 (వా. గ.) ప్రాథమికం	2024-25 (బ.అం.)
1) రెవెన్యూ వసూళ్లు	23,83,206	26,32,281	27,28,412	31,29,200
ఎ)పన్ను ఆదాయం	20,97,786	23,30,631	23,26,524	25,83,499
బి) పన్నేతర ఆదాయం	2,85,421	3,01,650	4,01,888	5,45,701
2) మూలధన వసూళ్లు	18,09,951	18,70,816	17,14,130	16,91,312
ఎ) రుణ వసూళ్లు	26,161	23,000	27,338	28,000
బి) ఇతర వసూళ్లు	46,035	61,000	33,122	50,000
సి) రుణాలు	17,37,755	17,86,816	16,53,670	16,13,312
3) మొత్తం వసూళ్లు	41,93,157	45,03,097	44,42,542	48,20,512
4) పథకాలకు వ్యయం	34,53,132	35,02,136	34,94,036	37,09,401
5) పథకేతర వ్యయం	7,40,025	10,00,961	9,48,506	11,11,111
6) మొత్తం వ్యయం	41,93,157	45,03,097	44,42,542	48,20,512
7) రెవెన్యూ లోటు	10,69,926	8,69,855	7,65,624	5,80,201

బ.అం. - బడ్జెట్ అంచనా వా.గ. - వాస్తవ గణాంకాలు

అన్ని వర్గాల శ్రేయస్సుకు అండ!

- పేదల నుంచి రైతుల వరకు అందరినీ బలోపేతం చేసే బడ్జెట్
- కేంద్ర బడ్జెట్‌పై ప్రధాని మోదీ హర్షం



న్యూఢిల్లీ, జూలై 23: కేంద్రంలోని ఎన్డీయే కూటమి 3.0 ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తాజా బడ్జెట్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు గుప్పించారు. అన్ని వర్గాల శ్రేయస్సుకు ఈ బడ్జెట్ గొడుగు పడుతుందన్నారు. దేశంలోని పేదలు, దిగువ మధ్యతరగతి, గ్రామీణులు, రైతులు.. ఇలా అన్ని వర్గాల వారినీ బలోపేతం చేసే దిశగా బడ్జెట్ ఉందన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం ప్రధాని ఓ వీడియో సందేశం ఇచ్చారు. గడిచిన పదేళ్ల కాలంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ నూతన మధ్యతరగతికి మరింత సాధికారతను అందిస్తుందన్నారు. అదేవిధంగా యువతకు అపార అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. విద్య, నైపుణ్యం వంటివి సరికొత్తస్థాయిలో చేరువ అవుతాయన్నారు. ఎంఎస్‌ఎంఈల ద్వారా సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఈ బడ్జెట్ పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. మహిళలకు మరింత వెన్నుదన్నుగా నిలుస్తుందని తెలిపారు. దళితులు, బీసీలు, గిరిజనులను బలోపేతం చేయడమే లక్ష్యంగా బలమైన పథకాలను ఈ బడ్జెట్ అందించిందన్నారు. ముఖ్యంగా నూతన మధ్యతరగతి వర్గాన్ని అన్ని విధాలా ఈ బడ్జెట్ బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక భాగస్వామ్య సహకారానికి ఈ బడ్జెట్ హామీ ఇస్తోందన్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహక పథకం(ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్‌సెంటివ్ స్కీం) దేశంలో మరిన్ని ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహద పడుతుందని వివరించారు. "భారత రక్షణరంగాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. అదేవిధంగా పర్యాటక రంగానికి భారీ ఊతమిచ్చింది. స్టార్టప్‌లు, సృజనాత్మక రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నూతన అవకాశాలను బడ్జెట్ పెంపొందించింది" అని పేర్కొన్నారు.

ప్రజానుకూల.. అభివృద్ధి బడ్జెట్: అమిత్‌షా

కేంద్రబడ్జెట్.. ప్రజానుకూల, అభివృద్ధి బడ్జెట్ అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఆశావహ, నూతన అవకాశాలతో భారత్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు. యువత, మహిళలు, రైతులకు బడ్జెట్ పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు సరికొత్త అవకాశాలు కల్పించిందన్నారు.



కీలకం.. 9 రంగాలు

- మధ్యంతర బడ్జెట్‌లో చెప్పాం.. ఇప్పుడు ప్రణాళిక తీసుకొచ్చాం
- 'అభివృద్ధి కేంద్రాలు'గా నగరాలను తీర్చిదిద్దుతాం
- బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, జూలై 23: తొమ్మిది రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్‌ను రూపొందించామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మంగళవారం పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్మల ఈ వివరాలు వెల్లడించారు. 'వికసిత్ భారత్ కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని మధ్యంతర బడ్జెట్ సందర్భంగా మేం హామీ ఇచ్చాం. ఈ మేరకు అందరికీ అవకాశాలు కల్పన లక్ష్యంగా 9 రంగాలను ప్రాధాన్య రంగాలుగా గుర్తిస్తూ బడ్జెట్‌ను రూపొందించాం' అని తెలిపారు. తదుపరి బడ్జెట్లన్నీ ఈ ప్రాధాన్య రంగాల ఆధారంగానే ఉంటాయన్నారు. ఉద్యోగావకాశాలను శీఘ్రగతిన పెంపొందించటానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని, విధానపరమైన లక్ష్యాల్లో ఇది కూడా ఒక ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు.

నిర్మల చెప్పిన 9 రంగాలివే..

- సాగురంగంలో ఉత్పాదకత
- ఉద్యోగాలు-నైపుణ్య శిక్షణ
- మానవ వనరుల అభివృద్ధి-సామాజిక న్యాయం
- తయారీరంగం-సేవలు
- పట్టణాభివృద్ధి
- ఇంధన భద్రత
- మౌలిక సదుపాయాలు
- ఆవిష్కరణలు
- సంస్కరణలు

మోదీ సారథ్యంపై ప్రజల నమ్మకం

ప్రపంచ ఆర్థిక రంగం విధానపరమైన అనిశ్చితి నుంచి ఇప్పటికీ బయటపడలేకపోతోందని నిర్మల పేర్కొన్నారు. భారత్‌లో మాత్రం ప్రజలు మోదీ సారథ్యంలోని ప్రభుత్వంపై తమ నమ్మకాన్ని మరోమారు చాటిచెప్పారని, వరుసగా మూడోసారి అధికారం అప్పగించారన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం స్థిరంగా ఉందని, నిర్ధారిత లక్ష్యమైన 4 శాతం వైపు వెళ్తోందని తెలిపారు. ఉద్యోగ వర్గాలకు బడ్జెట్‌లో ఊరట కల్పించామని, ఈ మేరకు నూతన పన్ను విధానంలో తీసుకొచ్చిన మార్పుల వల్ల వారికి సగటున రూ.17,500 వరకు అవుతుందని ఆర్థిక మంత్రి తెలిపారు. పింఛనర్లకు కూడా రాయితీ కల్పించామని గుర్తు చేశారు. ఈ నిర్ణయాల వల్ల నాలుగు కోట్ల మంది ఉద్యోగులు, పింఛనుదార్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. వ్యవసాయంలో ఉత్పాదకతను పెంచటానికి ప్రభుత్వం వ్యవసాయ పరిశోధన రంగాన్ని సమగ్రంగా సమీక్షించనుందన్నారు. వాతావరణ పరిస్థితులను తట్టుకొనే వంగడాల అభివృద్ధిపై దృష్టి పెడతామన్నారు. నగరాలు, పట్టణాలను అభివృద్ధి కేంద్రాలుగా మల్చటానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేస్తామని తెలిపారు. కాగా, తాజా బడ్జెట్‌తో కలిపి నిర్మల వరుసగా ఏడుసార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తద్వారా, గతంలో ఆరుసార్లు వరుసగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్ రికార్డును అధిగమించారు.



హల్వా వేడుక

కేంద్ర బడ్జెట్‌కు ముందు హల్వా వేడుక నిర్వహించడం ఆనవాయితీ. కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయం బేస్‌మెంట్‌లో దీనిని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా బడ్జెట్ పత్రాల ముద్రణలో పాలుపంచుకొనే 100 మంది అధికారులు, సిబ్బందికి ఆర్థిక మంత్రి హల్వా వడ్డిస్తారు. వీరందరికీ దాదాపు వారం పాటు నార్త్ బ్లాక్‌లో వసతి కల్పిస్తారు. ఆ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించే అవకాశం కూడా ఉండదు. బడ్జెట్ లీక్ కాకూడదనే ఉద్దేశంతో ఈ జాగ్రత్తలు తీసుకుంటారు.



మొరార్జీ దేశాయ్ @10



అత్యధిక సార్లు బడ్జెట్లు ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరిట ఉంది. ఆయన మొత్తం 10సార్లు బడ్జెట్‌ను సభ ముందు ఉంచారు. ఆ తర్వాత స్థానాల్లో పి. చిదంబరం (9), ప్రణబ్ ముఖర్జీ (8), యశ్వంత్ సిన్హా (8), వైబీ చవాన్ (7), సీడీ దేశ్‌ముఖ్ (7), మన్మోహన్‌సింగ్ (6) ఉన్నారు.

తొలి మహిళ ఇందిర



1971లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఆర్థిక శాఖను కూడా నిర్వహించారు. దేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. 2019లో బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా నిర్మల రికార్డు సృష్టించారు.

ఊరట కాస్తంతే..

వేతన జీవులను అంతగా కరుణించని నిర్మలమ్మ



- కొత్త పన్ను విధానంలోకి మారినవారికి మాత్రమే స్వల్ప ఊరటనిచ్చేలా 5, 10 శాతం పన్ను శ్లాబుల సవరింపు
- కొత్త పన్ను విధానంలో రిటర్నులు దాఖలు చేసేవారికి మాత్రమే ప్రామాణిక తగ్గింపు రూ.75 వేలకు పెంపు

ఆదాయ పన్ను పరిమితిని ఈసారైనా పెంచకపోతారా అని వేయికళ్లతో వేచిచూస్తున్న వేతనజీవులకు, సగటు మధ్యతరగతి వర్గానికి స్వల్ప ఊరటే దక్కింది. కొత్త పన్ను విధానంలో రిటర్నులు సమర్పించేవారికి మాత్రమే.. అది కూడా వార్షికంగా రూ.10 లక్షలు, అంతకు మించి స్థూల ఆదాయం ఉన్నవారికి మాత్రమే పిసరంత ఊరట కల్పించేలా.. ఆర్థిక మంత్రి నిర్మల రెండు శ్లాబులను సవరించారు. కొత్త విధానంలోని 5, 10 శాతం శ్లాబుల్లో చేసిన సవరణల కారణంగా పన్నుచెల్లింపుదారులకు రూ.17,500 దాకా ఊరట కలుగుతుందని ఆమె తెలిపారు. ఈ సవరణల వల్ల.. స్థూల ఆదాయం రూ.10 లక్షలు ఉన్నవారు కట్టాల్సిన పన్ను రూ.10 వేల మేర, రూ.20 లక్షలు ఉన్నవారు కట్టాల్సిన పన్ను రూ.17,500 మేర మాత్రం తగ్గుతుంది. అలాగే.. ఇప్పటిదాకా రూ.50 వేలుగా ఉన్న ప్రామాణిక తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్)ను కొత్తపన్ను విధానంలో రిటర్నులు దాఖలు చేసేవారికి మాత్రం రూ.75 వేలకు పెంచుతున్నట్టు నిర్మల ప్రకటించారు. కుటుంబ పింఛనుదారులకు ప్రస్తుతం రూ.15 వేలుగా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.25 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇక.. ఇప్పటికీ పాత విధానంలో రిటర్నులు దాఖలు చేస్తున్న వారు బడ్జెట్‌లో తమకు ఎలాంటి ఊరటా లభించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ పెరిగిపోతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పాత విధానం శ్లాబులను ఈసారైనా సవరిస్తారని వారంతా భావించారు. కానీ.. 'ఈ ఆర్థిక సంవత్సరంలో మూడింట రెండొంతుల మంది పన్నుచెల్లింపుదారులు కొత్త పన్ను విధానం ఎంచుకున్నారు' అని బడ్జెట్ ప్రసంగంలో తెలిపిన ఆర్థికమంత్రి.. పాత పన్ను విధానంలో ఉన్నవారిని పట్టించుకోకపోవడంతో వారు ఉసూరుమన్నారు. కాగా.. ఆదాయపన్ను చట్టాన్ని మరింత సంక్షిప్తంగా, సులభగ్రాహ్యంగా చేసేందుకు.. ఆర్నెల్లలోగా సమగ్రంగా సమీక్షించనున్నట్టు నిర్మల వెల్లడించారు. దీనివల్ల పన్ను తగాదాలు, వ్యాజ్యాలు తగ్గుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. అలాగే.. రూ.50 లక్షలు అంతకు మించి విలువ కలిగిన స్థిరాస్తుల అమ్మకంపై.. కొనుగోలుదారులకు 1% టీడీఎస్ (మూలం వద్దే పన్నుకోత) వర్తిస్తుందని.. ఒక లావాదేవీలో ఒకరికి మించి అమ్మకందారులు, కొనుగోలుదారులు ఉన్నా కూడా ఈ పన్ను వర్తిస్తుందని నిర్మల తెలిపారు. అదేవిధంగా.. ఆస్తుల అమ్మకంపై ఇన్నాళ్లుగా ఉన్న ఇండెక్సేషన్ లబ్ధిని ఎత్తివేసినట్లు ప్రకటించిన ఆర్థిక మంత్రి.. 12.5% దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను వేయనున్నట్టు తెలిపారు. జాతీయ పింఛను పథకం కింద యజమాని వాటా పరిమితిని ప్రస్తుతం ఉన్న 10 శాతం నుంచి 14 శాతానికి పెంచుకోవడానికి అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. దీనివల్ల ఉద్యోగుల పెన్షన్ నిధి పెరుగుతుందని, ఆమేరకు పన్ను రాయితీ పెరుగుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. అయితే, ఇది కూడా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకున్నవారికి మాత్రమే వర్తిస్తుంది.

కొత్త పన్ను విధానంలో సవరించిన శ్లాబులు ఇలా..

ప్రస్తుత శ్లాబు	పన్ను రేటు	సవరించిన శ్లాబు	పన్ను రేటు
రూ.3 లక్షల వరకూ	0	రూ.3 లక్షల వరకూ	0
రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ	5%	రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ	5%
రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షల వరకూ	10%	రూ.7లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ	10%
రూ.9 లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ	15%	రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ	15%
రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ	20%	రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ	20%
రూ.15 లక్షలకు పైగా	30%	రూ.15 లక్షలకు పైగా	30%

? పాత పన్ను విధానాన్ని తీసేస్తారా

బడ్జెట్ ప్రసంగం అనంతరం ఆర్థికమంత్రి మీడియాతో మాట్లాడినప్పుడు.. 'పాత పన్ను విధానాన్ని తీసేస్తారా?' అని విలేకరులు ఆమెను ప్రశ్నించారు. దీనికి ఆమె.. ఇప్పటికైతే అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదని చెప్పారు. పన్ను విధానాన్ని సులభతరం చేయాలన్నదే తమ ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు.

పాత పన్ను విధానం శ్లాబులు

రూ. 2.5 లక్షల దాకా	0%
రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల దాకా	5%
రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా	20%
రూ. 10 లక్షలకు పైగా	30%

రూ.17,500 ఊరట ఎవరికి?

కొత్త పన్ను విధానంలో శ్లాబుల సవరింపు కారణంగా రూ.17,500 దాకా పన్ను ఊరట లభిస్తుందని నిర్మల తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. కానీ, అది అందరికీ కాదు. ఎంత ఆదాయం ఉన్నవారికి ఎంతమేర ఊరట కలుగుతుందో పరిశీలిస్తే..

స్థూల ఆదాయం రూ.5,50,000

	ఇప్పటిదాకా	ఇకపై
స్టాండర్డ్ డిడక్షన్	-50,000	-75,000
స్థూల ఆదాయం	5,00,000	4,75,000
పన్ను వేయదగ్గ ఆదాయం	5,00,000	4,75,000
పన్ను	10,000	8,750
రిబేటు	-10,000	-8,750

అంటే, వీరు అసలు పన్ను కట్టక్కర్లేదు

స్థూల ఆదాయం రూ.10 లక్షలు

	ఇప్పటిదాకా	ఇకపై
స్టాండర్డ్ డిడక్షన్	-50,000	-75,000
స్థూల ఆదాయం	9,50,000	9,25,000
పన్ను వేయదగ్గ ఆదాయం	9,50,000	9,25,000
పన్ను	52,500	42,500
సుంకం	2,100	1,700
మొత్తం పన్ను	54,600	44,200

అంటే.. శ్లాబులో మార్పు వల్ల రూ.10 లక్షల స్థూల ఆదాయం ఉన్నవారికి సుంకాన్ని కలుపుకోకుంటే రూ.10 వేల దాకా ఊరట లభిస్తుంది. సుంకాన్ని కూడా కలుపుకొంటే.. రూ.10,400 మేర ఊరట లభిస్తుంది.

స్థూల ఆదాయం రూ.20 లక్షలు

	ఇప్పటిదాకా	ఇకపై
స్టాండర్డ్ డిడక్షన్	-50,000	-75,000
స్థూల ఆదాయం	19,50,000	19,25,000
పన్ను వేయదగ్గ ఆదాయం	19,50,000	19,25,000
పన్ను	2,85,000	2,67,500
సుంకం	11,400	10,700
మొత్తం పన్ను	2,96,000	2,78,200

అంటే.. శ్లాబులో మార్పు వల్ల రూ.20 లక్షల స్థూల ఆదాయం ఉన్నవారికి సుంకాలు లేకుండా రూ.17,500 మేర, సుంకాలను కలుపుకొంటే రూ.18,200 మేర ఊరట లభిస్తుంది.



గ్రామీణాభివృద్ధికి 2.66 లక్షల కోట్లు

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కోసం కేంద్రం బడ్జెట్‌లో రూ.2.66 లక్షల కోట్లు కేటాయించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పీఎం ఆవాస్ యోజన కింద అదనంగా మూడు కోట్ల ఇళ్లు నిర్మించనున్నట్లు ప్రకటించింది. గ్రామాల్లో రహదారుల నిర్మాణం కోసం పీఎం గ్రామ సడక్ యోజన నాలుగో దశను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఈ పథకం ద్వారా దాదాపు 25 వేల ఆవాసాలు లబ్ధి పొందుతాయని పేర్కొంది. ఆయా గ్రామాల్లో జనాభా పెరిగినందున అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారులను నిర్మించనున్నట్లు కేంద్ర సర్కారు తెలిపింది.



వరద నివారణ, నీటిపారుదలకు 11,500 కోట్లు

పలు రాష్ట్రాల్లో వరద నివారణ చర్యలు, నీటిపారుదల ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో రూ.11,500 కోట్ల సహాయం ప్రకటించారు. వీటిలో కోసి-మేచి అనుసంధాన ప్రాజెక్టుతోపాటు మరో 20 నిర్మాణంలో ఉన్న బ్యారేజీలు, నదీ కాలుష్య నివారణ ప్రాజెక్టులు, నీటిపారుదల ప్రాజెక్టులు ఉన్నాయి. ఏటా బ్రహ్మపుత్ర, దాని ఉపనదుల కారణంగా వరదలతో సతమతమవుతోన్న అసోం రాష్ట్రానికి వరద నివారణ సంబంధిత ప్రాజెక్టులకు సహాయం అందుతుంది. అలాగే వరదలు, భారీ వర్షాలతో సతమతమయిన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాల్లో పునర్నిర్మాణ, పునరావాస కార్యక్రమాలకు సహాయం చేయనున్నట్లు ఆర్థిక మంత్రి చెప్పారు.



కోటి ఇళ్లకు సౌర విద్యుత్ వెలుగులు

పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద ఒక కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. మరోపక్క, అణువిద్యుత్ రంగంలో తొలిసారి ప్రైవేటు పెట్టుబడులకు ఆహ్వానం పలికింది. చిన్నపాటి అణు విద్యుత్ రియాక్టర్ల(ఎస్ఎంఆర్) ఏర్పాటు, అభివృద్ధి అంశంలో ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యం కానుంది. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాన్ని తీసుకువస్తామని ప్రకటించింది.



పరిశోధన, ఆవిష్కరణల్లో మరింత ప్రైవేటు భాగస్వామ్యం

న్యూఢిల్లీ, జూలై 23: పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని మరింతగా ఆహ్వానిస్తున్నట్టు నిర్మల పేర్కొన్నారు. ప్రాథమిక పరిశోధన, నమూనా అభివృద్ధిలకు అనుసంధాన్ జాతీయ పరిశోధన నిధి ద్వారా కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి పేర్కొన్నారు. దీనికిగాను రూ.లక్ష కోట్లతో ఆర్థిక సాయం అందించేందుకు ప్రత్యేక విధానాన్ని ప్రకటిస్తామని తెలిపారు. మధ్యంతర బడ్జెట్‌లోనే దీనికి సంబంధించిన ప్రకటన చేశామని వివరించారు. రానున్న పదేళ్లలో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ఐదు రెట్లు విస్తరించాలనే లక్ష్యంతో ఉన్నామని, దీనికిగాను వెంచర్ క్యాపిటల్ ఫండ్ కింద రూ.1000 కోట్లతో నిధిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వరాలు.. కోతలు

విద్యారంగానికి 1.20 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కొన్ని వరాలు ప్రకటించడంతో పాటు కోతలు కూడా పెట్టారు. గత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనా కంటే ఈ ఏడాది దాదాపు రూ.9,000 కోట్లు కోత పెట్టారు. 2024-25కు విద్యా రంగానికి మొత్తం రూ.1.20 లక్షల కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలో 1.29 లక్షల కోట్లు ఉండటం గమనార్హం. ఈ ఏడాది పాఠశాల విద్యకు రూ.535 కోట్ల నిధులు ఎక్కువగా కేటాయించగా, ఉన్నత విద్య గ్రాంట్‌లో రూ.9,600 కోట్లు తగ్గించారు. దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య చదివేందుకు విద్యార్థులకు రూ.10 లక్షల వరకు రుణాలు అందించనున్నట్టు ప్రకటించారు. కాగా ఉన్నత విద్య నియంత్రణ మండలి యూజీసీకి 60 శాతానికి పైగా నిధులు తగ్గించారు. దేశంలో ప్రతిష్ఠాత్మక బిజినెస్ స్కూల్స్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లకు వరుసగా రెండో ఏడాది బడ్జెట్‌లోనూ కేటాయింపులు తగ్గించారు. పాఠశాల విద్యతో పాటు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఎన్‌సీఈఆర్‌టీ, పీఎం శ్రీ స్కూళ్లు, రాష్ట్రాలు-కేంద్ర పాలిత ప్రాంతాలకు గ్రాంట్ల కేటాయింపులు పెంచారు. దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక సాయం చేయనున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ పథకాలు, పాలసీల కింద ఎలాంటి లబ్ధి పొందని యువతకు రుణాలు అందజేయనున్నట్టు తెలిపారు.




కేటాయింపులు ఇలా...

- గత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాతో పోలిస్తే... ప్రపంచ స్థాయి సంస్థలకు నిధులు రూ.1300 కోట్ల నుంచి రూ.1800 కోట్లకు పెంపు
- విద్యా సంస్థల్లో పరిశోధనలు, ఆవిష్కరణల కోసం రూ.161 కోట్లు పెంపు
- యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కు 6,409 కోట్ల నుంచి రూ.2,500 కోట్లకు నిధుల తగ్గింపు
- ఐఐఎంలకు రూ.331 కోట్ల నుంచి రూ.212 కోట్లకు కేటాయింపులు తగ్గింపు
- ఐఐటీలకు రూ.10,384 కోట్ల నుంచి రూ.10,324 కోట్లకు స్వల్పంగా తగ్గింపు
- కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు 28 శాతం నిధుల పెరుగుదల. రూ.12,000 కోట్ల నుంచి 15,472 కోట్లకు పెంపు

1000 ఐటీఐల అప్‌గ్రేడ్

స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు 1000 పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐ)ను అప్‌గ్రేడ్ చేయనున్నట్టు ప్రకటించారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా కొత్త కోర్సులు ప్రవేశ పెట్టనున్నారు. గత ఐదేళ్లలో 20 లక్షల మంది యువత స్కిల్ డెవలప్‌మెంట్ పథకంలో శిక్షణ పొందినట్టు తెలిపారు. మోడల్ స్కిల్ లోన్ పథకం కింద ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలను రూ.7.5 లక్షలకు పెంచామని, ఈ పథకం వల్ల ఏటా 25 వేలమంది లబ్ధిపొందుతారని ప్రకటించారు.



కాపీకొట్టినందుకు చాలా సంతోషం



"కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 30వ పేజీలో పేర్కొన్న ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్‌సెంటివ్ కార్యక్రమాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒంటబట్టించుకుని బడ్జెట్‌లో చేర్చారు. అలాగే పేజీ 11లో పేర్కొన్న అప్రెంటిస్‌షిప్ పథకాన్ని కూడా మక్కీకి మక్కీ దించేశారు. అలాగే 31వ పేజీలో పేర్కొన్న 'ఏంజిల్ ట్యాక్స్ రద్దు'ను కూడా కాపీ కొట్టారు. చాలా సంతోషం"

\- కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం

"ఈ బడ్జెట్ దేశాభివృద్ధికి సంబంధించింది కాదు. మోదీ ప్రభుత్వాన్ని పరిరక్షించుకునే బడ్జెట్. ఇది కాపీ బడ్జెట్. మా న్యాయపత్రను కాపీ కొట్టారు. అది కూడా సరిగా కాపీ కొట్టలేకపోయారనిపిస్తోంది"

\- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా




మహిళలకు మరింత ప్రోత్సాహం



బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్ల కేటాయింపు

న్యూఢిల్లీ, జూలై 23: దేశ ఆర్థిక అభివృద్ధిలో మహిళల పాత్రను మరింతగా పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా మహిళలు, బాలికలను ప్రోత్సహించేందుకు 2024-25 బడ్జెట్‌లో వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా రూ.3 లక్షల కోట్లకు పైగా కేటాయించింది. ఇందులో.. మహిళా, శిశు అభివృద్ధి (డబ్ల్యూసీడీ) మంత్రిత్వ శాఖకు రూ.26,092 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో ఈ శాఖకు రూ.25,448 కోట్లు కేటాయించింది. ఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్ కోసం ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేసి.. వివిధ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకోనుంది. దీంతోపాటు మహిళల సంక్షేమం, సాధికారతకు సంబంధించి సక్షమ్ అంగన్వాడీ పోషణ్ 2.0, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పథకాలను కొనసాగించాలని నిర్ణయించింది. శిశువులు, కౌమార బాలికలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ఉద్దేశించిన సక్షమ్ అంగన్వాడీ 2.0 పథకానికి బడ్జెట్‌లో కేంద్రం రూ.21,200 కోట్లు కేటాయించింది. ఇక శిశు సంక్షేమం, భద్రతకు సంబంధించి మిషన్ వాత్సల్య పథకం కింద చేపట్టే కార్యక్రమాలకు కోసం రూ.1,472 కోట్ల కేటాయింపులు జరిపింది. కాగా, మహిళా సాధికారత లక్ష్యంగా చేపట్టే 'మిషన్ శక్తి'ని సంబల్, సామర్థ్య పథకాలుగా విభజించి అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకుగాను ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.3,145 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది. సంబల్ పథకం కింద.. బేటీ బచావో-బేటీ పఢావో, మహిళల భద్రతకు సంబంధించిన వన్ స్టాప్ సెంటర్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు. వీటికోసం రూ.629 కోట్లను వినియోగించనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇక సామర్థ్య పథకం కింద ఉమెన్ హాస్టళ్లతోపాటు స్వధార్ గృహ, ప్రధాన మంత్రి వందన వంటి కార్యక్రమాలు చేపడతారు. ఇందుకు రూ.2,516 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.2,325 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇవే కాకుండా.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపీసీసీడీ)కి, సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ (సీఏఆర్ఏ)కి కూడా నిధుల కేటాయింపును పెంచారు. ఇందులో.. శిశు అభివృద్ధికి సంబంధించి పరిశోధన, శిక్షణ కార్యక్రమాలు చేపట్టే ఎన్ఐపీసీసీడీకి రూ.88.87 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కాగా, బాలల దత్తతపై పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యతలు నిర్వర్తించే సీఏఆర్ఏకు రూ.11.40 కోట్లు వినియోగించనున్నట్లు పేర్కొంది. ఇక మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన నిర్భయ నిధికి రూ.500 కోట్లు కేటాయించింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పనిచేసే యునిసెఫ్‌కు భారత్ భాగస్వామ్యంగా రూ.5.60 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది.



'రక్షణ'కు 6.21 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగానికి రూ.6.21 లక్షల కోట్లు కేటాయించారు. ఇది బడ్జెట్‌లో 12.9 శాతం. గత ఏడాది రూ.5.94 లక్షల కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో రక్షణ రంగానికి అత్యధిక కేటాయింపులు... సైనిక దళాల సామర్థ్యం పెంపుదలకు దోహదపడుతుందని ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. సరిహద్దుల్లో రోడ్ల నిర్మాణానికి గత ఏడాది కంటే 30 శాతం అదనంగా కేటాయించారని తెలిపారు. కేంద్ర హోం శాఖకు రూ.2.19 లక్షల కోట్లు కేటాయించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కేంద్రం చేతుల్లో ఉన్న జమ్మూ కశ్మీర్‌కు రూ.42,277 కోట్లు కేటాయించారు.

జవానుకు అండదండ (రూ. కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు
2024-25	4,54,773
2023-24	4,32,720
2022-23	3,99,123





ఏ రాష్ట్రంపై వివక్ష లేదు

మేము ఏ రాష్ట్రంపై వివక్ష చూపలేదు. ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించారన్న విమర్శలు సరికాదు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు వడ్డీ లేకుండా 50 ఏళ్ల కాలంలో చెల్లించేటట్లు రూ. 1.5లక్షల కోట్లు కేటాయించాం. బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావన లేనంత మాత్రాన బెంగాల్‌కు అన్యాయం చేసినట్లు కాదు. పూర్వోదయ పథకంలో పశ్చిమ బెంగాల్, బిహార్, ఝార్ఖండ్, ఒడిసా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని ప్రకటించాం.

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్



ఆంధ్రా, బిహార్ ప్రత్యేక బడ్జెట్‌లా ఉంది


ఇది కేంద్ర బడ్జెట్‌లా లేదు. ఆంధ్రప్రదేశ్, బిహార్‌కు సంబంధించిన ప్రత్యేక బడ్జెట్‌లా ఉంది. ఈ వ్యవహారం ఆంధ్రా, బిహార్‌తో కుదుర్చుకున్న ఉమ్మడి ఒప్పందంలా ఉంది. ఈ బడ్జెట్‌లో తమిళనాడుకు మొండిచేయి చూపిన కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 27వ తేదీన జరుగనున్న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తాం. 'ఇండియా' కూటమిని గెలిపించడం వల్లే తమిళనాడు ప్రజలపై కేంద్రపాలకులు కక్ష కట్టినట్లు అనిపిస్తోంది.

- తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



ప్రతి ఒక్కరిపై రూ.1.18 లక్షల అప్పు!

2024 మార్చి 31 నాటికి దేశం అప్పు 1,68,72, 554 కోట్లుగా ఉంది. అయితే అప్పటికి భారతదేశ జనాభా 142 కోట్లు అనుకుంటే ... ఒక్కో వ్యక్తిపై సుమారు రూ.1.18 లక్షలు అప్పు ఉన్నట్టు ఓ అంచనా



ఏపీ హ్యాపీ..



కేంద్ర బడ్జెట్‌లో ఆపన్న హస్తం

ఐదేళ్ల తర్వాత తొలిసారి వరాల జల్లు.. అమరావతికి ఆర్థిక సాయం

- ఈ ఏడాది రూ.15 వేల కోట్లు.. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు
- సాధ్యమైనంత త్వరగా పోలవరంపూర్తి.. నిర్మాణానికి పూర్తిస్థాయిలో సొమ్ములు
- పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు.. విశాఖ ఉక్కుకు రూ.620 కోట్లు..
- కేంద్ర పన్నులు, సుంకాల్లో వాటా 50,474 కోట్లు

ఐదేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో 'ఆంధ్రప్రదేశ్' అన్న మాటే గట్టిగా వినిపించలేదు! నాడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ సర్కారూ పట్టించుకోలేదు. ఇన్నాళ్లకు, ఇన్నేళ్లకు తొలిసారిగా కేంద్ర బడ్జెట్‌లో 'ఆంధ్రప్రదేశ్' మాట మార్మోగింది. ఎప్పుడో అటకెక్కించిన 'రాష్ట్ర పునర్విభజన చట్టం'... రాష్ట్ర విభజన జరిగిన పదేళ్లకు మళ్లీ లోక్‌సభలో తెరపైకి వచ్చింది. నవ్యాంధ్రకు రెండు కళ్లలాంటి రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఆర్థిక అభయం లభించింది. మొత్తంగా చూస్తే... ఐదేళ్లలో తొలిసారిగా కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు ఆనందాన్ని పంచింది.

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం మిత్రధర్మాన్ని చాటుకుంది. కేంద్రంలో ప్రభుత్వ మనుగడకు టీడీపీ-జనసేన మద్దతే కీలకం కావడంతో.. తాజా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంపై వరాల జల్లు కురిపించింది. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇబ్బడిముబ్బడిగా సాయం అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రకటించారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే కర్తవ్యంలో భాగంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధానంగా రాష్ట్రానికి రాజధాని ఉండాల్సిన అవసరాన్ని గుర్తించామన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. వివిధ అభివృద్ధి ఏజెన్సీల ద్వారా ఈ ఏడాదే ఈ నిధులు అందిస్తామని చెప్పారు. రానున్న సంవత్సరాల్లో అదనపు నిధులు కూడా సమకూరుస్తామన్నారు.

కేంద్ర సంస్థలకు నిధులు


రాష్ట్రంలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ), గిరిజన విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ), సొసైటీ ఫర్ అప్లైడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-రీసెర్చ్ (సమీర్), ఇండియన్ స్ట్రాటెజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్(ఐఎస్‌పీఆర్ఎల్), విశాఖ పోర్టు ట్రస్టు, విశాఖ ఉక్కు కర్మాగారం, హిందూస్థాన్ షిప్ యార్డ్ తదితర కేంద్ర సంస్థలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో భాగంగా గుర్తించాలని నిర్ణయించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.620 కోట్లు, విశాఖ పోర్టు ట్రస్టుకు రూ.150 కోట్లు, పెట్రోలియం ఎనర్జీ సంస్థకు రూ.168 కోట్లు కేటాయించారు. ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షా యోజన కింద దేశంలోని అన్ని ఎయిమ్స్‌లకూ కలిపి రూ.2,200 కోట్లు కేటాయించారు. ఇందులో నుంచి మంగళగిరి ఎయిమ్స్‌కు కూడా నిధులు అందుతాయి.

రాష్ట్రానికి పన్నులు, సుంకాల వాటా ఇదీ

2024-25 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర పన్నులు, సుంకాల్లో రూ.50,474.64 కోట్ల వాటా లభిస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. మొత్తం పన్నులు, సుంకాల్లో ఏపీ వాటా 4.047%. కార్పొరేషన్ ట్యాక్స్ రూపేణా రూ.15,156.51 కోట్లు, ఆదాయ పన్ను-రూ.17,455.93 కోట్లు, కేంద్ర జీఎస్టీ-రూ.15,079.39 కోట్లు, కస్టమ్స్-రూ.2,228.46 కోట్లు, ఎక్సైజ్-రూ.469.73 కోట్లు, సర్వీస్ ట్యాక్స్-రూ.1.66 కోట్లు, ఇతర పన్నులు, సుంకాల రూపేణా రూ.82.96 కోట్లు లభిస్తాయి.

మరిన్ని వరాలు

- వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లా అభివృద్ధికి విభజన చట్టం ప్రకారం గ్రాంట్లు మంజూరు చేస్తాం.
- పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించడానికి విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని కొప్పర్తి నోడ్, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లోని ఓర్వకల్లు నోడ్‌లో నీరు, విద్యుత్, రైల్వే వంటి మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేస్తాం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మూలధన పెట్టుబడుల కోసం ఈ ఏడాది అదనపు కేటాయింపులు చేస్తాం.
- తూర్పున ఉన్న రాష్ట్రాలు బలమైన సంస్కృతీ సంప్రదాయాలు కలిగి ఉన్నాయి. బిహార్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిసాలను కలుపుతూ తూర్పు ప్రాంతం సర్వతోముఖాభివృద్ధికి 'పూర్వోదయ' ప్రణాళిక రూపొందిస్తాం.



పోలవరానికి వరం

పోలవరం ప్రాజెక్టు పూర్తికి సంపూర్ణ సహకారం అందిస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. "ఆంధ్రప్రదేశ్‌కు, ఆ రాష్ట్ర రైతులకు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందించడానికి.. త్వరగా పూర్తిచేయడానికి కేంద్రం కట్టుబడి ఉంది. ఈ ప్రాజెక్టు దేశ ఆహార భద్రతను పెంచుతుంది" అని ఆమె ప్రకటించారు. అలాగే.. వనరుల కొరత రాకుండా వివిధ రాష్ట్రాలకు రూ.లక్షన్నర కోట్ల మేర దీర్ఘకాలిక వడ్డీ లేని రుణాలను కల్పిస్తామని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. రాష్ట్రానికి విదేశీ రుణ సాయం లభిస్తున్న 'ఆంధ్రప్రదేశ్ రోడ్లు-వంతెనల నిర్మాణ ప్రాజెక్టు', గ్రామీణ రహదారుల ప్రాజెక్టు (రూ.150 కోట్లు), నీటిపారుదల, జీవనోపాధి మెరుగుదల ప్రాజెక్టు రెండోదశ (రూ.300 కోట్లు), అభ్యాస్ పరివర్తన్ ప్రాజెక్టు (రూ.300 కోట్లు) గురించి కూడా నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రస్తావించారు.

మైనర్ల కోసం

'ఎన్‌పీఎస్ వాత్సల్య' పథకం

- బడ్జెట్‌లో నూతన జాతీయ పెన్షన్ పథకం ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో భాగంగా మైనర్ల కోసం 'ఎన్‌పీఎస్ వాత్సల్య' పేరుతో నూతన జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్)ను ప్రకటించారు. దీని ద్వారా తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లల భవిష్యత్తు భద్రత కోసం పెన్షన్‌ను ముందుగానే ప్లాన్ చేసుకోవచ్చు. ఈ పెన్షన్ కోసం తల్లిదండ్రులు నిధులు సమకూర్చవచ్చు. పిల్లలు మేజర్లయిన తర్వాత అంటే 18 ఏళ్లవయసు రాగానే ఇది సాధారణ ఎన్‌పీఎస్‌గా మారుతుంది. అప్పుడు దాన్ని పిల్లలకు బదిలీ చేస్తారు. సాధారణ ఎన్‌పీఎస్ ప్లాన్లుగా మారాక యుక్తవయసు వారు తమ పొదుపు అలవాటును కొనసాగించే అవకాశం ఏర్పడుతుంది. ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. వ్యక్తులు రిటైర్‌మెంట్ తర్వాత తమ అవసరాల కోసం పెన్షన్ రూపంలో ఆదాయాన్ని పొందడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్‌ను ఇప్పటికే ప్రవేశ పెట్టింది. పీఎఫ్ఆర్‌డీఏ చట్టం 2013 కింద ఎన్‌పీఎస్ నియంత్రణ, నిర్వహణను పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) చూసుకుంటుంది. 18 నుంచి 70 ఏళ్ల వయసున్న వారు ఎన్‌పీఎస్ ఖాతాను ప్రారంభించవచ్చు. కాగా మైనర్ల కోసం పెన్షన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టడాన్ని బాలలహక్కుల సంస్థలు స్వాగతించాయి. దీని ద్వారా సుస్థిర భవిష్యత్తు కోసం ముందుగానే ఆర్థిక ప్రణాళికను ఇది ప్రోత్సహిస్తుందని పేర్కొన్నాయి. అలాగే పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, విద్యకు కేటాయింపులను పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వడ్డీ చెల్లింపులు

2022-23 (వా.గ)	9,28,517
2023-24 (వా.గ)	10,63,871
2024-25 (బ.అం)	11,62,940

రూ. కోట్లలో



బ.అం. - బడ్జెట్ అంచనా
వా.గ. - వాస్తవ గణాంకాలు

మైనారిటీ వ్యవహారాలకు నిధుల పెంపు

న్యూఢిల్లీ, జూలై 23: మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు ఈ ఏడాది రూ. 3,183.24 కోట్ల నిధులను కేటాయించారు. 2023- 24 బడ్జెట్‌లో ఈ శాఖకు రూ. 2,608.93 కోట్లు కేటాయించగా తాజాగా రూ. 574.31 కోట్లు పెంచారు. వీటిలో 1,575.72 కోట్లు మైనారిటీల విద్యాభివృద్ధికి, రూ.326.16 కోట్లు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు, రూ. 1,145.38 కోట్లు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం కేటాయించారు. మొత్తంగా రూ.2,120.72 కోట్ల నిధులను మైనారిటీల కోసం ప్రతిపాదించిన ప్రధాన పథకాల, ప్రాజెక్టుల అమలు కోసం, ప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమం కోసం రూ. 910.90 కోట్లను కేటాయించారు. జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఆర్థిక కార్పొరేషన్‌కు రూ. 800 కోట్లను కేటాయించారు.

పెరిగేవి



టెలికాం పరికరాలు



ప్లాస్టిక్ ఉత్పత్తులు



ల్యాబొరెటరీల్లో వాడే రసాయనాలు

తగ్గేవి



మొబైల్ ఫోన్లు, మొబైల్ చార్జర్లు, బ్యాటరీలు



బంగారం, వెండి, ప్లాటినం



చేపలు, రొయ్యల మేత



తోలు చెప్పులు, బెల్టులు, ఇతర తోలు ఉత్పత్తులు



సోలార్ ప్యానెళ్లు

క్యాన్సర్ ఔషధాలు, ఎక్స్‌రే పరికరాలు



బిహార్‌కు బొనాంజా



బడ్జెట్‌లో 26 వేల కోట్ల కేటాయింపు

న్యూఢిల్లీ, జూలై 23: ఎన్డీయేలో కీలక భాగస్వామి జేడీయూ డిమాండ్ చేసినా బిహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేందుకు నిరాకరించిన మోదీ ప్రభుత్వం.. కేంద్ర బడ్జెట్‌లో ఆ రాష్ట్రానికి భారీ సాయం ప్రకటించింది. రాష్ట్రంలో వివిధ రోడ్డు ప్రాజెక్టులకు రూ.26 వేల కోట్లు కేటాయించింది. పట్నా-పూర్ణియా ఎక్స్‌ప్రెస్‌వే, బక్సర్-భాగల్పూర్ హైవే, బోధ్‌గయ-రాజ్‌గిర్-వైశాలి-దర్భంగా హైవే, బక్సర్ వద్ద గంగానదిపై రెండు వరుసల వంతెన నిర్మాణం వీటిలో ఉన్నాయి. బిహార్, జార్ఖండ్, బెంగాల్, ఒడిసాల సర్వతోముఖాభివృద్ధికి 'పూర్వోదయ' ప్రణాళికకు రూపకల్పన చేయనున్నారు. అమృతసర్-కోల్‌కతా పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా బిహార్‌లోని గయలో పారిశ్రామికవాడ అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. అలాగే ఆ రాష్ట్రంలో విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు నెలకొల్పుతుంది. క్రీడల మౌలిక వసతులను అభివృద్ధి చేస్తుంది. ఏటా లక్ష మంది విద్యార్థులకు కేంద్రం నేరుగా 3 శాతం వడ్డీ రాయితీతో ఈ-వోచర్ రూపంలో రుణాలు ఇస్తుంది. రాష్ట్ర పర్యాటక రంగానికి పెద్దఎత్తున ఊతమివ్వనుంది. గయలోని విష్ణుపాద ఆలయ కారిడార్, మహాబోధి ఆలయ కారిడార్‌లను ప్రపంచ యాత్రా-పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనుంది. ప్రాచీన నగరాలైన రాజగృహ (రాజ్‌గిర్), నలంద పూర్వవైభవానికి ప్రణాళికలు రూపొందిస్తారు. అతిప్రాచీనమైన నలంద విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరిస్తారు. కాగా.. బిహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ ఇటీవల ప్రత్యేక హోదా డిమాండ్‌ను గట్టిగా వినిపించారు. మరో మిత్రపక్షం ఎల్‌జేపీ (రాంవిలాస్) నాయకుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ కూడా సమర్థించారు. కేంద్రం కుదరదని స్పష్టం చేసింది. 2012లో యూపీఏ ప్రభుత్వ హయాంలో అంతర్‌మంత్రిత్వ బృందం బిహార్‌కు హోదా డిమాండ్‌ను పరిశీలించిందని.. జాతీయాభివృద్ధి మండలి (ఎన్‌డీసీ) నిబంధనల ప్రకారం హోదా ఇవ్వడం కుదరదని సోమవారమే లోక్‌సభలో ప్రకటించింది. దీనిపై నితీశ్ రాజీనామా చేయాలని మాజీ సీఎం, ఆర్‌జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. అయితే బడ్జెట్‌లో భారీ కేటాయింపులతో నితీశ్, జేడీయూలను మోదీ ప్రభుత్వం సంతృప్తిపరచిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

మాకు ప్రత్యేక సాయం: నితీశ్

కేంద్ర బడ్జెట్ బిహార్ సమస్యలకు పరిష్కారం చూపిందని సీఎం నితీశ్ అన్నారు. 'మాకున్న సమస్యల వల్లే ప్రత్యేక హోదా డిమాండ్ చేశాం. సాంకేతిక కారణాలతో హోదా ఇవ్వలేకపోతే.. ప్రత్యేక సాయం ఇవ్వాలని కోరాం. బడ్జెట్‌లో ఇప్పుడదే ప్రకటించారు' అని తెలిపారు. బడ్జెట్‌పై సంతృప్తిగా ఉన్నారా అని ప్రశ్నించగా.. అవునని బదులిచ్చారు.

అంకెల్లో బడ్జెట్!

బడ్జెట్ అంటేనే బ్రహ్మ పదార్థం. అంకెల గారడీ.. లెక్కల తిప్పలు. ఆర్థికవేత్తలు రేయింబవళ్లు శ్రమించి రూపొందించిన ఆ అంకెలను అర్థం చేసుకోవడం కొంచెం కష్టమే..! అందుకే కేంద్ర బడ్జెట్‌లోని కీలకమైన అంకెలకు సంబంధించిన సమగ్ర వివరాలు మీ కోసం..

మొత్తం బడ్జెట్ 48.21 (అంకెలు రూ.లక్షల కోట్లలో)

- నికర పన్ను రాబడి 25.84
- పన్నేతర రాబడి 5.46
- మూలధన వసూళ్లు 16.91
- పథకాలపై వ్యయం 20.22
  - కేంద్ర ప్రాయోజిత పథకాలపై 5.06
  - కేంద్ర పథకాలపై 15.16
- ఇతరత్రా వ్యయం 27.99
  - రాష్ట్రాలకు బదలాయింపులు 5.24
  - ఇతరత్రా కేంద్ర వ్యయం 14.91
  - జీతభత్యాలు, పింఛన్లకు 7.84





యుగానికి ఒక్కటి..



సరళీకరణకు నాంది పలుకుతూ పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ 1991లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను యుగానికి (ఎపికల్) ఒక బడ్జెట్‌గా పిలుస్తున్నారు. దేశంలో లైసెన్స్ రాజ్‌కు ఆ బడ్జెట్ ముగింపు పలికింది. దేశ ఆర్థిక వ్యవస్థ పతనావస్థలో ఉన్న సమయంలో ఆ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.



బడ్జెట్‌కు ఎరుపు రంగే ఎందుకు?



కేంద్ర బడ్జెట్ పత్రాలను ఆర్థిక మంత్రి ఎర్ర సూట్‌కేస్‌లో తీసుకురావడం బ్రిటిష్ పాలన కాలం నుంచి సంప్రదాయంగా వస్తోంది. 2019లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆ సంప్రదాయానికి ఆధునికతను జోడించి, సూట్‌కేసు స్థానంలో ఎర్రని పౌచ్ రూపంలో ఉండే 'బహీ-ఖతా'లో బడ్జెట్ పత్రాలను తీసుకురావడం ప్రారంభించారు. సాధారణంగా మతగ్రంథాలు ఎరుపు రంగులో ఉంటాయనే ఉద్దేశంతోనే బడ్జెట్ ప్రకటనలకు సంస్కృతిని జోడించే ఉద్దేశంతో ఎరుపు రంగుకు ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన ఉంది.



జల వనరులు, గంగానది సంరక్షణ పథకానికి 55 % నిధుల పెంపు

కేంద్ర బడ్జెట్‌లో నదుల సంరక్షణకు నిధులను పెంచారు. జల వనరుల విభాగానికి, నదుల అభివృద్ధి, గంగానది సంరక్షణ పథకానికి(నమామి గంగే) గత ఏడాదితో పోల్చితే 55 శాతం నిధులు పెంచారు. వీటికి గత ఏడాది రూ.19,516 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.30,233.83 కోట్లు కేటాయించారు. వీటిలో నమామి గంగే మిషన్-2 కింద 3,345.70 కోట్లు కేటాయించారు. 2023-24లో ఈ పథకానికి కేటాయించింది రూ.2,400 కోట్లు మాత్రమే. అంతేకాకుండా నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు, అటల్ భూజల్ యోజన పథకాలకు నిధులను పెంచారు. భూగర్భ జలాల వృద్ధికి ఉద్దేశించిన అటల్ భూజల్ యోజనకు రూ.1,778 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి కేటాయించింది రూ.1000 కోట్లే. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టుకు రూ.661.20 కోట్లు కేటాయించారు. పలు కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా నిధులు కేటాయించారు. ప్రధాన్ మంత్రి క్రిషి సించాయ్ యోజనకు రూ.9,339.37 కోట్లు కేటాయించారు. జాతీయ నదుల సంరక్షణ పథకానికి రూ.592.11 కోట్లు కేటాయించారు.

భవిష్య నిధితో ఉద్యోగ కల్పన

కొత్త కొలువుల సృష్టికి 3 పథకాలు.. ఈపీఎఫ్‌వో ద్వారా అమలు.. రూ.1.07 లక్షల కోట్లు కేటాయింపు

కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి ఒక నెల వేతనం బోనస్

» గరిష్ఠంగా రూ.15 వేలు.. 3 వాయిదాల్లో చెల్లింపు

న్యూఢిల్లీ, జూలై 23: ఉద్యోగ కల్పనకు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ద్వారా మూడు కొత్త పథకాలను అమలు చేస్తామని ప్రకటించింది. దీని కోసం రూ.1.07 లక్షల కోట్లను కేటాయించనుంది. 'ప్రధానమంత్రి ప్యాకేజీ' అనే పేరు కింద ఉద్యోగ కల్పన ప్రోత్సాహకాల రూపంలో ఈ మూడు పథకాలను అమలు చేయనున్నారు. మొదటిది.. సంఘటిత రంగంలోని పరిశ్రమలు, సంస్థల్లో కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి ఒక నెల వేతనాన్ని (గరిష్ఠంగా రూ.15 వేలు) మూడు వాయిదాల్లో చెల్లిస్తారు. ప్రత్యక్ష నగదు బదిలీ విధానం కింద ఉద్యోగి ఈపీఎఫ్ ఖాతాలో ఈ మొత్తాన్ని జమచేస్తారు. దీని వల్ల 2.10 కోట్ల మంది యువత లబ్ధి పొందనుందని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించారు. ఇక రెండో పథకం కింద, తయారీ రంగంలో ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించనుంది. ఉద్యోగంలో చేరిన తొలి నాలుగేళ్లలో సదరు ఉద్యోగి, సంస్థ యాజమాన్యం ఈపీఎఫ్ఓలో చేసే చెల్లింపులను బట్టి.. ఉద్యోగికి, సంస్థకు ప్రోత్సాహకాలు అందజేస్తారు. దీనిద్వారా కొత్తగా ఉద్యోగాల్లో చేరే 30 లక్షల మంది యువతీ యువకులకు, వారు పనిచేసే సంస్థలకు ప్రయోజనం చేకూరనుందని ఆర్థికమంత్రి తెలిపారు. మూడో పథకం కింద, అదనంగా ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించనున్నారు. అదనంగా తీసుకునే ఒక్కో ఉద్యోగికి ఈపీఎఫ్ఓలో యాజమాన్యం జమ చేసే మొత్తం నుంచి నెలకు గరిష్ఠంగా రూ.3 వేల చొప్పున రెండేళ్ల పాటు తిరిగి చెల్లిస్తారు (రీయింబర్స్‌మెంట్). దీని వల్ల 50 లక్షల అదనపు ఉద్యోగాల సృష్టి జరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కాగా, ఈ మూడు పథకాలూ నెలకు గరిష్ఠంగా రూ.లక్ష లోపు వేతనం ఉన్న వారందరికీ వర్తిస్తాయి. వీటి అమలుకు ప్రభుత్వం విడివిడిగానే బడ్జెట్ కేటాయించింది. తొలి పథకానికి రూ.23,000 కోట్లు, రెండో పథకానికి రూ.52,000 కోట్లు, మూడో పథకానికి రూ.32,000 కోట్లు.. మొత్తంగా 1.07 లక్షల కోట్లను కేటాయించింది.



మేలో రికార్డు స్థాయిలో ఈపీఎఫ్‌లో చేరికలు

ఈ ఏడాది మే నెలలో ఈపీఎఫ్‌వోలో రికార్డు స్థాయిలో 19.50 లక్షల మంది సభ్యులు కొత్తగా చేరారు. 2018 నుంచి ఇదే అత్యధికం. ఏటా సగటున ఈపీఎఫ్‌వోలో 19.62 శాతం వృద్ధి నమోదవుతోంది. ఉద్యోగావకాశాల్లో పెరుగుదల, ఉద్యోగులకు లభిస్తున్న ప్రయోజనాల పట్ల పెరుగుతున్న అవగాహన, ఈపీఎఫ్‌వో ప్రచార కార్యక్రమాలు తదితర కారణాల వల్లే ఈపీఎఫ్‌లో సభ్యుల సంఖ్య వృద్ధి చెందుతున్నట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, మే నెలలో చేరిన కొత్త సభ్యుల్లో 58.37 శాతం మంది 18-25 ఏళ్లలోపు యువత కావటం విశేషం.

నైపుణ్య శిక్షణ

ఉద్యోగార్థులకు ఉద్యోగావకాశాలు, నైపుణ్య శిక్షణ తదితర అంశాల్లో మార్గనిర్దేశనం చేసేలా ఈ-శ్రమ్ పోర్టల్‌ను ఇతర పోర్టళ్లతో అనుసంధానించనున్నారు. ఉద్యోగ మార్కెట్‌లో వేగంగా సంభవిస్తున్న మార్పులు, అవసరమైన నైపుణ్యాలు, అందుబాటులో ఉన్న ఉద్యోగాలు, కంపెనీలను ఉద్యోగార్థులను అనుసంధానించే ప్రక్రియలు, నైపుణ్య శిక్షణ సంస్థలు తదితర సేవలు ఒకే వేదిక నుంచి లభించేలా చర్యలు తీసుకుంటారు. శ్రమ్ సువిధ, సమాధాన్ పోర్టళ్లను మెరుగుపరుస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. పరిశ్రమలతో కలిసి మహిళా హాస్టళ్లను, శిశుసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలకు ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ, స్వయంసహాయక సంఘాలకు మార్కెట్ అవకాశాలను పెంచటం వంటి వాటిపై దృష్టి పెడతామని తెలిపారు.

కీలక పథకాలకు కేటాయింపులు

(రూ. కోట్లలో)

పథకం	కేటాయింపు
గరీబ్ కల్యాణ్ అన్న యోజన	2,05,250
ఉపాధి హామీ పథకం	86,000
ప్రధానమంత్రి ఆవాస్ యోజన	84,671
జల్ జీవన్ మిషన్	70,163
కిసాన్ సమ్మాన్ నిధి	60,000
జాతీయ ఆరోగ్యమిషన్- అర్బన్	28,783
సమగ్ర శిక్ష	37,500
గ్రామ సడక్ యోజన	19,000
పంటల భీమా పథకం	14,600
స్వచ్ఛ భారత్	12,192
ఆయుష్మాన్ భారత్	7,300
నదుల అనుసంధానం	4,000



క్యాన్సర్ రోగులకు ఊరట

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం దక్కింది. ఆరోగ్య శాఖకు రూ.90,958.63 కోట్ల నిధులు కేటాయించారు. గత ఏడాది కేటాయించిన రూ.80,517.62 కోట్లతో పోలిస్తే ఇది 12.93% అధికం కావడం విశేషం. అలాగే క్యాన్సర్ రోగులకు ఊరటనిచ్చేలా కీలకమైన మూడు ఔషధాల (ట్రాస్టుజుమాబ్ డెరక్స్‌టికాన్, ఒసిమెర్టినిబ్, దర్వాలుమాబ్)పై కస్టమ్స్ డ్యూటీని 10% నుంచి సున్నాకు తగ్గించారు. 'క్యాన్సర్ రోగులకు ఉపశమనం కలిగించేందుకు వీలుగా మూడు రకాల క్యాన్సర్ ఔషధాలపై కస్టమ్స్ సుంకాన్ని పూర్తిగా మినహాయిస్తున్నాం. అలాగే ఎక్స్‌రే యంత్రాల్లో వినియోగించే ఎక్స్‌రే ట్యూబ్‌లు, ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్లపై కస్టమ్స్ డ్యూటీలో కూడా మార్పులను ప్రతిపాదిస్తున్నాం' అని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఆరోగ్య రంగానికి కేటాయించిన రూ.90,958.63 కోట్లలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.87,656.90 కోట్లు, ఆరోగ్య పరిశోధనలకు రూ.3,301.73 కోట్లు కేటాయించినట్టు ఆమె పేర్కొన్నారు. ఇంకా ఏ ఏ శాఖలకు ఎంతెంత నిధులు కేటాయించారంటే..

- ఆయుష్ మంత్రిత్వ శాఖకు రూ.3,712.49 కోట్లను కేటాయించారు.
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని పథకాలకు గతంలో ఉన్న రూ.77,624.79 కోట్లను.. ఈ సారి రూ.87,656.90 కోట్లకు పెంచారు.
- కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల్లో నేషనల్ హెల్త్ మిషన్‌కు రూ.31,550.87 కోట్లను ఈ ఏడాది రూ.36,000 కోట్లకు పెంచారు.
- ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకానికి కూడా కేటాయింపులు రూ.6,800 కోట్ల నుంచి రూ.7,300 కోట్లకు పెంచారు.
- నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ కార్యక్రమానికి రూ.65 కోట్ల నుంచి రూ.90 కోట్లకు పెంచారు.
- నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్ కార్యక్రమానికి రూ.200 కోట్లు.
- స్వయం ప్రతిపత్తి సంస్థలకు గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.17,250.90 కోట్లను రూ.18,013.62 కోట్లకు పెంచారు. ఇందులో ఢిల్లీలోని ఎయిమ్స్‌కు రూ.4,523 కోట్లు కేటాయించారు.

పట్టణాలకు మహర్దశ!

పట్టణవాసులపై వరాలవర్షం

- బడ్జెట్ 9 ప్రాథమ్యాల్లో పట్టణానికీ చోటు
- అదనంగా మూడు కోట్ల ఇళ్లు మంజూరు
- ఐదేళ్లలో రూ.10లక్షల కోట్లతో నిర్మాణం
- అందుబాటు అద్దెతో బాడుగ ఇళ్లు



న్యూఢిల్లీ, జూలై 23: పట్టణాలకు బడ్జెట్‌లో కేంద్రం మహర్దశ పట్టించింది. 2014-25 బడ్జెట్ తొమ్మిది ప్రాధామ్యాల్లో ఒకటిగా పట్టణాభివృద్ధిని కేంద్రం ప్రకటించింది. అందుకు తగినట్టే.. పట్టణ గృహస్థులపై వరాల వర్షం కురిపించింది. అధిక జనాభా నివసించే రద్దీ నగరాలకు రవాణా అనేది పెద్ద సంకటం. దీంతో అతి పెద్ద నగరాలను రవాణాపరంగా పరుగులు పెట్టించాలని కేంద్రం నిర్ణయించింది. 30 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాలను దీని కోసం ఎంపిక చేస్తారు. వాటిలోంచి 14 సిటీలను ఎంపిక చేసుకుని వాటికి రవాణా హంగులు అద్దుతారు. గ్రోత్ హబ్‌లుగానూ ఈ నగరాలను తీర్చిదిద్దుతారు. టౌన్ ప్లానింగ్ పథకాలను పట్టణ పొలిమేర ప్రాంతాల అభివృద్ధికి సద్వినియోగం చేసుకుంటామని కూడా కేంద్రం పేర్కొంది. అలాగే, అదనంగా మూడుకోట్ల పట్టణ గృహాలను వచ్చే ఐదేళ్లలో నిర్మిస్తామని తెలిపింది. దీనికోసం బడ్జెట్‌లో రూ.10 లక్షల కోట్లను ప్రతిపాదించింది. పట్టణాల్లో గృహ నిర్మాణం కోసం ప్రజలు వడ్డీ రాయితీపై తీసుకునే రుణాల రేటు హేతుబద్ధంగా ఉండేలా చూస్తామని తెలిపింది. అందరికీ అద్దె నివాసాలు సమకూరేలా, వాటిపై వసూలు చేస్తున్న బాడుగను ఖరారు చేస్తామని బడ్జెట్‌లో తెలిపారు. పారిశ్రామిక కూలీలు తలదాచుకునే డార్మెటరీలను పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం) పద్ధతిలో మరిన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. అలాగే, వారాంతాల్లో ప్రజల అల్పాహార అవసరాలను తీర్చేలా ఒక వంద వీక్లీ స్ట్రీట్ ఫుడ్ హబ్‌లను ఎంపిక చేసిన నగరాల్లో నెలకొల్పుతామని వెల్లడించారు. పట్టణాలకు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణకు బడ్జెట్‌లో నిర్దిష్ట కార్యాచరణను ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, బహుళ అభివృద్ధి బ్యాంకుల సాయంతో దీనిపై బృహత్తర ప్రాజెక్టులను చేపడతామని హామీ ఇచ్చారు. బ్యాంకులు కేంద్రంగా వంద పెద్ద నగరాల్లో వీటిని నెలకొల్పుతామని తెలిపారు.

మహిళలు కొనే ఆస్తులపై అత్యల్ప స్టాంప్ డ్యూటీ

కొన్ని రాష్ట్రాలు ఆస్తుల కొనుగోలుపై భారీ స్టాంప్ డ్యూటీ వేస్తున్నాయని కేంద్రం తెలిపింది. ఆ డ్యూటీని రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సవరిస్తామని పేర్కొంది. ముఖ్యంగా, మహిళలు కొనుగోలు చేసే ఆస్తులపై అతి తక్కువ స్టాంప్ డ్యూటీ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపింది. పట్టణ అభివృద్ధి స్కీమ్‌ల్లో ఈ ప్రతిపాదనకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చింది. దీనివల్ల పట్టణాల్లో ఆస్తుల కొనుగోలు ధర పడిపోతుందని 'కొలియర్స్ ఇండియా' అనే గృహ సేవలు అందించే సంస్థ ఎండీ రవిశంకర్ సింగ్ అభిప్రాయపడ్డారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 'భూ ఆధార్' ప్రక్రియకు విశిష్ట సంఖ్యను కేటాయించే ప్రతిపాదన ఉన్నదని కేంద్రం తెలిపింది.

భూరికార్డుల డిజిటలైజేషన్‌కు ఊపు

బడ్జెట్‌లో నిర్దేశించిన 9 ప్రాధామ్యాల్లో పట్టణాభివృద్ధి ఒకటి అని కేంద్రం స్పష్టం చేసింది. పట్టణ ప్రజల సొంతింటి కలకు ప్రభుత్వం మద్దతు ఇస్తుందని భరోసా ఇచ్చింది. ఈ క్రమంలో ఎదురయ్యే అన్ని సవాళ్లను అధిమిస్తామని పేర్కొంది. భూసంబంధ సంస్కరణల్లో భాగంగా పట్టణ భూరికార్డులకు జీఐఎస్ మ్యాపింగ్ విధానంలో డిజిటలైజేషన్ చేపడతామని తెలిపింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అదనంగా మూడు కోట్ల గృహాలను రూ.10 లక్షల కోట్ల అంచనాతో నిర్మిస్తామని తెలిపింది. బ్యాంకులకు తలనొప్పిగా మారిన రుణాల ఎగవేత సమస్యను నియంత్రించడానికి దేశవ్యాప్తంగా కొత్తగా మరికొన్ని ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించింది.

బడ్జెట్‌లో కేంద్రం సబ్సిడీల కోసం రూ. మొత్తంగా 3,81,175 కోట్ల కేటాయింపులు చేసింది. పెట్రో ఉత్పత్తులకు 2023-24 బడ్జెట్‌లో రూ. 12,240 కోట్లు కేటాయించగా తాజాగా రూ. 11,925 కోట్లను కేటాయించారు. ఆహారానికి గతేడాది బడ్జెట్‌లో రూ. 2,12,332 కోట్లు కేటాయించగా ఈ ఏడాది 2,05,250 కోట్లు కేటాయించారు. ఎరువులకు పోయిన బడ్జెట్‌లో 1,88,894 కోట్లు కేటాయించగా తాజాగా 1,64,000 కోట్లు కేటాయించారు.

సబ్సిడీలు ఇలా

(రూ. కోట్లలో)



	పెట్రో ఉత్పత్తులు	ఆహారం	ఎరువులు
2022-23	6,817	2,72,802	2,51,339
2023-24	12,240	2,12,332	1,88,894
2024-25	11,925	2,05,250	1,64,000

1.52 లక్షల కోట్లతో.. వ్యవసాయానికి భారీ ఊతం



కూరగాయల సాగుకు భారీ క్లస్టర్లు

వ్యవసాయానికి కేంద్రం ఊతమందించే చర్యలను ప్రకటించింది. మధ్యంతర బడ్జెట్‌లో చెప్పిన పథకాలను కొనసాగిస్తూనే.. కొత్త విధానాలను ప్రకటించింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లను కేటాయించింది. ముఖ్యంగా.. కూరగాయల సాగుకు భారీ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. కూరగాయల సేకరణ, నిల్వ, మార్కెటింగ్‌కు సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు స్టార్టప్‌లు, సహకార సంఘాలు, రైతు సంఘాలను ప్రోత్సహించనున్నట్లు వెల్లడించింది. వాతావరణ మార్పులను తట్టుకునేలా 32 వ్యవసాయ, ఉద్యాన కేటగిరీలకు చెందిన 109 రకాల అధిక దిగుబడి వంగడాలను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా అధిక దిగుబడి వంగడాలను అందజేస్తామని పేర్కొంది. ప్రతికూల వాతావరణాన్ని కూడా తట్టుకుని, అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాల దిశగా పరిశోధనలను ప్రోత్సహించనున్నట్లు తెలిపింది. రానున్న రెండేళ్లలో కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలోకి వచ్చేలా ప్రోత్సహించి, వారి ఉత్పత్తులకు బ్రాండింగ్, సర్టిఫికేషన్ ఇస్తామని పేర్కొంది. ఈ విధానాన్ని శాస్త్రసాంకేతిక సంస్థలు, గ్రామ పంచాయతీల ద్వారా అమలు చేస్తామని, 10 వేల బయో-ఇన్‌పుట్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. పప్పు ధాన్యాలు, నూనెగింజల సాగులో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా.. ప్రత్యేక వ్యూహంతో వాటి ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్‌ను బలోపేతం చేయనున్నట్లు వివరించింది. రొయ్యల సాగు కేంద్రాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి, నాబార్డ్ ద్వారా ప్రత్యేక ఆర్థిక సాయం అందజేస్తామని స్పష్టం చేసింది. ఐదు రాష్ట్రాల్లోని రైతులకు జన్ సమర్థ్ ఆధారిత కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేస్తామని వెల్లడించింది. వ్యవసాయంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాను ప్రోత్సహిస్తామని, ఖరీఫ్ సీజన్‌లో 400 జిల్లాల్లో డిజిటల్ క్రాప్ సర్వేను నిర్వహిస్తామని ప్రకటించింది.

కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీకి నిరాశ!

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కాజీపేటలో ప్రతిపాదించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి నిరాశే ఎదురైంది. కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టును ప్రస్తావించకపోవడం తెలంగాణ ప్రజలను నిరాశపరిచింది. రాష్ట్రంలో ఇతర రైల్వే ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. రూ.770 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన భద్రాచలం రోడ్-డోర్నకల్ మధ్య 54.65 కి.మీ డబ్లింగ్ పనులకు రూ.100 కోట్లు కేటాయించారు. కాజీపేట-విజయవాడ మూడో లైన్‌కు రూ.310 కోట్లు, కాజీపేట-బల్లార్షా మూడో లైన్‌కు 300 కోట్లు, బీబీ నగర్-గుంటూరు-ముద్ఖేడ్ డబ్లింగ్ పనులకు రూ.220 కోట్లు, బీబీ నగర్-గుంటూరు డబ్లింగ్ పనులకు 200 కోట్లు కేటాయించారు.

రైల్వేకు రూ.2.62 లక్షల కోట్లు

కవచ్ ఏర్పాటుకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రైల్వే శాఖకు రూ.2.62 లక్షల కోట్లు కేటాయించారు. నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో కేవలం ఒక్కసారి మాత్రమే రైల్వే అనే మాటను పలికారు. కీలక ప్రకటనలు లేవు. కొత్త రైళ్ల ఊసు లేదు. తర్వాత ఈ కేటాయింపులపై రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ విలేకరులతో మాట్లాడారు. రూ.1.09 లక్షల కోట్లను భద్రతా చర్యల కోసం వెచ్చిస్తామని చెప్పారు. వీటిలో రైలు ప్రమాదాల నివారణకు 'కవచ్' వ్యవస్థ ఏర్పాటుకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని తెలిపారు. పాత ట్రాక్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు, సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపడతామన్నారు. 2014కు ముందు రైల్వేకు కేటాయింపులు రూ.35 వేల కోట్లు మాత్రమేనని, మోదీ హయాంలో అది రూ.2.62 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. మొత్తం 12,500 జనరల్ కోచ్‌లను తయారుచేస్తామని, వీటికి బడ్జెట్‌లో కేటాయింపులు చేశామని ఆయన చెప్పారు.



రాజకీయ ప్రేరేపిత బడ్జెట్

» తెలంగాణను పూర్తిగా విస్మరించిన కేంద్రం: ఉత్తమ్

» బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రాన్ని నిలదీయాలి: జూపల్లి



హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ పూర్తిగా రాజకీయ ప్రేరేపితంగా ఉందని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ ప్రజల కోసం కాకుండా.. దాని మిత్రపక్షాలు, జేడీయూ, టీడీపీలను ప్రసన్నం చేసుకునేందుకే బడ్జెట్‌ను రూపొందించినట్లుగా ఉందన్నారు. బడ్జెట్‌లో తెలంగాణను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి బీజేపీ తరఫున ఇద్దరు కేంద్ర మంత్రులు సహా ఎనిమిది మంది ఎంపీలున్నా.. తెలంగాణకు తగిన వాటాను సాధించడంలో విఫలమయ్యారని అన్నారు. కాగా, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రాన్ని నిలదీయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మోదీ ప్రధాని అయినప్పటినుంచీ తెలంగాణపై వివక్ష చూపుతున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం స్వశక్తితో అభివృద్ధి చెందుతుండడం మోదీ ప్రభుత్వానికి కంటగింపుగా మారిందన్నారు. మరోవైపు, మోదీ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్.. కేవలం రెండు రాష్ట్రాల బడ్జెట్‌లా ఉందని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

నేటి నుంచి పార్లమెంటులో కాంగ్రెస్ నిరసనలు

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు మోదీ ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందని కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఏపీ, బిహార్‌కే నిధులు కేటాయించడాన్ని చూస్తే కుర్చీ బచావో బడ్జెట్‌లా కనిపిస్తోందన్నారు. రాష్ట్రానికి నిధులు సాధించేవరకు లోక్‌సభలో గళమెత్తుతామని ప్రకటించారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, బలరాంనాయక్, రఘువీర్‌రెడ్డి, గడ్డం వంశీకృష్ణ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని పార్లమెంటులో ప్రశ్నించేందుకు తమతోపాటు బీజేపీ ఎంపీలు, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ కలిసిరావాలని పిలుపునిచ్చారు. 'జస్టిస్ ఫర్ తెలంగాణ' పేరుతో నిరసనలు చేపడతామన్నారు.

తెలంగాణకు గుండు సున్నా



హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు దక్కింది శూన్యమని, కొన్ని రాష్ట్రాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలుగువారి కోడలు నిర్మలాసీతారామన్‌పై పెట్టుకున్న ఆశ నిరాశే అయిందన్నారు. పునర్విభజన హామీలు అమలు చేయడం లేదని, ములుగు యూనివర్సిటీకి అదనపు నిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలన్న ప్రతిపాదనను విస్మరించారని విమర్శించారు. ఏపీ, బిహార్‌కు దక్కిన నిధులను బట్టి చూస్తే స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలకు చెరో 8 ఎంపీ సీట్లు ఇస్తే.. కేంద్ర బడ్జెట్‌లో గాడిద గుడ్డు ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావనే లేదని, చూస్తుంటే.. ఈ రెండు పార్టీలు కలిసి రాష్ట్రానికి అన్యాయం చేసినట్లుందని ఆరోపించారు. తెలంగాణలోని 9 వెనుకబడిన జిల్లాలకు నిధులపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు చొరవ చూపలేదని నిలదీశారు. ఇదిలా ఉండగా, కేంద్రం మరోసారి బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచెయ్యి చూపిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి అన్నారు. దీనిపై రాజ్యసభలో నిలదీస్తామన్నారు.

బీజేపీ ఎంపీలు బాధ్యత వహించాలి: సీపీఐ

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని, ఇందుకు తెలంగాణ బీజేపీ ఎంపీలు బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి గుణపాఠం చెబుతారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హెచ్చరించారు. వ్యవసాయ రంగానికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు. కాగా, కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తి రంగాల ప్రాధాన్యాన్ని తగ్గించడంతోపాటు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.

సింగరేణికి రూ.1,600 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో భాగంగా సింగరేణికి రూ.1,600 కోట్లు, మిధానికి రూ.60 కోట్లు, ఐఐటీకి రూ.122 కోట్లు కేటాయించారు. సాలార్‌జంగ్ మ్యూజియానికి రూ.కోటి మేరకు నిధులు కేటాయించారు. తెలంగాణలోని గిరిజన విశ్వవిద్యాలయాన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో భాగంగా వ్యవహరిస్తారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే పింఛన్లలో భాగంగా తెలంగాణ విమోచన పోరాటంలో పాల్గొన్న వారికి పింఛన్లు చెల్లించేందుకు నిధులు కేటాయించారు. వీటితోపాటు హైదరాబాద్‌లో ఉన్న పలు కేంద్ర సంస్థలకు నిధులు కేటాయించారు.

మైనారిటీ గురుకులాల్లో వెబ్ ఆప్షన్లు రద్దు

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ గురుకులాల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో ముగియగా.. మైనార్టీ గురుకులంలో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఇందులో ఆన్‌లైన్‌లో జరగాల్సిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియ అంతా నిలిపివేసి.. ఆఫ్‌లైన్‌లో ప్రారంభించారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఇప్పటికే ఉపాధ్యాయుల నుంచి వెబ్ ఆప్షన్లను స్వీకరించారు. అయితే అందులో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఒకే ఖాళీని ఇద్దరు, ముగ్గురికి కేటాయించడం, ఆప్షన్ల ప్రకారం కాకుండా భిన్నంగా పోస్టింగులు ఇవ్వడంతో కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. దీనిపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తిగా నిలిపివేసి.. ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ మళ్లీ మొదటినుంచి ప్రారంభించారు. తొలిరోజు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతులు, టీజీటీలకు బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయడంతో పారదర్శకత లోపిస్తుందని, పైరవీలకు అవకాశం ఏర్పడుతుందని అభ్యర్థులు వాపోతున్నారు.

స్టాఫ్‌నర్స్ సీనియారిటీ జాబితాలో అవకతవకలు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్‌నర్స్ సీనియారిటీ జాబితా రూపొందించడంలో అవకతవకలు జరిగాయని స్వయంగా రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులే అంగీకరించారు. కొందరు నర్సింగ్ ఆఫీస్ బేరర్లతో వైద్య సంస్థల సిబ్బంది కుమ్మక్కు అయి.. వాస్తవ జాబితాను దాచిపెట్టి, నామినల్ జాబితాను కౌన్సెలింగ్ కోసం ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయానికి పంపించారని తేలింది. ఇందుకు కారకులైన వారికి డీహెచ్ రవీంద్రనాయక్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులందుకున్న వారిలో హన్మకొండలోని కేఎంసీ, జీఎంహెచ్, టీబీ చెస్ట్, నర్సింగ్ కాలేజీల సిబ్బంది ఉన్నారు. జంటనగరాల్లో గాంధీ, ఉస్మానియా, ఈఎన్‌టీ, ఫీవర్, సరోజిని కంటి ఆస్పత్రి, టీబీ, చెస్ట్, డీఎంహెచ్ సుల్తాన్‌బజార్, డెంటల్ కాలేజీ, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీలు, అలాగే వరంగల్‌లోని నర్సింగ్ కాలేజీ, ఎంజీఎం, ఆర్‌ఈహెచ్ ఆస్పత్రుల సిబ్బంది ఉన్నారు.

కుర్చీ బచావో బడ్జెట్

కుర్చీ కాపాడుకునేందుకు మోదీ ఏపీ, బిహార్లకు నిధులు ఇచ్చారు

ఇది క్విడ్ ప్రోకో.. ప్రధానికి గౌరవం కాదు



» బడ్జెట్‌లో తెలంగాణ పదమే లేదు

» తెలంగాణ మీద ఇంతటి కక్ష ఎందుకు?

» తెలంగాణ ప్రజలు మీకు 8 సీట్లిచ్చారు

» సీట్లు కావాలిగానీ.. అభివృద్ధి వద్దా?

» కిషన్‌రెడ్డి మంత్రి పదవికి రిజైన్ చేయాలి

» ఇదే వివక్ష కొనసాగిస్తే తెలంగాణలో బీజేపీకి నూకలు చెల్లుతాయ్

» కేంద్ర బడ్జెట్‌పై సీఎం రేవంత్ నిప్పులు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్రం పట్ల మోదీ సర్కారు కక్షపూరితంగా వ్యవహరించిందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే వివక్షతో వ్యవహరిస్తే ఇక తెలంగాణలో బీజేపీకి నూకలు చెల్లుతాయని హెచ్చరించారు. ప్రధానమంత్రి తన కుర్చీని కాపాడుకునేందుకు ఏపీ, బిహార్‌కు మాత్రమే నిధులు కేటాయించారని పేర్కొంటూ.. కేంద్ర బడ్జెట్‌ను 'కుర్చీబచావో' బడ్జెట్‌గా అభివర్ణించారు. ఇది పూర్తిగా క్విడ్‌ప్రోకో విధానంలా ఉందని, ఇలాంటి చర్యలు ప్రధానికి గౌరవాన్ని తెచ్చిపెట్టవన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌పై నిప్పులు చెరిగారు. 'బడ్జెట్ సారాంశాన్ని చూస్తే తెలంగాణ అనే పదాన్ని నిషేధించినట్లు ఉంది. అసలు ఆ పదాన్ని పలకడానికి కూడా కేంద్రం ఇష్టపడటం లేదని తెలుస్తోంది. రాష్ట్రాభివృద్ధికి నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రిగా నేను మూడు సార్లు, మంత్రులు 18 సార్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, కేంద్రంలోని మంత్రులను కలిశాం. కేంద్రంతో వివాదాలు లేకుండా సత్సంబంధాలు కొనసాగించాలని, ప్రధాని రాష్ట్రానికి వచ్చిన సమయంలో పెద్దన్నలా వ్యవహరించాలని కోరాం. కానీ, ఈ విజ్ఞప్తులను ఏమాత్రం పట్టించుకోలేదు. బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. కేంద్రం తెలంగాణ పట్ల కక్షపూరితంగా వ్యవహరించింది. ఇక్కడి ప్రజల మీద వివక్ష ఎందుకు? ఇంతటి కక్షపూరిత వైఖరిని, వివక్షను ఎన్నడూ చూడలేదు' అని రేవంత్ పేర్కొన్నారు. 10వ బడ్జెట్ సమయంలో మోదీ రాష్ట్ర విభజనపై మాట్లాడుతూ.. తల్లిని చంపి పిల్లను బతికించారని అన్నప్పుడే ఆయనకు తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేదని తెలిసినా, ప్రధాని మనసులో తమపై ఇంతటి కక్ష గూడుకట్టుకొని ఉందని తెలంగాణ ప్రజలు అనుకోలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి నిధులు కేటాయించిన కేంద్రం, అదే చట్టం ప్రకారం తెలంగాణకు ఎందుకు నిధులు ఇవ్వలేదని సీఎం ప్రశ్నించారు. ఏపీలో రాజధాని అమరావతికి, పోలవరం ప్రాజెక్టుకు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు చేసినప్పుడు.. తెలంగాణలో విభజన హామీలైన బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఖాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల, ములుగు గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఎందుకు నిధులు ఇవ్వలేదని నిలదీశారు. ఏపీకి ఎందుకిచ్చారని తాము అడగటం లేదని.. తెలంగాణపై ఎందుకు ఇంత వివక్ష చూపుతున్నారన్నదే తమ ఆవేదన అని రేవంత్‌రెడ్డి తెలిపారు. గంగానది ప్రక్షాళనకు, గుజరాత్‌లో సబర్మతి తీర ప్రాంత అభివృద్ధికి నిధులు ఇచ్చిన కేంద్రం తెలంగాణలో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి, రీజినల్ రింగు రోడ్డుకు, హైదరాబాద్ మెట్రోకు, ఐటీఐఆర్ కారిడార్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు.

సబ్ కా వికాస్ బోగస్

రూ.48.21 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణ పట్ల చూపిన వివక్షతో బీజేపీ ప్రచారం చేసుకుంటున్న 'సబ్ కా వికాస్' అనేది బోగస్ అని రుజువైందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీని 8 స్థానాల్లో గెలిపించారని, బీజేపీకి ఈ ప్రాంత ఓట్లు, సీట్లు కావాలేగానీ తెలంగాణ అభివృద్ధి పట్టదని దుయ్యబట్టారు. తెలంగాణ బిడ్డగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, మోదీ క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డికి ఏ మాత్రం ఆత్మగౌరవం ఉన్నా.. తెలంగాణకు జరిగిన అన్యాయంపై నిరసనగా తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. మూడు రోజుల క్రితం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుంచి ఒక లేఖ వచ్చిందని, తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు వీలు కాదని ఆ లేఖలో తెలిపారన్నారు. ఐఐఎం ఇవ్వబోమని కేంద్రం చెప్పినా.. కిషన్‌రెడ్డి మోదీ క్యాబినెట్‌లో ఎందుకు కొనసాగాలని ప్రశ్నించారు. మంత్రి పదవి కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని మోదీ వద్ద తాకట్టు పెట్టొద్దన్నారు. తెలంగాణ హక్కుల కోసం పార్లమెంట్‌లో కాంగ్రెస్ నిరసన తెలుపుతుందన్నారు. తెలంగాణపై మోదీ కక్షపూరిత వైఖరిని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. విభజన చట్టం కేవలం ఏపీకే కాదని.. తెలంగాణకు కూడా వర్తిస్తుందనీ సీఎం గుర్తు చేశారు. బడ్జెట్‌ను సవరించే సమయంలోనైనా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలంగాణకు నిధులు కేటాయించాలని కోరారు. ఇదే వివక్ష కొనసాగితే తెలంగాణలో బీజేపీకి నూకలు చెల్లినట్లేనన్నారు.

శాసనసభలో తీర్మానం చేస్తాం

కేంద్రం తెలంగాణ పట్ల చూపిన వివక్షపై అసెంబ్లీలో చర్చ చేపడతామని, తీర్మానం చేసి తమ నిరసనను కేంద్రానికి తెలియజేస్తామని సీఎం వెల్లడించారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల పక్షాన నిలుస్తాయో, కేంద్రానికి బానిసలుగా ఉంటాయో తేల్చుకోవాలన్నారు. పార్లమెంట్‌లో చేపట్టే నిరసనకు బీజేపీ ఎంపీలు కలిసి రావాలన్నారు. దక్షిణాదిపై కేంద్రం వివక్ష చూపుతోందని, త్వరలోనే దక్షిణాది సీఎంలతో సమావేశం అవుతానని చెప్పారు. ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక సీఎంలకు లేఖ రాశానని, ఏపీ, కేరళ, పుదుచ్చేరి సీఎంలు కూడా కలిసి వస్తే మంచిదన్నారు. విలేకర్ల సమావేశంలో మంత్రులు రాజనర్సింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి పాల్గొన్నారు.

ఇది సమతుల్య బడ్జెట్



ఇది సమతుల్య బడ్జెట్.. ఆత్మనిర్భర భారత్ నిర్మాణమే లక్ష్యంగా బడ్జెట్ ప్రతిపాదనలున్నాయి. దేశీయ ఉత్పత్తిని పెంపొందించడానికి, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వారికి పన్ను ఆదా ప్రకటించారు. వీధి వ్యాపారుల నుంచి మొదలు రైతులు, పారిశ్రామికవేత్తల వరకు అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. 4 కోట్ల మంది యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రతిపాదనలు చేసింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ.1.5 లక్షల కోట్లు బడ్జెట్‌లో పెట్టాం. మహిళలు, బాలికలకు లబ్ధి చేకూర్చే పథకాలకు రూ.3 లక్షల కోట్ల మేర ప్రతిపాదనలున్నాయి. పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కల్పించేలా.. పన్ను స్లాబ్‌లను కేంద్రం మార్చింది. పెరిగిన స్టాండర్డ్ డిడక్షన్ ద్వారా 4 కోట్ల మందికి మేలు జరగనుంది. నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్‌ను ప్రారంభించడం ఖనిజ రంగంలో చేపట్టిన అతిపెద్ద సంస్కరణ.

– కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి

తెలంగాణకు ప్రాధాన్యం



ఇది దేశ హిత బడ్జెట్.. నాగలికి రెండు ఎడ్ల మాదిరిగా సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం ప్రతిబింబించే బడ్జెట్ ఇది.. దేశ ఉజ్వల భవిష్యత్తుకు ప్రతీకగా ఉంది. 2047 నాటికి ఆర్థిక ప్రగతిలో భారత్‌ను నంబర్ వన్‌గా చూడాలనే ప్రధాని మోదీ కలను సాకారం చేసే దిశగా బడ్జెట్ రూపొందించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ప్రాధాన్యతనిచ్చాం. అయినా రాష్ట్రానికి నిధులివ్వలేదనడం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మూర్ఖత్వం, అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. తెలంగాణ సహా దేశంలో వెనుకబడిన 150 జిల్లాల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించబోతోంది. శాఖల వారీగా బడ్జెట్‌లో ఈ అంశంపై స్పష్టత వస్తుంది. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో 210 కి.మీ.ల తెలంగాణలో భాగమేననే విషయం తెలియదా? బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ సాధ్యం కాదని నిపుణులు తేల్చిన సంగతి మర్చిపోయారా? రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చే అంశాన్ని పొందుపర్చనిది మీరు కాదా? పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతలు మీడియా ప్రకటనలకే పరిమితమయ్యారే తప్ప కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకు జాతీయ హోదా కోసం ప్రయత్నం చేయలేదు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

తెలంగాణకు నిల్

» గిరిజన వర్సిటీకి నిధుల్లేవు, ఐఐఎం మాటెత్తలేదు

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి మొండిచెయ్యి చూపింది. రాష్ట్ర సర్కారు కోరిన ఏ ఒక్కదానికీ ప్రత్యేక గ్రాంట్లను మంజూరు చేయలేదు. పలుసార్లు చేసిన డిమాండ్లను పెడచెవిన పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, ఇతర మంత్రులు.. ప్రధాని మోదీ, ఇతర కేంద్ర మంత్రులను కలిసి చేసిన విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసింది. గ్రాంట్లు కాదుగదా.. విభజన చట్టం మేరకు ఇచ్చి హామీలను సైతం ప్రస్తావించలేదు. అసలు బడ్జెట్‌లో తెలంగాణ పదాన్ని ఉచ్చరించకపోవడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు, బీజేపీ మినహా ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించిన కేంద్రం.. తెలంగాణ రాష్ట్రాన్ని మాత్రం ప్రస్తావించలేదని విమర్శిస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు.. కేంద్రంతో సరైన సఖ్యత లేదని, తాము అధికారంలోకి వచ్చాక సత్సంబంధాలను నెరపుతున్నామని, దీనిని దృష్టిలో పెట్టుకునైనా గ్రాంట్లను మంజూరు చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి సహా రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తుతున్నారు. ఏపీలోని పోలవరం ప్రాజెక్టు పూర్తికి నిధులను విడుదల చేస్తామన్న కేంద్రం.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను విస్మరించడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదట కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ చేసేది. తర్వాతి క్రమంలో ఆ ప్రాజెక్టు పూర్తి కావడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో 'పాలమూరు-రంగారెడ్డి'కి జాతీయ హోదా ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పదేపదే కేంద్రాన్ని కోరుతూ వచ్చారు.

మూసీ సుందరీకరణకు పైసా ఇవ్వలే..

సబర్మతి రివర్ ఫ్రంట్, నమామీ గంగ తరహాలోనే మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులిస్తే.. హైదరాబాద్‌లో నదీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని కేంద్రానికి రాష్ట్రం వివరించింది. ఈ ప్రాజెక్టును రూ.లక్షన్నర కోట్లతో చేపడతామని సీఎం రేవంత్ తెలిపారు. అతి భారీ మొత్తం కావడంతో తప్పకుండా కేంద్ర సాయం అందుతుందని రాష్ట్రం ఆశించింది. కానీ, ఎలాంటి గ్రాంటునూ ప్రకటించలేదు. విభజన చట్టం హామీల మేరకు 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బీఆర్‌జీఎఫ్)' కింద కేంద్రం కేటాయించే నిధులనైనా ఇవ్వాలని కోరింది. 9 పాత ఉమ్మడి జిల్లాలకు రూ.50 కోట్ల చొప్పున ఏటా రూ.450 కోట్లు రావాలని పేర్కొంది. 2019 నుంచి రూ.2,250 కోట్లు రావాల్సి ఉందని తెలిపింది. బడ్జెట్‌లో ఈ నిధులను ప్రత్యేకించాలని కోరింది. కానీ, ఆ ఊసే లేదు. ఏపీలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలకు నిధులిస్తామని ప్రకటించినా తెలంగాణలోని వాటి గురించి మాటెత్తలేదు. బడ్జెట్‌లో తెలంగాణ బీఆర్‌జీఎఫ్ పదమే లేకపోవడం గమనార్హం. మరోవైపు హైదరాబాద్-నాగపూర్ పారిశ్రామిక కాడిడార్‌ను స్పృశించలేదు. హైదరాబాద్-బెంగళూరు కారిడార్ గురించి పేర్కొన్నా.. దానితో తెలంగాణకు ఒరిగిందేమీ లేదు.

'పాలమూరు-రంగారెడ్డి'కి పైసా ఇవ్వలేదు

కోచ్ ఫ్యాక్టరీ తూచ్.. బయ్యారం విస్మరణ

పదేళ్ల కిందట రాష్ట్ర విభజన సమయంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామంటూ కేంద్రం హామీ ఇచ్చింది. కానీ, కోచ్ ఫ్యాక్టరీకి బదులు ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు నిరుడు జూలైలో రైల్వే శాఖ ప్రకటించింది. ఇతర ప్రాంతాలకు కోచ్ ఫ్యాక్టరీలు ఇస్తూ దక్షిణ మధ్య రైల్వేలో కీలకమైన కాజీపేటలో ఎందుకు ఏర్పాటు చేయడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. ఈ బడ్జెట్‌లోనైనా దీనిని ఇస్తారని ఆశించినా అదేమీ జరగలేదు. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం మాటెత్తలేదు. ఐటీ రంగంలో కొత్త సంస్థలు, డెవలపర్లను ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌కు ప్రతిపాదించిన 'సమాచార సాంకేతిక పెట్టుబడుల ప్రాంతం (ఐటీఐఆర్)' ఊసు కూడా బడ్జెట్‌లో లేదు. తెలంగాణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ను ఏర్పాటు చేయాలని, కొత్తగా ఏర్పడిన జిల్లాలకు నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కోరినా విస్మరించారు. కనీసం ములుగులోని గిరిజన విశ్వవిద్యాలయానికి కూడా నిధులు కేటాయించకపోవడం పట్ల రాష్ట్ర నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా రూ.26 వేల కోట్లు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పన్నుల్లో వాటా కింద ఈసారి రాష్ట్రానికి రూ.26,216.38 కోట్లు రానున్నాయి. మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర పన్నుల వాటా తేలింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కలిపి కేంద్ర పన్నుల్లో వాటా కింద మొత్తం రూ.12,47,211 కోట్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

వివిధ రకాల పన్నుల్లో రాష్ట్ర వాటా (రూ.కోట్లలో)

కార్పొరేషన్ ట్యాక్స్	7872.25
ఆదాయ పన్ను	9066.56
సెంట్రల్ జీఎస్‌టీ	7832.19
కస్టమ్స్	1157.45
కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ	243.98
సర్వీస్ ట్యాక్స్	0.86
ఇతర పన్నులు, సుంకాలు	43.09

పీఎంఏవైతో 3కోట్ల ఇళ్లు..ఇందిరమ్మ ఇళ్లకు ఊతం!

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పీఎం ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద ఈ ఏడాది 3 కోట్ల ఇళ్లను నిర్మించాలని కేంద్రప్రభుత్వం తాజా బడ్జెట్‌లో నిర్ణయించింది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని సంకల్పించిన రేవంత్ సర్కారుకు ఈ పథకం ఊతమివ్వనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పీఎంఏవైలో చేరేందుకు సుముఖతను వ్యక్తం చేసింది. ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిసి.. 25 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. పీఎంఏవై కింద పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేల సాయాన్ని కేంద్రం అందజేస్తుంది. ఈ పథకంలో చేరాలనుకునే రాష్ట్రాలు.. ముందుగానే లబ్ధిదారుల జాబితాను కేంద్రానికి పంపాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పీఎంఏవైకి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి విధివిధానాలను రూపొందించాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. నిజానికి ఈ పథకం కింద 2017-18 నుంచి గత ఆర్థిక సంవత్సరం వరకు కేంద్రం తెలంగాణలో 1,58,584 ఇళ్ల నిర్మాణానికి సాయం చేయడానికి ఆమోదం తెలిపింది. కానీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై మొగ్గుచూపిన గత ప్రభుత్వం గ్రామీణ లబ్ధిదారుల జాబితాను కేంద్రానికి పంపలేదు.

రేపు రాష్ట్ర బడ్జెట్

27న బడ్జెట్‌పై సాధారణ చర్చ.. 31న ఆమోదం

» 26, 28న విరామం.. ఏడు పనిదినాలు

» అసెంబ్లీ బీఏసీ సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్‌ను గురువారం(ఈ నెల 25న) అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. అనంతరం 27న బడ్జెట్‌పై సాధారణ చర్చ చేపట్టి.. అదేరోజు సమాధానం ఇవ్వనుంది. ఈ నెల 29, 30 తేదీల్లో పద్దులపై చర్చ, ఆమోదం ఉంటాయి. 31న ద్రవ్య వినిమయ బిల్లుపై సభలో చర్చించి ఆమోదిస్తారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మరుసటి రోజు.. 26న సభకు విరామం ఇవ్వనున్నారు. అలాగే హైదరాబాద్ బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని 28న కూడా విరామం ఇస్తున్నారు. మంగళవారం మొదలుకుని 31 వరకు మొత్తం ఏడు పనిదినాలు ఖరారయ్యాయి. కాగా, స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో సమావేశమైన శాసనసభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తదుపరి సమావేశాలను పొడిగించాలా, వద్దా అన్నదానిపై నిర్ణయాధికారాన్ని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు అప్పగించింది. ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిలయ్య, బీఆర్ఎస్ఎల్పీ తరఫున మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎంఎల్పీ నుంచి మహ్మద్ బిన్ బలాలా, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు.

15 రోజులైనా నిర్వహించాలి

ఈ నెల 25న బడ్జెట్‌ను ప్రవేశపెట్టి.. 31 కల్లా ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించుకునే ప్రతిపాదన పట్ల బీఆర్ఎస్ఎల్పీ, బీజేఎల్పీ ప్రతినిధులు అభ్యంతరం తెలిపారు. బడ్జెట్, పద్దులపై చర్చించేందుకు కనీసం 15 రోజులైనా అసెంబ్లీ నిర్వహించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అయితే బీఆర్ఎస్ హయాంలో బడ్జెట్ సమావేశాలను మూడు రోజుల్లోనే ముగించిన సందర్భాలు కూడా ఉన్నాయని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నిబంధనల ప్రకారం ఈ నెల 31 కల్లా ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించుకోవాల్సి ఉందని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. కాగా, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు అసెంబ్లీలో ఇచ్చిన చాంబర్.. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా సౌకర్యంగా లేదని హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. ఆయనకు మరో చాంబర్‌ను కేటాయించాలని కోరారు. అయితే ప్రస్తుతం చాంబర్లేవీ ఖాళీగా లేవని, ప్రతిపాదనను పరిశీలిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో సీఎం రేవంత్ సహా పలు పార్టీల నేతలు

ధోవతీల కాంపిటీషన్ నడుస్తోందా!

శాసనసభకు ధోవతీ కట్టుకుని వచ్చిన బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి.. బీఏసీ భేటీకీ అలాగే వెళ్లారు. భట్టివిక్రమార్క కూడా ధోవతీనే ధరిస్తున్న నేపథ్యంలో.. శ్రీధర్‌బాబు వారిద్దరిని ఉద్దేశించి 'ధోవతీల కాంపిటీషన్ నడుస్తోందా?' అని సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో తమ మధ్య పంచాయితీ పెట్టవద్దంటూ భట్టి నవ్వేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఉస్మానియా వర్సిటీలో

బీటెక్ లేటరల్ ఎంట్రీ

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 24 జూలై 2024
diksuchi@andhrajyothy.com

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ(ఓయూసీటీ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో లేటరల్ ఎంట్రీ కింద రెండో ఏడాదిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. కెమికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ స్పెషలైజేషన్లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 30 చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు.

అర్హత: అభ్యర్థులు ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. వర్సిటీకి 50 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పనిచేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, సర్వీస్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.



ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన సిలబస్ నుంచి 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ట్యూషన్ ఫీజు:** ఏడాదికి రూ.70,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in, https://ouct.ac.in

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో బీఎఫ్ఎస్సీ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ(ఏపీఎఫ్‌యూ)- 'బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్(బీఎఫ్ఎస్సీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, వెబ్ కౌన్సెలింగ్ ఆధారంగా వర్సిటీకి చెందిన ఫిషరీ సైన్స్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆక్వాకల్చర్, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫిషరీస్ ఇంజనీరింగ్, ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్, ఫిషరీస్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అంశాలు బోధిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. మొదటి ఆరు సెమిస్టర్లలో క్లాస్ రూం టీచింగ్, ప్రాక్టికల్ క్లాసెస్, ల్యాబొరేటరీ ఎక్స్‌పరిమెంట్స్, ఫీల్డ్ విజిట్స్ ఉంటాయి. చివరి రెండు సెమిస్టర్లలో రూరల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ డెవలప్‌మెంట్ యోజన కింద ఫిషరీస్ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ప్రోగ్రామ్, ఫిషరీస్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్ ఉంటాయి.



ఏపీఎఫ్‌యూ కళాశాలలు-సీట్లు:

- ముత్తుకూరులోని కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్‌లో 40 సీట్లు, నరసాపురంలోని కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 100 సీట్లు ఉన్నాయి. అదనంగా పది శాతం సూపర్‌న్యూమరరీ సీట్లను ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రత్యేకించారు.
- 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన పిల్లలకు నిర్దేశించారు. ఈ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివి ఉండాలి. తల్లిదండ్రులు/అభ్యర్థి పేరుమీద కనీసం ఎకరం భూమి ఉండాలి.
- మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పోటీపడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్/నేచురల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఏపీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **ఎడిట్ ఆప్షన్ ఓపెన్:** ఆగస్టు 12 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్ తేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.apfu.ap.gov.in

నిమ్స్‌లో సర్టిఫికెట్ కోర్సు

హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- నెఫ్రాలజీ విభాగంలో నిర్వహిస్తున్న 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ ప్రోగ్రామ్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(నర్సింగ్/సైకాలజీ/లైఫ్ సైన్సెస్/డయాలసిస్ టెక్నాలజీ)/ఎంబీబీఎస్/ఎండీ-హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ఎంట్రెన్స్ టెస్ట్: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో బేసిక్ కాన్సెప్ట్స్, అడ్వాన్స్‌డ్ మిసిలేనియస్ టాపిక్స్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్, హార్ట్ అండ్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ అంశాల నుంచి ఒక్కోదానిలో పది మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 50. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 10
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **అభ్యర్థుల ఈ మెయిల్‌కు హాల్ టికెట్స్ పంపు తేదీ:** ఆగస్టు 19
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 24
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 27
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్- 500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in



ఆర్ఐఎంసీలో ప్రవేశాలు

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీ(ఆర్ఐఎంసీ)లో ఎనిమిదో తరగతి(2025 జూలై టర్మ్) ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025 జూలై 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2025 జూలై 1 నాటికి పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష వివరాలు: మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125, మేథమెటిక్స్ నుంచి 200 జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.



దరఖాస్తు విధానం: విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి ఏపీపీఎస్సీ చిరునామాకు పంపించాలి. దరఖాస్తు ఫీజును డీడీ ద్వారా కూడా ఆర్ఐఎంసీకి పంపవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** మున్సిపల్ కార్పొరేషన్/గ్రామ పంచాయతీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్; నివాసం, కులం ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; విద్యార్థి ఫొటోలు 2
- **చిరునామా:** అసిస్టెంట్ సెక్రటరీ(ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్‌టీఏ ఆఫీస్ దగ్గర, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, ఎంజీ రోడ్, విజయవాడ- 520010, ఆంధ్రప్రదేశ్
- **ఆర్ఐఎంసీ చిరునామా:** రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్, గర్హి కంటోన్మెంట్, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248003
- **పరీక్ష తేదీ:** డిసెంబరు 1
- **పరీక్ష కేంద్రం:** విజయవాడ
- **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in/


లిటిల్స్



మీకు తెలుసా?

- చిన్న ఎలుకలా ఉండే ఈ జీవిని యూరోపియన్ హెడ్జ్‌హాగ్, కామన్ హెడ్జ్‌హాగ్ అని పిలుస్తారు.
- 15 సెం.మీ నుంచి 30 సెం.మీ పొడవు మాత్రమే ఉంటుంది. రెండు కేజీల వరకూ బరువు ఉంటుంది.
- నల్లటి ముక్కు, గోధుమరంగు ముఖం ఉండే ఈ జంతువు మీద వేలకొద్ది స్పైన్స్ ఉంటాయి. 160 మిలీమీటర్లు మాత్రమే ఈ పదునైన స్పైన్స్ ఉంటాయి. ఇవి పెద్దయ్యాక 260 మి.మీటర్లు పెరుగుతాయి. ప్రతి ఒక్కటి రాలిపోయి మళ్లీ వస్తాయి. ఇదో బంతిలా చుట్టుకుంటుంది. గంటకు పంతొమ్మిది కిలోమీటర్ల వేగంతో పరిగెత్తుతుంది.
- ఈ జీవులు అధికంగా యూరప్ దేశాలయిన ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో కనిపిస్తాయి.
- ఇవి చిన్న గూళ్లలాంటివి చెట్లమీద, తొర్రల్లో కట్టుకుంటాయి. రాత్రితో పాటు పగలు కూడా చెట్ల ఆకుల్లో నిద్రపోతాయి.
- వీటి చూపు తక్కువ. దీంతో ఆహారాన్ని వాసనపట్టి మాత్రమే వెంటాడతాయి. చిన్న పురుగులు, మిడతలను తింటాయివి.
- ఇవి పుట్టిన 32 రోజుల వరకూ చూడలేవు. కళ్లు కనపడవని చెప్పవచ్చు. స్పైన్స్‌కూడా మెత్తగా ఉంటాయి.
- వీటిలో 15 రకాల జాతులున్నాయి.
- హెడ్జ్‌హాగ్‌ల జీవనకాలం కేవలం రెండేళ్లు.





5 తేడాలు గుర్తించండి?







సరైన నీడ ఏది?

డైలీ సుడోకు - 366

8		1					9	2
6	7	4	9					8
5			1	8		3		
1	6			4	8	7		9
7		2	5	6			1	3
		3		5	7			1
4					3	5	8	7
9	5					2		4

సుడోకు - 365 సమాధానం

2	1	3	4
3	4	2	1
4	3	1	2
1	2	4	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

Legrand Empowering Scholarship Program 2024-25

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.

- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of the course based on academic performance. Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Last Date to Apply: 10-08-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/LFLS9

SCHOLARSHIP ALERT

Description: Schaeffler India is inviting applications from individuals between 18 and 35 years of age to recognize and reward those individuals who are developing unique sustainable solutions that have the potential to positively impact the society in India.

Schaeffler India Social Innovator Fellowship Program

Eligibility: Applicants should belong to the age group of 18 to 35 years (as on 1st July 2024). They should be residents of India. Early-stage start-ups or NGOs with functioning prototypes can participate.

Prizes & Rewards: Inspirational Fellowship grant coupled with personalized mentorship at IIMA Ventures and access to extensive networking opportunities.

Last Date to Apply: 15-08-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/SIA3

Raman Kant Munjal Scholarships

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 02-08-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/RMKSP4



buddy4study.com